ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం 30.11.2025 | సంపుటి : 12 సంచిక : 130 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370
హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

సామాన్యుని స్వరం
JANAMSAKSHI TV



## ముగిసిన తొలివిడత సర్పంచుల నామినేషన్లు

**4,236 జీపీలోని 37,440 వార్డుల్లో నామినేషన్లు**

**నేడు పరిశీలన.. ఉపసంహరణ గడువు డిసెంబరు 3**

**రెండో విడత షురూ..**

హైదరాబాద్(జనంసాక్షి):పంచాయతీ ఎన్నికలు మొదటి దశకు సంబంధించి నామినేషన్ల గడువు శనివారం సాయంత్రం ముగిసింది. మొదటి విడతలో 4,236 గ్రామపంచాయతీలు, 37,440 వార్డుల్లో నామినేషన్లు స్వీకరించారు. ఆదివారం వివరాలు వెల్లడించనున్నారు. సోమవారం అప్పీళ్ల స్వీకరణ, డిసెంబరు 2న అప్పీళ్ల పరిష్కారం ఉంటుంది. డిసెంబరు 3న నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగియనుంది. అదే రోజు పోటీలో ఉన్న అభ్యర్థుల వివరాలు వెల్లడిస్తారు. వచ్చే నెల 11న పోలింగ్, ఓట్ల లెక్కింపు, ఉపసర్పం చి ఎన్నిక ఉంటుందని అధికారులు తెలిపారు. రేపటి నుంచి డిసెంబరు 2 వరకు రెండో విడత ఎన్నికల నామినేషన్లు స్వీకరించనున్నారు. రెండో విడతలో 193 మండలాల్లోని 4,333 పంచాయతీలు, 38,350 వార్డుల్లో ఎన్నికలు జరగనున్నాయి.

## మరో ఏకగ్రీవం

- కొండమల్లేపల్లి సర్పంచిగా ఏకగ్రీవ ఎన్నిక..
- రూ.51 లక్షల నిధులు సమకూర్చుతానని హామీ

2లో..




## తెలంగాణ రైజింగ్ సమ్మిట్‌లో భారీ రోడ్ షో

**గిన్నిస్‌బుక్ రికార్డుకు సర్కారు సన్నాహాలు**



- సదస్సును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ప్రభుత్వం
- కట్టుదిట్టమైన భద్రత, అణువణువునా తనిఖీలు
- ఏర్పాట్లపై ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల సమీక్ష
- ఎప్పటికీ గుర్తుండిపోయేలా అంతర్జాతీయ స్థాయిలో ఏర్పాట్లు

హైదరాబాద్(జనంసాక్షి): రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్-2047ను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగాభారీ రోడ్‌షోను నిర్వహించనున్నారు. ఇది గిన్నిస్ బుక్ రికార్డుకు సాధించేలా సన్నాహాలు చేస్తున్నారు. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేటలోని ఫ్యూచర్ సిటీలో వచ్చే నెల 8, 9 తేదీల్లో ఈ అంతర్జాతీయ సదస్సును నిర్వహించేందుకు యుద్ధ ప్రాతిపదికన పనులు చేస్తోంది. సుమారు 100 ఎకరాల విస్తీర్ణంలో ఈ సదస్సును నిర్వహించనున్నారు. ఈ సమిట్‌ను విజయవంతం చేయడంపై అన్ని శాఖల సమన్వయ సమావేశాన్ని శుక్రవారం ఫ్యూచర్ సిటీలో నిర్వహించారు. జాతీయ, అంతర్జాతీయ పారిశ్రామికవేత్తలు మిగతా 2లో..



## తెలంగాణకు కాంగ్రెస్ శత్రువు

- కేసీఆర్ లేకపోతే తెలంగాణ ఉద్యమం లేదు
- ఆయన ఎప్పుడు రావాలో అప్పుడే వస్తారు
- కొందరు మూర్ఖులు కనిపించడం లేదంటున్నారు
- కేసీఆర్‌ది దొంగదీక్షన్న వారికి ఉద్యమం ఏంతెలుసు?
- కాంగ్రెస్ నేతలపై మండిపడ్డ బీఆర్‌ఎస్ నేత కేటీఆర్
- రాష్ట్రవ్యాప్తంగా బీఆర్‌ఎస్ దీక్షా దివస్ వేడుకలు

హైదరాబాద్(జనంసాక్షి): కేసీఆర్ దీక్షా స్ఫూర్తితో తాము పోరాడుతున్నట్లు మాజీ మంత్రి కేటీఆర్ తెలిపారు. తెలంగాణకు మొదట్నుంచీ కాంగ్రెస్ విలన్ అని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి.. కేసీఆర్ పేరు లేకుండా ఒక్క ప్రసంగమైనా చేశారా? అని ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు."కేసీఆర్ ఏడాదిన్నరగా బయటకు రావట్లేదని అంటున్నారు. గోడకు వేలాడదీసిన తుపాకీ కూడా సైలెంట్‌గానే ఉంటుంది. నాయకుడు ఎప్పటికైనా నాయకుడే. పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేలు రాజీనామా చేసి వస్తే సంగతి తెలుస్తుంది. తెలంగాణ తల్లిని అవమానించే ప్రయత్నం కాంగ్రెస్ చేస్తోంది. తెలంగాణ తల్లిని తీసి కాంగ్రెస్ తల్లిని పెట్టారు" అని కేటీఆర్ మండిపడ్డారు.కొందరు మూర్ఖులు కేసీఆర్ కనిపించడం లేదని అంటున్నారని..గోడకు వేలాడదీస్తే తుపాకీ కూడా మౌనంగానే ఉంటుందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ లేకపోతే తెలంగాణ లేదని స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొనని వారు కేసీఆర్‌ను విమర్శిస్తున్నారని మండిపడ్డారు. పీసీసీ అధ్యక్షుడు కేసీఆర్ దీక్ష.. దొంగ దీక్ష అని మాట్లాడుతున్నారని.. అడ్డమైన మాటలు కొందరు మిగతా 2లో..

## గ్లోబల్ సమ్మిట్ పేరుతో రియల్ వ్యాపారం

**భూములు అమ్ముకునే సీఎం రేవంత్ కుట్ర: హరీశ్**

సిద్దిపేట(జనంసాక్షి):గ్లోబల్ సమ్మిట్ పెట్టి భూములు అమ్ముకునేందుకు రేవంత్‌రెడ్డి ప్లాన్ చేస్తున్నారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై మాజీ మిగతా 2లో..

## నీ మాటలు ప్రజలు నమ్మరు

- దీక్షా దివస్ పేరుతో బీఆర్‌ఎస్ డ్రామాలు
- ప్రజలకు పదేళ్లలో చేసిన అభివృద్ధి ఏంటో చెప్పాలి
- కేటీఆర్‌పై మండిపడ్డ మంత్రి సీతక్క



హైదరాబాద్(జనంసాక్షి): బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఒక్కరోజే దీక్షా దివస్ చేసేవాళ్లని.. అధికారం పోయిన తర్వాత ఇప్పుడు పది రోజుల పాటు దీక్షా దివస్ పేరుతో నాటకాలు ఆడుతున్నారని మంత్రి సీతక్క విమర్శించారు. ప్రజలకు పదేళ్లలో చేసిన అభివృద్ధి ఏంటో ఈ దీక్షా దివస్‌లో చెప్పాలని డిమాండ్ చేశారు. రెండు సంవత్సరాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఎంతో చేసిందన్నారు. ఈ విజయాలను ప్రజలకు వివరించేందుకు తాము 10 రోజులపాటు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని.. మిగతా 2లో..



## దిత్వా కల్లోలం

**తుపాను ధాటికి శ్రీలంకలో 123మంది మృతి**

- మరికొందరి ఆచూకీ గల్లంతు
- దేశంలో అత్యవసర పరిస్థితి ప్రకటన
- తమిళనాడులో హై అలర్ట్
- రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలు
- ఏపీ వైపు దూసుకొస్తున్న తుఫాన్
- మూడురోజుల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు
- అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించిన విపత్తుల నిర్వహణ సంస్థ

కొలంబో,చెన్నై,అమరావతి(జనంసాక్షి): దిత్వా తుఫాను కారణంగా శ్రీలంక చిగురుటాకులా వణికింది. ఈ ఆకస్మిక వర దలు, కొండచరియలు విరిగిపడటంతో ఇప్పటి వరకు 123 మంది మరణించ గా.. అనేక మంది గల్లంతయ్యారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ క్రమంలో శ్రీలంక ప్రభుత్వం దేశంలో అ త్యవసర పరి స్థితిని ప్రకటించింది. తుపాను ప్రభావంతో వరదల వల్ల ఏర్పడిన విధ్వంసం కారణంగా తలెత్తిన అత్యవసర పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని శ్రీలంక అధ్యక్షుడు అనుర కుమార దిసనాయకే దేశమమంతటా మిగతా 2లో..

**పైరసీ అడ్వాన్స్ టెక్నాలజీపై**

## ఐ బొమ్మ రవి పోలీసులకు పాఠాలు

- ఐబొమ్మ పూర్తిపేరు ఇంటర్నెట్ బొమ్మగా వెల్లడి
- తాను అప్‌లోడ్ చేసిన సినిమాలన్నీ టెలిగ్రామ్ నుంచి తీసుకున్నవేనని అంగీకారం
- అతడి నుంచి కీలక సమాచారం సేకరణ
- మూడు రోజుల కస్టడీ అనంతరం చంచల్‌గూడకు తరలించిన పోలీసులు



హైదరాబాద్(జనంసాక్షి): ఐబొమ్మ పూర్తిపేరు 'ఇంటర్నెట్ బొమ్మ' అని ఈ కేసులో అరెస్టయిన ఇమంది రవి వెల్లడించాడు. విశాఖలో సినిమాను బొమ్మగా పిలిచేవాళ్లమని చెప్పాడు. మరో వెబ్‌సైట్‌కు బలపం అని పేరు పెట్టాలని అనుకున్నట్లు తెలిపాడు. డొమైన్‌లో సాంకేతిక సమస్యతో 'ఎల్' అక్షరం తీసి బప్పంగా మార్చినట్లు వెల్లడించాడు. రెండో విడత కస్టడీలో భాగంగా పోలీసులు 3 రోజులపాటు ప్రశ్నించి.. కీలక సమాచారం సేకరించారు. పైరసీ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ గురించి పోలీసులకు రవి వివరించాడు. తాను అప్‌లోడ్ చేసిన సినిమాల్నీ టెలిగ్రామ్ నుంచి తీసుకున్నవేనని చెప్పాడు. అనంతరం నిందితుడిని కోర్టులో హాజరుపర్చారు. రవి మెయిల్ అకౌంట్స్ మిగతా 2లో..

## విద్యుత్ ప్రాజెక్టుల్లో ఎలాంటి కుంభకోణాలు లేవు

**ఆరోపణలు శుద్ధ అబద్ధం: భట్టి**

- 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీమే లక్ష్యసాధనతో ప్రభుత్వం ముందుకెళ్తోంది
- రాష్ట్రంలో విద్యుత్ అవసరాలు తీర్చేందుకు ప్రణాళికలు
- ఈ రంగంలో పెట్టుబడులు పెరగాలి
- స్టోరేజీకి అనుగుణంగా గ్రీన్ ఎనర్జీ : డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ నూతనంగా చేపట్టబోతున్న విద్యుత్ ప్రాజెక్టుల్లో ఎటువంటి కుంభకోణాలు లేవని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు.గ్రీన్ ఎనర్జీ.. దేశ, ఆయా రాష్ట్రాల అభివృద్ధికి చాలా అవసరమని చెప్పారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా గ్రీన్ ఎనర్జీ అనే చర్చ జరుగుతుందని అన్నారు. పారిస్ లో జరిగిన అగ్రిమెంట్ ప్రకారం అభివృద్ధి చెందుతున్న దేశాల్లో 50 శాతం తప్పకుండా గ్రీన్ ఎనర్జీ ఉండాలని అగ్రిమెంట్ చేసిన విషయాన్ని ఆయన ఈ సందర్భంలో గుర్తు చేశారు. తెలంగాణ భవిష్యత్ విద్యుత్ అవసరాలకు ప్రణాళికలు సిద్ధం చేశామని, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ ఎకానమీ టార్గెట్‌తో తెలంగాణ ముందుకు పోతుందని భట్టి వెల్లడించారు. తెలంగాణ ప్రపంచ దేశాలతో పోటీపడే విధంగా తీర్చి దిద్దుతున్నామని, హైదరాబాద్ గ్లోబల్ హబ్ కాబోతోందని భట్టి తెలిపారు. 2047 వరకు మూడు ట్రిలియన్‌ల ఎకానమీకి చేరుకోవాలనేది లక్ష్యమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. అందుకు కావలసిన పెట్టుబడులకు అవసరమైనది విద్యుత్ అన్నారు. అనుకున్న లక్ష్యం చేరుకోవడానికి ప్లానింగ్ చేస్తున్నాం.. పవర్ డిమాండ్ రాష్ట్రంలో పదేళ్లుగా పెరుగుతుందని తెలిపారు. తాజాగా ప్రజా భవన్‌లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.. 2014 నుంచి విద్యుత్తు 14.2 డిమాండ్ గ్రోత్ ఉందన్నారు.. 2020-2021 నుంచి 5.44 గ్రోత్, 2024- 25లో 9.8 శాతం గ్రోత్ కనిపించిందని వెల్లడించారు. 2025 నుంచి 34, 35 వరకు తెలంగాణలో 6.4 గ్రోత్ ఉండే అవకాశం ఉందని స్పష్టం చేశారు. మూసి ప్రక్షాళన.. ఫ్యూచర్ సిటీ.. పెట్టుబడుల ఒప్పందం.. పరిశ్రమలు.. డేటా సెంటర్లతో హైదరాబాద్ గ్లోబల్ హబ్‌గా మారబోతోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. 8.50 గ్రోత్ ఉండబోతుంది.. 2047 కి లక్ష 39 వేల మెగావాట్ల విద్యుత్ అవసరం.. తెలంగాణలో 2026 ఏప్రిల్ నాటికి 24769 మెగావాట్ల విద్యుత్ అందుబాటులో ఉంది.. వాడే విద్యుత్తులో 50 శాతం గ్రీన్ ఎనర్జీ వాడాలి.. ఎనర్జీ స్టోరేజ్ ప్లాన్ గతంలో లేదు.. పదేళ్ల క్రితం ప్లాన్ చేసుకుని ఉంటే బాగుండేది.. అవసరాలకు అనుగుణంగా ఎనర్జీ స్టోరేజ్ ప్లానింగ్ లేదు.. గ్రీన్ పవర్ ఎనర్జీ స్టోరేజ్‌కి తెలంగాణ అనుకూలం.. పదేళ్లుగా ఇలాంటి ప్రయత్నాలు చేయలేదు.. కానీ ఏపీ మొదలుపెట్టింది.. మిగతా 2లో..

## శరవేగంగా 'మామునూరు'

- విమానాశ్రయం నిర్మాణం పూర్తయ్యాక ముందుగా ఏటీఆర్ విమానాలు నడుపుతాం
- చురుకుగా కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులు
- అమృత్ పథకం కింద వరంగల్ జిల్లాకు రూ.874 కోట్లు మంజూరు
- వరంగల్ పర్యటనలో మీడియాతో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



హన్మకొండప్రతినిధి(జనంసాక్షి): వరంగల్ విమానాశ్రయం నిర్మాణ పనులు వేగవంతం చేయాలని నిర్ణయించామని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వెల్లడించారు. ఇక్కడి నుంచి ముందుగా ఏటీఆర్ విమానాలు నడపాలని భావిస్తున్నట్లు తెలిపారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి శనివారం వరంగల్‌లో పర్యటించారు. పలు అభివృద్ధి పనులపై అధికారులతో మిగతా 2లో..



## నిబంధనలు పాటించని స్లీపర్ బస్సులను తక్షణం పక్కన పెట్టేయండి

**రాష్ట్రాలకు జాతీయ మానవ హక్కుల కమిషన్ ఆదేశం**

న్యూఢిల్లీ(జనంసాక్షి):ఇటీవల దేశంలోని పలు ప్రాంతాల్లో వరుసగా జరుగుతున్న బస్సు ప్రమాదాలతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రైవేటు బస్సుల్లో భద్రతపై జాతీయ మానవ హక్కుల కమిషన్ రాష్ట్ర ప్రభుత్వాలకు కీలక సూచనలు చేసింది. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న స్లీపర్ బస్సులను పక్కన పెట్టేయాలని అన్ని రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులకు మార్గదర్శకాలు జారీ చేసింది.దూర ప్రాంతాలకు వెళ్లే ప్రైవేటు స్లీపర్ బస్సుల్లో ఇటీవల మిగతా 2లో..

**దైవదర్శనం కోసం వెళ్తూ**

## మృత్యుఒడిలోకి..

**రెండు కార్లు ఢీకొని ఇద్దరు చిన్నారులు సహా ఐదుగురు మృతి**

- కర్నూలు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం
- మంత్రాలయం దర్శనం కోసం వస్తుండగా ఘటన
- మృతులు కర్నాటక వాసులుగా గుర్తింపు



కర్నూలు(జనంసాక్షి): కర్నూలు జిల్లా పరిధిలో శనివారం ఉదయం రెండు రోడ్డు ప్రమాదాలు సంభవించాయి. ఓ ప్రమాదంలో రెండు కార్లు ఢీకొని ఐదుగురు కర్నాకట వాసులు దుర్మరణం చెందారు. ఎమ్మిగనూరు నియోజకవర్గ పరిధిలోని కొటేకల్ గ్రామం వద్ద ఈ ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది.. రెండు కార్లు ఢీకొన్న ఈ ఘటనలో ఇద్దరు చిన్నారులు సహా మొత్తం ఐదుగురు మృత్యువాత పడ్డారు. మరో నలుగురు గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆదోనికి తరలించారు. కర్ణాటక నుంచి శ్రీ రాఘవేంద్ర స్వామి మఠం దర్శనం కోసం మంత్రాలయం వెళ్తుండగా.. కోటేకల్ గ్రామ సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. మృతులంతా ఒకే కుటుంబానికి చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. వీరిని కర్ణాటక మిగతా 2లో..

## విభేదాలు తొలగిపోయాయి

- డీకేకు నాకు మధ్య ఎలాంటి భేదాభిప్రాయాలు లేవు
- రేపటి నుంచి ఎలాంటి గందరగోళం ఉండదు
- కేసీ వేణుగోపాల్ సూచనల మేరకే మేం బ్రేక్‌ఫాస్ట్ భేటీలో పాల్గొన్నాం
- కానీ ఏ విషయంపై చర్చించలేదు: సిద్ధరామయ్య
- సీఎంతో కలిసి పనిచేస్తా: డీకే శివకుమార్



బెంగుళూరు(జనంసాక్షి): కర్ణాటక సీఎం కుర్చీ కోసం సమరం వేళ కాంగ్రెస్ అధిష్ఠానం ఆదేశాల మేరకు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ లు శనివారం బ్రేక్‌ఫాస్ట్ చేసేందుకు ఒక్క చోట కలిశారు. అనంతరం సిద్ధరామయ్య మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. తమ మధ్య గతంలో ఎలాంటి భేదాభిప్రాయాలు లేవని.. ఇకముందు కూడా ఉండబోవని స్పష్టంచేశారు. కేసీ వేణుగోపాల్ సూచనల మేరకు తాము బ్రేక్‌ఫాస్ట్ భేటీలో పాల్గొన్నామని.. కానీ ఏ విషయం పైనా చర్చించలేదని తెలిపారు. నెల రోజుల ముందు నుంచి అందరిలో ఉన్న గందరగోళానికి తెరదించేందుకే ఈ బ్రేక్‌ఫాస్ట్ భేటీ జరిగిందన్నారు. భాజపా-జేడీఎస్ తమపై అసత్య ప్రచారాలు చేస్తోందని సిద్ధరామయ్య దుయ్యబట్టారు. ప్రతిపక్షాల అసత్య ప్రచారాలను తాను, డీకే ఉమ్మడిగా ఎదుర్కొంటామన్నారు. ప్రస్తుతం తమ పార్టీ 2028 ఎన్నికలు, స్థానిక ఎన్నికల పైనే ప్రధానంగా దృష్టిసారించినట్లు తెలిపారు. 2028లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పని చేస్తామన్నారు. కాగా కర్ణాటక ప్రజల మద్దతుతో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మిగతా 2లో..



## రేపటి నుంచి పార్లమెంట్ శీతాకాల సమావేశాలు

**నేడు రాజ్‌నాథ్ అధ్యక్షతన అఖిలపక్ష భేటీ**

12లో..

## విద్యుత్ ప్రాజెక్టులో ఎలాంటి కుంభకోణాలు లేవు

తెలంగాణలో మాత్రం ఆ ప్రయత్నమే లేదు.. థర్మల్ పవర్ కంటే.. గ్రీన్ ఎనర్జీ వస్తుంది.. కానీ తెలంగాణ అందుకోలేక పోయింది. మేము అధికారంలోకి వచ్చిన తర్వాత.. డిలైట్ లాంటి వాళ్ళను నివేదిక ఇవ్వండి అని అడిగాం.. ఒక్కరోజు బ్లాక్ ఔట్ అయితే 1500 నుండి 2000 కోట్లు నష్టపోతం.. అని వెల్లడించారు.

## నిబంధనలు పాటించని స్లీపర్ బస్సులను తక్షణం పక్కన పెట్టేయండి

ఘోర ప్రమాదాలు సంభవించడంతో అనేకమంది ప్రాణాలు కోల్పోయారు. భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం, తనిఖీలు చేపట్టకపోవడం, అత్యవసర ద్వారాలను మూసేసి, అగ్నిప్రమాదం జరిగితే నియంత్రించే పరికరాలు లేకుండా, ఇష్టానుసారం బస్సులను మార్పులు చేర్పులు (ఆల్ట్రేషన్)తో నడపడం వంటి కారణాల వల్లే ఈ ప్రమాదాలు జరిగినట్లు నివేదికలు పేర్కొంటుండడంతో బస్సు ప్రయాణాలపై ప్రజల్లో ఆందోళన నెలకొంటుంది. కర్నూలు, సౌదీ బస్సు ప్రమాదాల నేపథ్యంలో ట్రావెల్స్ బస్సుల్లో ప్రయాణం ఎంతవరకు సురక్షితమనే ప్రశ్నలు ఎదురవుతున్నాయి. దీంతో నిబంధనలు ఉల్లంఘించి, ప్రయాణికుల ప్రాణాలను పణంగా పెడుతున్న ట్రావెల్స్ సంస్థలపై అధికారులు కఠిన చర్యలు తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో పలువురు ఫిర్యాదు చేయడంతో మానవ హక్కుల కమిషన్ అన్ని రాష్ట్రాలకు ఆదేశాలు జారీ చేసింది.

ప్రమాదాలకు ఇవీ కారణాలు

ప్రస్తుతం తిరుగుతున్న బస్సుల్లో 50 శాతం పైగా స్లీపర్ ఏసీ బస్సులే ఉంటున్నాయి. వీటి లోపల భాగం ఇరుగ్గా ఉంటోంది. అగ్ని ప్రమాదాలు, రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు వెంటనే బయటకు వచ్చే అవకాశం తక్కువ.ప్రతి బస్సులోనూ అగ్ని ప్రమాదాలను నియంత్రించే రక్షణ వ్యవస్థ ఉండాలి. చాలా వాటిల్లో ఇలాంటివి ఉండటం లేదు. ట్రావెల్స్ సంస్థలు బస్సుల కండీషన్‌పై ఎప్పటికప్పుడు తనిఖీలు చేపట్టకపోవడం అత్యవసర ద్వారం ఉన్నచోట్ల కూడా సీట్లు ఏర్పాటు, అదనపు సీట్ల నిర్మాణంతో ప్రమాద సమయాల్లో ఇవి అంతగా ఉపయోగపడటం లేదు.స్లీపర్ బస్సుల అడుగు భాగంలో సరకు నిల్వకు ఏర్పాట్లు ఉంటాయి. వీటిలో అగ్ని ప్రమాదాలు జరిగితే నేరుగా ప్రయాణికులపై ప్రభావం చూపుతున్నాయి.

## శరవేగంగా 'మామునూరు'

సమీక్షించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. ఆ తర్వాత పౌరుల స్పందన బట్టి మరిన్ని సర్వీసులు నడుపుతాం అన్నారు.. కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులు కూడా వేగంగా సాగుతున్నాయి. అమృత్ పథకం కింద వరంగల్ జిల్లాకు రూ.874 కోట్లు మంజూరయ్యాయి. కాజీపేట రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులు త్వరగా పూర్తి చేయాలని చెప్పామని అన్నారు. హృదయ్ పథకం కింద పురాతన ఆలయాల పునరుద్ధరణకు కేంద్రం నిధులు ఇచ్చింది. రామప్ప ఆలయం అభివృద్ధి కోసం కేంద్రం రూ.146 కోట్లు ఖర్చు చేస్తోందని కిషన్‌రెడ్డి వివరించారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై కాంగ్రెస్‌కి చిత్తశుద్ధి లేదని కిషన్‌రెడ్డి విమర్శలు చేశారు. బీసీలకు కాంగ్రెస్ అన్యాయం చేసిందని ఆరోపించారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్‌దే పూర్తి బాధ్యత అని.. ఈ విషయంలో ఆ పార్టీది కపటనాటకమని ఎద్దేవా చేశారు. బీజేపీకి ప్రధాన శత్రువు కాంగ్రెస్ మాత్రమే అని స్పష్టం చేశారు. రిజర్వేషన్లపై బీఆర్‌ఎస్‌కు మాట్లాడే నైతికత లేదని ఆక్షేపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజారిటీ స్థానాలు బీసీలకే కేటాయిస్తామని పేర్కొన్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు ఫిరాయింపులను ప్రోత్సహించాయని మండిపడ్డారు. బీసీలకు ఇచ్చే సీట్లలో ముస్లింలు పోటీచేసే అవకాశం ఉందని.. ఇది బీసీలకు అన్యాయం చేసినట్లు కాదా…? అని ప్రశ్నించారు. మేడారం జాతరకు కేంద్ర ప్రభుత్వం నిధులు ఇస్తుందని స్పష్టం చేశారు కిషన్‌రెడ్డి.మామునూరు ఎయిర్‌పోర్ట్‌కు సంబంధించిన భూసేకరణ చివరి దశలో ఉందని చెప్పుకొచ్చారు. ఎయిర్‌పోర్ట్ విషయంపై కొంతమంది రైతులు కోర్టుకెళ్లారని.. తాము చట్టపరంగా ముందుకు వెళ్తామని స్పష్టం చేశారు. ఈ విషయంపై ఎయిర్‌లైన్స్ కంపెనీలతో తాము మాట్లాడుతున్నామని వివరించారు. ఎయిర్‌పోర్ట్‌లు కట్టడమే కేంద్రం బాధ్యత అని.. విమానాలు నడిపేది ప్రైవేటు కంపెనీలేనని తెలిపారు. హైదరాబాద్ నుంచి పరిశ్రమలు పోతే మధ్యతరగతి ప్రజలు ఇబ్బందులు పడతారని.. ఈ విషయంపై తాము పోరాడుతున్నామని చెప్పుకొచ్చారు. పరిశ్రమలపై సీఎం రేవంత్‌రెడ్డి ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నారని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

## పైరసీ అడ్వాన్స్ టెన్నాలజీపై ఐ బొమ్మ రవి పోలీసులకు పాఠాలు

రిట్రైవ్ చేసిన సైబర్ క్రైమ్ పోలీసులు.. ఐబొమ్మ, బప్పం వెబ్‌సైట్స్‌లో 21వేలకు పైగా సినిమాలను గుర్తించారు. పైరసీ వెబ్‌సైట్స్ నుంచి సినిమాలు రికార్డింగ్ చేసినట్టు గుర్తించారు. ఓటీటీలో వచ్చే సినిమాలను కూడా రికార్డింగ్ చేసినట్టు రవి అంగీకరించినట్లు తెలిసింది. రికార్డింగ్ చేసిన ఆడియోలు, వీడియోల క్వాలిటీ పెంచేందుకు.. కరేబియన్ దీవుల్లో ఔట్‌సోర్సింగ్ వారితో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలుస్తోంది.పైరసీ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ గురించి రవి పోలీసులకు వివరించాడు. తాను నిర్వహించిన వెబ్‌సైట్లపై కూడా క్లారిటీ ఇచ్చాడు. ఐబొమ్మ పూర్తిపేరు ఇంటర్నెట్ బొమ్మగా వెల్లడించాడు. విశాఖలో సినిమాను బొమ్మగా పిలిచేవాళ్లమని.. బొమ్మను ఇంటర్నెట్‌లో చూపిస్తున్నందుకే ఐబొమ్మ అని పేరు పెట్టినట్లు చెప్పాడు. మరో వెబ్‌సైట్‌కు బలపం పేరు పెట్టాలని భావించినట్లు తెలిపాడు. అయితే డొమైన్‌లో సాంకేతిక సమస్యతో ఒ అక్షరం తీసి బప్పంగా మార్చినట్లు వివరించాడు. తాను అప్‌లోడ్ చేసిన సినిమాలన్నీ టెలిగ్రామ్ నుంచి తీసుకున్నవే అని రవి అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు.

## తెలంగాణ రైజింగ్ సమ్మిట్‌లో భారీ రోడ్ షో

హాజరు కానున్న ఈ సదస్సులో అతిథులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు సమగ్రంగా చర్చించారు. కీలక నిర్ణయాలు తీసుకున్నారు. వీటిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు సమక్షంలో చర్చించి తుది నిర్ణయం తీసుకోనున్నారు. టి-ఫైబర్ ఆధ్వర్యంలో 10 గిగా బైట్స్ పర్ సెకండ్ (జీబీపీఎస్) వేగంతో సదస్సు జరిగే రెండు రోజుల పాటు నిరంతర ఇంటర్నెట్ కోసం ఏర్పాట్లను ముమ్మరం చేశారు. దీనిద్వారా సుమారు 10 వేల మందికి వైఫై ఉచితంగా లభించనుంది. సదస్సు ప్రాంగణానికి అనుమతి ఉన్న వారికి మాత్రమే వైఫై పాస్‌వర్డ్‌ను ఇవ్వనున్నారు.సదస్సు సమీపంలో 3 హెలిప్యాడ్‌లను నిర్మించనున్నారు. సదస్సుకు చేరుకోవడానికి వీలుగా హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి నుంచి ఫ్యూచర్ సిటీ అథారిటీ వరకు రహదారులను మరమ్మతు చేసేందుకు ప్రక్రియను ముమ్మరం చేశారు. అలాగే సదస్సు పరిసరాల్లో కొత్త రోడ్లు రూపుదిద్దుకోనున్నాయి.వచ్చే నెల 4, 5 తేదీల్లో ప్రాంగణం వెలుపలి భాగంలో డ్రై రన్ చేయనున్నారు. ఈవెంట్? అచ్చంగా 8, 9 తేదీల్లో ఎలా జరుగుతుందో అలా రిహార్సల్ చేసి, ప్రతి ఒక్కటీ చెక్ చేయనున్నారు. వచ్చే నెల 6వ తేదీన ప్రాంగణం లోపల ఈ ప్రక్రియను నిర్వహించనున్నారు.అతిథుల వాహనాల పార్కింగ్‌కు ఆరు స్థలాలను ఎంపిక చేశారు. సదస్సు సమీపానికి ముఖ్యమంత్రి, ఇతర అతి ముఖ్యుల వాహనాలకు మాత్రమే అనుమతిని ఇచ్చారు. మిగిలిన పార్కింగ్?లు దాదాపు కిలోమీటరు దూరంలోనే ఉండనున్నాయి. అతిథుల వాహనాలన్నీ సమీపంలోని అమెజాన్? డేటా సెంటర్? ప్రాంగణంలో నిలిపి ఉంచి, అక్కడి నుంచి వారిని ప్రత్యేక విద్యుత్ వాహనాల్లో సదస్సు వద్దకు తీసుకెళ్లనున్నారు.పోలీసులు, అధికారులు, మీడియాకు వేర్వేరు చోట్ల పార్కింగ్ సదుపాయం కేటాయించారు. వారు అక్కడి నుంచి సదస్సుకు చేరుకోవాలి.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇందుకు ప్రత్యేకంగా ఆదేశాలు జారీ చేశారు. ఎప్పటికప్పుడు తనిఖీలు ఉండనున్నాయి.అతిథులు, ఉద్యోగులు, ఇతరులకు ఎలాంటి ఆరోగ్య సమస్య ఎదురైనా సత్వర వైద్య సేవలందించేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తున్నారు. గుండెపోటు వంటి అత్యవసర పరిస్థితుల్లోనూ వైద్య సేవలు అందించేందుకు అత్యాధునిక అంబులెన్సు ఒకటి, సాధారణ వైద్య సేవలు అందించేందుకు రెండు అంబులెన్సులను అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రాంగణంలో వైద్య సేవలు అందించేందుకు 10 పడకలు ఉంటాయి.ప్రాంగణంలో నిరంతరం విద్యుత్ సరఫరా కోసం ప్రత్యేకంగా ట్రాన్స్‌ఫార్మర్లను, స్తంభాలను ఏర్పాటు చేశారు. విద్యుత్? సరఫరాతో సంబంధం లేకుండా ప్రత్యేక జనరేటర్లను ఏర్పాటు చేయనున్నారు.సదస్సు ప్రాంగణంలో సుమారు 2 వేల మంది అతిథులు కూర్చొనేలా వారికి పక్కనే మీడియాకు ఏర్పాట్లు చేస్తున్నారు.ప్రధాన సదస్సు ప్రాంగణాన్ని ఆనుకునే వివిధ రంగాలకు సంబంధించిన 45 స్టాళ్లను ఏర్పాటు చేయనున్నారు. ఇందులో ప్రభుత్వ శాఖలకు సంబంధించినవి, ప్రైవేటు రంగాలకు సంబంధించినవి ఉంటాయి.ప్రధాన వేదికలు కాకుండా సాంస్కృతిక కార్యక్రమాల కోసం నాలుగు వేదికలను ఏర్పాటు చేయనున్నారు. ప్రాంగణంలో సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్‌ను తక్కువగా వినియోగించాలని నిర్ణయించారు. 9వ తేదీన సదస్సు ప్రాంగణం వెలుపల ప్రత్యేకంగా డ్రోన్ ప్రదర్శనకు ఏర్పాట్లు చేస్తున్నారు. బాణాసంచా కాల్చనున్నారు. సదస్సు ముగిసిన అనంతరం 10, 11 తేదీల్లో సదస్సు ప్రాంగణాన్ని, స్టాళ్లను సందర్శించడానికి సాధారణ ప్రజలకు అనుమతి ఇస్తారు.సెల్ టవర్స్ ఆన్ వీల్స్ : సుమారు 3 వేల మంది దేశ, విదేశీ అతిథులు ఈ సదస్సుకు హాజరు అవుతారని అంచనా. సీఎం, మంత్రులు, ప్రభుత్వ అధికారులు, పోలీసులు, ఇతర సేవలందించే వారిని కలుపుకొంటే సుమారు 5 వేల మంది వరకు ప్రాంగణం లోపల, బయట ఉండే అవకాశాలు ఉన్నాయి. వీరందరికీ సెల్‌ఫోన్ సేవల్లో ఎలాంటి అంతరాయం లేకుండా ఉండేందుకు సెల్‌టవర్ ఆన్ వీల్స్ విధానంలో బీఎస్‌ఎన్‌ఎల్, జియో, వొడాఫోన్, ఎయిర్‌టెల్ తదితర నెట్‌వర్క్‌ల టవర్స్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నారు. మొబైల్ నెట్‌వర్క్‌లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అవసరమైన మేరకు నీటిని సరఫరా చేసే బాధ్యతను, మురుగునీరు వ్యవస్థ సక్రమంగా పని చేసేలా చూసే బాధ్యతను జలమండలికి అప్పగించారు.సదస్సులో మూడు భోజన కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. ఇందులో ఒకటి వీవీఐపీలకు, మరో రెండు అతిథుల కోసం. వీటన్నింటి కోసం హైదరాబాద్?కు చెందిన ఓ ప్రముఖ స్టార్ హోటల్‌ను ఎంపిక చేశారు.అంతర్జాతీయ సదస్సు కావడంతో దీన్ని సజావుగా నిర్వహించడానికి వీలుగా ఒక ప్రైవేటు ఈవెంట్ సంస్థకు నిర్వహణ బాధ్యతలను అప్పగించారు.పారిశుధ్య పరిరక్షణ బాధ్యతలను స్థానిక మున్సిపాలిటీకి అప్పగించారు. సదస్సు ప్రాంగణాన్ని సుందరంగా తీర్చిదిద్దే పనులను హెచ్‌ఎండీఏకు అప్పగించారు.

## విభేదాలు తొలగిపోయాయి

అధికారంలోకి వచ్చిందని.. వారికిచ్చిన వాగ్దానం ప్రకారం తాను సిద్ధరామయ్యతో కలిసి పని చేస్తానని డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ పేర్కొన్నారు. తాము పార్టీకి విశ్వాసపాత్రులైన సైనికుల్లా పని చేస్తున్నామని.. హైకమాండ్ ఏం చెప్పినా.. దానిని అందరం అనుసరిస్తామని స్పష్టంచేశారు. ప్రస్తుతం పార్టీ పలు సమస్యలు ఎదుర్కొంటోందని.. 2028లో రానున్న కర్ణాటక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామన్నారు. నాయకత్వం విషయంలోనూ హైకమాండ్ నిర్ణయమే ఫైనల్ అని పేర్కొన్నారు. సీఎం సిద్ధరామయ్యతో జరిగిన భేటీలో రాబోయే అసెంబ్లీ సమావేశం సహా పలు విషయాలపై చర్చలు జరిపినట్లు తెలిపారు. ఇంతకాలం పార్టీ పెద్దలు తనను వేచి ఉండాలని సూచించడంతో తాను ఎదురుచూస్తున్నానని.. ఇంకొంతకాలం కూడా వేచి ఉండడానికి సిద్ధమేనని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా ముఖ్యమంత్రి మార్పు గురించి ఊహాగానాలు వినిపిస్తున్న విషయం తెలిసిందే. రెండున్నరేళ్ల తర్వాత ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు సీఎం బాధ్యతలు అప్పగించేలా అప్పట్లో ఓ ఒప్పందం కుదిరిందని ప్రచారం జరుగుతోంది. పార్టీ దీనిని పదే పదే ఖండిస్తున్నా.. ఈ అంశం రాజకీయ చర్చకు కేంద్రంగా మారింది. ఈ నేపథ్యంలోనే పార్టీ హైకమాండ్ సూచనల మేరకు సిద్ధూ, డీకే నేడు ఒక్కచోట సమావేశమయ్యారు.

## నీ మాటలు ప్రజలు నమ్మరు

వీటిని అడ్డుకునే కుట్రతోనే దీక్షా దివస్ పేరుతో బీఆర్‌ఎస్‌నాటకాలు ఆడుతోందని మండిపడ్డారు. "తెలంగాణ వచ్చాక వందల రెట్లు లబ్ధి పొందింది కేసీఆర్ కుటుంబమే. ఆ పార్టీ దగ్గర అధికారం మాత్రమే లేదు. కోట్లాది రూపాయలు ఉన్నాయి. అధికారం ఉంటేనే ప్రజల్లో ఉంటాం.. లేకపోతే బయటకే రావొద్దని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. దీక్షా దివస్ పేరుతో బీఆర్‌ఎస్ చేస్తున్న డ్రామాలను తెలంగాణ ప్రజలు విశ్వసించరు" అని మంత్రి అన్నారు.

నాంపల్లి కోర్టుకు హాజరైన సీతక్క

కొవిడ్‌ను ఆరోగ్యశ్రీలో చేర్చాలంటూ 2021లో ఇందిరా పార్క్ వద్ద సీతక్క దీక్ష చేపట్టారు. దీంతో ఆమెపై అప్పటి ప్రభుత్వం కేసు నమోదు చేసింది. కేసు విచారణలో భాగంగా నాంపల్లిలోని ప్రజా ప్రతినిధుల కోర్టుకు సీతక్క హాజరయ్యారు.

## దైవదర్శనం కోసం వెళ్తూ మృత్యుఒడిలోకి..

రాష్ట్రం కోలార్ జిల్లా చిక్కహోసల్లి గ్రామానికి చెందిన.. వెంకటేశప్ప(60), ఆయన కూతురు మీనాక్షి(32), అల్లుడు సతీశ్(36), మనవళ్లు రుత్విక్, బన్నీగౌడ్‌లుగా తేల్చారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. బెంగళూరు నుంచి మంత్రాలయం వెళ్తున్న కర్ణాటక బస్సు పత్తికొండ పరిధిలోని తుగ్గలి, రాతన గ్రామాల మధ్య బోల్తాపడింది. ఆ సమయంలో బస్సులో 29 మంది ప్రయాణికులు ఉన్నట్టు సమాచారం. వారిలో ఇద్దరు వ్యక్తులకు స్వల్ప గాయాలయ్యాయి.

ప్రమాదంపై సిఎం చంద్రబాబు దిగ్భ్రాంతి

కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలం కోటేకల్ వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఐదుగురు మృతి చెందడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విచారం వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మరణించిన వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ మరో ముగ్గురికి అత్యవసర వైద్య సహాయం అందించేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఇక.. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జిల్లా ఎస్పీ, రేంజ్ ఐజీలు హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకున్నారు. మృతి చెందిన ఐదుగురు కర్ణాటకలోని కోలార్ జిల్లాకు చెందిన వారిగా గుర్తించారు. మృతుల్లో ఇద్దరు చిన్నారులు ఉన్నట్టు సీఎం చంద్రబాబుకు అధికారులు తెలిపారు. కర్నూలు జిల్లా రోడ్డు ప్రమాదంపై మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆరా తీశారు. కోటేకల్ వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై దిగ్భ్రాం÷-రతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో ఐదుగురు చనిపోవడం.. మృతుల్లో చిన్నారులు ఉండటంపై విచారం వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ బాధితులకు మెరుగైన వైద్య సహాయం అందించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ప్రమాదంలో మృతి చెందిన వారికి సంతాపం తెలుపుతూ.. వారి కుటుంబాలకు సానుభూతి తెలియజేశారు. ప్రయాణికులు ప్రయాణ సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రయాణికుల భద్రతా ప్రమాణాలపై కఠిన చర్యలు తీసుకునేలా అధికారులకు మరోసారి మంత్రి ఆదేశాలు జారీ చేశారు. రోడ్లపై ప్రయాణికుల నిర్లక్ష్యానికి తావు లేకుండా పర్యవేక్షణ పెంచాలని మంత్రి అచ్చెన్నాయుడు సూచనలు చేశారు. కర్నూలు రోడ్డు ప్రమాద ఘటనపై మంత్రులు టీజీ భరత్, నిమ్మల రామానాయుడు దిగ్భ్రాం÷-రతి వ్యక్తం చేశారు. ప్రమాదంపై అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని మంత్రులు ఆదేశించారు. ఈ ఘటన జరగడం ఎంతో బాధాకరమని.. మృతుల కుటుంబాలకు మంత్రులు టీజీ భరత్, నిమ్మల రామానాయుడు

## గ్లోబల్ సమ్మిట్ పేరుతో రియల్ వ్యాపారం

మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. కేవలం రియల్ వ్యాపరమం కోసమే ఈ సమ్మిట్ అని ఆరోపణలు చేశారు. సిద్దిపేటలో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడుతూ..నవంబర్ 29వ తేదీ ఒక చరిత్ర.. ఉద్యమాన్ని మలుపు తిప్పిన రోజు ఇదని చెప్పుకొచ్చారు. ఉద్యమానికి సిద్దిపేటకు అవినాభావ సంబంధం ఉందని గుర్తుచేశారు. సిద్దిపేటలో జరిగిన ఉద్యోగుల గర్జన ఒక చరిత్ర అని వివరించారు. కేసీఆర్ ఆమరణ దీక్ష ఒక చరిత్ర.. ఎన్నో త్యాగాలతో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని పేర్కొన్నారు.'తెలంగాణ రాష్ట్రం కోసం మాజీ సీఎం కేసీఆర్ పోరాడారు. టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ కేసీఆర్ పోరాటం గురించి మూర్ఖంగా మాట్లాడుతున్నారు. డిసెంబర్ 9వ తేదీ తెలంగాణ రాష్ట్ర ప్రకటన కేసీఆర్ దీక్ష ఫలితమే. మిలియన్ మార్చ్ మా వంతు.. మిలియన్‌ల కొద్దీ డబ్బు మూటలు కట్టి ఢిల్లీకి పంపుడు కాంగ్రెస్ వంతు. తెలంగాణ ఉద్యమ ద్రోహి రేవంత్‌రెడ్డికి కోదండ రామ్ దగ్గర అయ్యారు. మన నిధులు, మన నీళ్లు మనకు దక్కేలా చేసింది కేసీఆర్. కృష్ణానది నీళ్ల పంపకంపై ఆంధ్రప్రదేశ్.. తెలంగాణ ఉద్యమాన్ని కించపరిచేలా ట్రిబ్యునల్ ముందు మూడు రోజులుగా వాదిస్తుంది. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు ఈ విషయంపై మాట్లాడటం లేదు. తెలంగాణ రాష్ట్ర మూడు కోట్ల ప్రజల ఆత్మగౌరవాన్ని కించపరచాలని చూడొద్దు. తెలంగాణ

## 'దిత్వా' కల్లోలం



అత్యవసర పరిస్థితిని ప్రకటిస్తూ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. శనివారం శ్రీలంకను దాటిన దిత్వా తుఫాను 123 మందికి పైగా ప్రాణాలను బలిగొందని, విధ్వంసం, మౌలిక సదుపాయాలకు నష్టం వాటిల్లిందని ఆ దేశ అధికారులు తెలిపారు. 'దిత్వా శ్రీలంక నుండి భారత తీరం వైపు వెళ్లింది. ఈ క్రమంలో భారీ వర్షం, అధిక వేగంతో కూడిన గాలులు వీశాయి. ఈ తుఫాన్ కారణంగా ఇప్పటికే అనేక ప్రాంతాలు తీవ్రంగా నష్టపోయాయి. ఎంతో మంది జీవనం అస్తవ్యస్తంగా మారింది' అని వాతావరణ శాఖ డైరెక్టర్ జనరల్ అతుల కరుణనాయకే మీడియాతో తెలిపారు. ఇదే సమయంలో విపత్తు నిర్వహణ కేంద్రం శనివారం ఓ ప్రకటనలో పలు విషయాలను వెల్లడించింది. వారం రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా అనేక ఇళ్లు ధ్వంసమయ్యాయనియని తెలిపింది. 43వేల మందికి పైగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించామని డీఎంసీ జనరల్ డైరెక్టర్ సంపత్ తెలిపారు. పోలీసులు, అధికారులు, రెస్క్యూ సిబ్బంది సహాయక చర్యలు కొనసాగుతున్నా యన్నారు. లోతట్టు ప్రాంతాల్లో పరిస్థితి మరీ దయనీయంగా ఉందన్నారు. వందలమందిని తాత్కాలిక పునరావాసాలకు తరలించామని డీఎంసీ జనరల్ డైరెక్టర్ వెల్లడించారు.

దిత్వా తుపాను.. తమిళనాడు హై అలర్ట్

దిత్వా తుపాను కారణంగా తమిళనాడులోని పలు జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి తీరాల వైపు తుపాను కదులుతున్న నేపథ్యంలో ఆయా విభాగాలు అప్రమత్తమయ్యాయి. భారీ వర్షాల కారణంగా తమిళనాడులో అనేక విమాన సర్వీసులు రద్దు కావడంతోపాటు స్కూళ్లు, కాలేజీలకు సెలవులు ప్రకటిస్తున్నాయి. ఇప్పటికే ఇండిగో ప్రయాణికులకు సూచన చేయగా, తాజాగా ఎయిరిండియా కూడా విమాన సర్వీసుల ప్రభావంపై అడ్వైజరీ జారీ చేసింది.

54 విమానాలు రద్దు..

భారీ వర్షాల కారణంగా వివిధ జిల్లాలకు నడిచే 54 విమాన సర్వీసులను రద్దు చేసినట్లు చెన్నై ఎయిర్‌పోర్ట్ వెల్లడించింది. భారీ వర్షాలు, ఈదురు గాలుల కారణంగా చెన్నై సహా దక్షిణాది నగరాల నుంచి రాకపోకలు సాగించే విమాన సర్వీసులపై ప్రభావం చూపే అవకాశం ఉందని ఎయిర్ ఇండియా అడ్వైజరీలో పేర్కొంది. ఎయిర్‌పోర్టుకు బయలుదేరే ముందు విమాన సర్వీసు స్టేటస్‌ను చెక్ చేసుకోవాలని సూచించింది. అంతకుముందు ఇండిగో కూడా ఇదే విధమైన అలర్ట్ విడుదల చేసింది. వర్షాల నేపథ్యంలో దక్షిణ రైల్వే కూడా అప్రమత్తమైంది.భారీ వర్షం, ఈదురు గాలులతో రామేశ్వరంలోనూ రెండో రోజు జనజీవనం స్తంభించింది. రామనాథపురం, నాగపట్నంలలో వర్షం ప్రభావం తీవ్రంగా ఉంది. తుపాను తీరం దాటే సమయంలో చెన్నైలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ ముందస్తు హెచ్చరికలు జారీ చేసింది. దీంతో అనేక ప్రాంతాల్లో ఎస్టీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ సహా 28 విపత్తు ప్రతిస్పందన దళాలను రాష్ట్ర ప్రభుత్వం రంగంలోకి దించింది. ప్రభావిత జిల్లాల్లో 6వేల పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. వైమానిక, కోస్ట్‌గార్డ్ కూడా అప్రమత్తంగా ఉన్నాయి. తుపాను కారణంగా శ్రీలంక అత్యవసర పరిస్థితిని ప్రకటించింది.

ఏపీ వైపు దూసకొస్తున్న తుపాన్

దిత్వా తుఫాను ఆంధ్రప్రదేశ్ వైపునకు దూసుకుని వస్తోంది. దీంతో పలు జిల్లాలకు అలర్ట్ జారీ చేశారు. నైరుతి బంగాళాఖాతం ఆనుకుని ఉన్న శ్రీలంక తీరంలో దిత్వా తుఫాను ప్రభావం కొనసాగుతోందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. ప్రస్తుతానికి ఇది కారైకాల్‌కి 150 కిలోమీటర్లు, పుదుచ్చేరికి 280 కిలోమీటర్లు, చెన్నైకి 350 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతం అయిందని వెల్లడించారు. గడిచిన 6 గంటల్లో 8 కిలోమీటర్ల వేగంతో తుఫాను కదులుతుందని వివరించారు. ఉత్తర వాయవ్య దిశగా కదులుతున్న తుఫాను చెన్నైకి అతి సమీపానికి వస్తుందని వివరించారు. ఈరోజు రాత్రికి తుపాను 60కిలోమీటర్ల వరకు ప్రయాణిస్తుందని చెప్పుకొచ్చారు. తీరానికి సమాంతరంగా ప్రయాణిస్తూ ఆయా ప్రాంతాలపై ప్రభావం చూపుతుందని అన్నారు. మూడు రోజుల్లో ఏపీలో కొన్నిచోట్ల భారీ, మరికొన్ని చోట్ల అతి భారీ, ఇంకొన్ని చోట్ల అత్యంత భారీ వర్షాలు కురిసే

## తండ్రితో గొడవపడి .. సరిహద్దు దాటి..

### పాక్‌లో భారతీయుడి అరెస్ట్..

గహౌతి(జనంసాక్షి):తండ్రితో గొడవ పడి.. ఇంటి నుంచి వెళ్లిపోయిన వ్యక్తి సరిహద్దు దాటి పాక్‌లోకి ప్రవేశించిన ఘటన తాజాగా వెలుగులోకి వచ్చింది. భారత సరిహద్దు దాటి పాక్ భూభాగంలోకి ప్రవేశించిన భారతీయుడిని అరెస్టు చేసినట్లు పాకిస్థాన్ అధికారులు తాజాగా వెల్లడించారు. అస్సాంకు చెందిన 31 ఏళ్ల బీజే సింగ్ ఆగస్టు 16న పంజాబ్ సరిహద్దు దాటి తమ దేశంలోకి ప్రవేశించినట్లు తెలిపారు. సరిహద్దుల్లో అనుమానాస్పదంగా తచ్చాడుతుండడంతో అతడిని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు.మూడు నెలలుగా బీజే సింగ్ తమ ఆధీనంలో ఉన్నాడని.. విచారణలో అతడి ప్రవర్తన అనుమానాస్పదంగా కనిపించకపోవడంతో లాహోర్ నుంచి 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న కాసూర్ పోలీస్ స్టేషన్‌కు అతడిని అప్పగించినట్లు పేర్కొన్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలో తన తండ్రి బర్షన్ సింగ్‌తో గొడవపడి.. ఇంటి నుంచి బయటకు వచ్చేసినట్లు విచారణలో బీజే సింగ్ తెలిపినట్లు వెల్లడించారు. పాకిస్థాన్‌లోకి అక్రమంగా ప్రవేశించినందుకు అతడిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## నల్ల సముద్రంలో చమురు నౌకపై డ్రోన్ దాడి

- తామే చేశామన్న ఉక్రెయిన్
- ఈ నౌకల వల్లే రష్యాకు పెద్ద మొత్తంలో డబ్బు సమకూరుతోందని ఆరోపణ
- అందుకే లక్ష్యంగా చేసుకున్నామని వెల్లడి

**కీవ్(జనంసాక్షి):**నల్ల సముద్రంలో 'విరాట్' అనే రష్యన్ ఆయిల్ ట్యాంకర్‌పై డ్రోన్ దాడి జరిగింది. అంతకుముందు శుక్రవారం రాత్రి కూడా ఈ నౌకపై దాడులు జరిగాయి. అందులోని సిబ్బంది 'డ్రోన్ దాడి' అంటూ రేడియోలో అత్యవసర సందేశం పంపారు. "ఇది విరాట్. సాయం కావాలి! డ్రోన్ దాడి! మేడే!" అని సిబ్బంది అంటున్న ఆడియో రికార్డు అయింది. టర్కీ రవాణా మంత్రిత్వ శాఖ కూడా ఈ విషయాన్ని ధ్రువీకరించింది. నల్ల సముద్ర తీరం నుంచి 35 నాటికల్ మైళ్ల దూరంలో ఈ దాడి జరిగిందని



తెలిపింది. అయితే, 'విరాట్'కు స్వల్ప నష్టమే జరిగిందని సమాచారం. ఆ నౌక ప్రస్తుతం స్థిరంగానే ఉందని.. సిబ్బంది కూడా క్షేమంగా ఉన్నారని తెలుస్తోంది. రష్యా 'షాడో ఫ్లీట్' ట్యాంకర్లపై జరిగిన ఈ దాడి తమ పనేనని ఉక్రెయిన్ ప్రకటించింది. ఈ నౌకల వల్లే యుద్ధం చేయడానికి రష్యాకు పెద్ద మొత్తంలో డబ్బు సమకూరుతోందని ఆరోపించింది. అందుకే వీటిని లక్ష్యంగా చేసుకున్నట్లు పేర్కొంది. ఇరు దేశాల మధ్య శాంతి ఒప్పందం కోసం అమెరికా ప్రయత్నిస్తున్న తరుణంలో ఈ దాడి జరగడం గమనార్హం.

## తెలంగాణకు కాంగ్రెస్ శత్రువు

గోడకు వేలాడదీస్తే తుపాకీ కూడా మౌనంగానే ఉంటుందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ లేకపోతే తెలంగాణ లేదని స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొనని వారు కేసీఆర్‌ను విమర్శిస్తున్నారని మండిపడ్డారు. పీసీసీ అధ్యక్షుడు కేసీఆర్ దీక్ష.. దొంగ దీక్ష అని మాట్లాడుతున్నారని.. అడ్డమైన మాటలు కొందరు మాట్లాడుతున్నారంటూ ఫైర్ అయ్యారు. సింహం తన గాథను తాను చెప్పుకోకపోతే, వేటగాడు చెప్పే పిట్టకథనే నిజం అనుకుంటారు అంటూ కేటీఆర్ పేర్కొన్నారు. దీక్షా దివస్ కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడుతూ… కేసీఆర్ ఎప్పుడు బయటకు రావాలో అప్పుడే వస్తారని తెలిపారు. ఎదురుదాడి ఎలా చెయ్యాలో కేసీఆర్‌కు తెలిసినంతగా ఇంకెవరికీ తెలియదన్నారు. నాయకుడిని నాయకుడే అంటారని.. అర్భకుడిని అర్భకుడే అంటారంటూ వ్యాఖ్యలు చేశారు. ఇలా మాట్లాడితే తనకు అహంకారం అంటారని.. కానీ తాను ఇలానే మాట్లాడుతానని.. ఏం చేసుకుంటారో చూసుకోండి అని అన్నారు. మహాభారతంలో పాండవులు హీరోలు.. విలన్లు కౌరవులు అని.. అలాగే రామాయణంలో హీరో శ్రీరాముడు… విలన్ రావణుడని తెలిపారు. ఇప్పుడు తెలంగాణ కథలో హీరో ఉన్నాడు… శకునులు, మారీచులు ఉన్నారంటూ కామెంట్స్ చేశారు. చరిత్రను మలుపు తిప్పిన రోజు కేసీఆర్ దీక్ష చేసిన రోజు అని చెప్పుకొచ్చారు. సచ్చుడో తెలంగాణ వచ్చుడో అన్న కేసీఆర్ నినాదం సునామీ సృష్టించిందన్నారు. కేసీఆర్ దీక్ష విఫలం కావాలని చాలా మంది ప్రయత్నం చేశారని ఆరోపించారు. తెలంగాణ ఉన్నంత కాలం కేసీఆర్ అనే పదాన్ని ఎవరూ తుడిచివేయలేరని స్పష్టం చేశారు. టైం బాగాలేనప్పుడు గ్రామ సింహాలు కూడా పులుల్లా గర్జిస్తాయంటూ ఎద్దేవా చేశారు. ఎన్నడూ జై తెలంగాణ అననోళ్ళు పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతున్నారంటూ మండిపడ్డారు. మొదటి నుంచి విలన్ పాత్ర పోషిస్తున్నది కాంగ్రెస్ పార్టీ అంటూ విరుచుకుపడ్డారు. పది మంది ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి బైఎలక్షన్స్‌కు రావాలంటూ సీఎం రేవంత్‌కు మాజీ మంత్రి సవాల్ విసిరారు. సోనియా గాంధీని బలిదేవత అన్నది ఇప్పుడున్న ముఖ్యమంత్రి అని గుర్తుచేశారు. సోనియా గాంధీకి అసెంబ్లీలో ధన్యవాదాలు తెలిపిన సంస్కారి కేసీఆర్ అని అన్నారు. కేసీఆర్ దొంగ దీక్ష అయితే ఆనాడు కేంద్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు విరమించమని చెప్పిందని ప్రశ్నించారు. రాజీవ్ గాంధీ విగ్రహం స్థానంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని పెట్టుకుందామని దీక్షా దివస్ సాక్షిగా ప్రతిజ్ఞ చేస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ హీరోలను విలన్లుగా చిత్రీకరిస్తుందని విమర్శించారు. కాళేశ్వరం మీద కుట్ర జరిగిందని ఆరోపించారు. మేడిగడ్డ బ్యారేజ్‌ను బాంబులు పెట్టి కూల్చివేసే ప్రయత్నం జరిగిందన్నారు. గులాబీల ఎగురులాట కొంత కాలమే… వచ్చే కాలమంతా గులాబీలదే అంటూ ధీమా వ్యక్తం చేశారు.

**సిద్దిపేటలో హరీష్ రావు బైక్ ర్యాలీ**

రాష్ట్రవ్యాప్తంగా బీఆర్‌ఎస్ శ్రేణులు దీక్షా దివస్‌ను ఘనంగా జరుపుకున్నారు. సిద్దిపేటలో అంబేడ్కర్ విగ్రహానికి హరీశ్‌రావు పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం నగరంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి,ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, యాదవరెడ్డి పాల్గొన్నారు. హైదరాబాద్‌లోనూ దీక్షా దివస్‌ను ఘనంగా జరుపుకున్నారు. తెలంగాణ భవన్‌కు భారీగా బీఆర్‌ఎస్ శ్రేణులు తరలివచ్చాయి. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి, అమరవీరులకు నివాళు లర్పించారు. ఉస్మానియా యూనివర్సిటీలో బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలో మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో దీక్షా దివస్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాధవరం మాట్లాడుతూ.. కేసీఆర్ దీక్షతోనే తెలంగాణ వచ్చిందని తెలిపారు. తెలంగాణను అభివృద్ధి చేసిన ఘనత కేసీఆర్‌దే అని చెప్పారు. ఖమ్మంలో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్సీ తాతా మధు, ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, చంద్రావతి పాల్గొన్నారు. తెలంగాణ తల్లి విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. దీక్షా దివస్ సందర్భంగా సంగారెడ్డిలో అమరవీరులకు బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, రాష్ట్ర నాయకులు దేవీప్రసాద్ ఇతర బీఆర్‌ఎస్ నాయకులు నివాళులర్పించారు.

# వరంగల్ నగర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

**కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జీ. కిషన్ రెడ్డి**

**వరంగల్ రైల్వే స్టేషన్ ను పరిశీలించిన మంత్రి**



**వరంగల్ ప్రతినిధి, నవంబర్ 29 ( జనంసాక్షి):** హైదరాబాద్ తర్వాత అతి పెద్ద రెండవ నగర మైన వరంగల్ నగర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జీ.కిషన్ రెడ్డి అన్నారు. శనివారం నగరం లో వివిధ కార్యక్రమాల్లో పాల్గొనడానికి మంత్రి వందేభారత్ రైలు లో హైదరాబాద్ నుండి వరంగల్ రైల్వే స్టేషన్ కు చేరుకొని ఆధునీకరణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం భద్రకాళి,వేయిస్తంభాల ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భం గా ఆలయ సాంప్రదాయం ప్రకారం అర్చకులు పూర్ణ కుంభం తో స్వాగతం పలికి అమ్మ వారి శేష వస్త్రాన్ని ,ప్రసాదాన్ని అందజేశారు. వేయిస్తంభాల ఆలయ ఆవరణ లో గల కళ్యాణ మండపం పనుల పురోగతిని ఆర్కియాలజీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. హరిత కాకతీయ హోటల్ కు చేరుకొని పోలీసు వారి గౌరవ వందనాన్ని స్వీకరించి కాన్ఫరెన్స్ హాల్ లో కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ, జీడబ్ల్యూఎంసి, ఆర్కియాలజీ,స్మార్ట్ సిటీ తదితర అభివృద్ధి పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకుని సమర్థవంతం గా చేపట్టుటకు తగు సూచనలు చేశారు. హన్మకొండ జిల్లా పరిధిలోని అయోధ్యపురంలో గల రైల్వే మాన్యుఫాక్చరింగ్ యూనిట్ (ఆర్ఎంయు)ను మంత్రి క్షేత్ర స్థాయిలో సందర్శించారు. అనంతరం హరిత కాకతీయ హోటల్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో పాత్రికేయులతో ఏర్పాటు చేసిన సమావేశం లో మంత్రి పాల్గొని కేంద్ర ప్రభుత్వం నగరం లో చేపట్టిన చేపట్టబోతున్న వివిధ అభివృద్ధి పనులను గురించి తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 'వరంగల్ నగరంతో పాటు చుట్టు పక్కల ప్రాంతాల్లో కేంద్రప్రభుత్వం ద్వారా అమలు చేస్తున్న పథకాలను సమీక్షించేందుకు ఇక్కడికి వచ్చాను. దేశవ్యాప్తంగా కేంద్రం అభివృద్ధి చేస్తున్న 40 రైల్వే స్టేషన్లలో మొదటగా వరంగల్ రైల్వే స్టేషన్ పూర్తయింది. అభివృద్ధి పనులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో చర్చించి, అనేక విషయాలు తెసుకున్నాను. అమృత్, హృదయ్, హెరిటేజ్ సిటీ పథకాల కింద జరుగుతున్న పనులను సమీక్షించాను. 7 మెగా టెక్స్ టైల్ పార్కుల్లో ఒకటైన కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్కు పనుల గురించి కూడా సమీక్షించాను. ఇప్పటికే భూసేకరణ పనులు దాదాపు పూర్తయ్యాయి. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వానికి రూ.30 కోట్లు అందజేశాం. మరో రూ.30 కోట్లు త్వరలోనే కేటాయిస్తాం. మొత్తం రూ.200 కోట్లతో కేంద్ర ప్రభుత్వం ఈ మెగా టెక్స్ టైల్ పార్కు నిర్మాణం చేపట్టనున్నాం. ఈ పార్కు ద్వారా రూ.1,700 కోట్ల పెట్టుబడులు వస్తాయి. 12,500 మందికి ఉపాధి కలుగుతుంది. ఎవర్ టాప్ టెక్స్ అనే కొరియా కంపెనీ రూ.1100 కోట్ల మేర పెట్టుబడులు పెట్టనుంది. 11 వేల మందికి ఉపాధి కల్పిస్తామని ఒప్పందం చేసుకుంది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ గారిని ఆహ్వానించి పార్కు భూమిపూజ చేయించాలనే ఉద్దేశంతో ఉన్నాం. వరంగల్ మామునూరు ఎయిర్ పోర్టు విషయంలో 696 ఎకరాల భూమి ఎయిర్ పోర్టు అధికారుల వద్ద ఉంది. ఇప్పటికే ఈ ఎయిర్ పోర్టు నిర్మాణానికి సంబంధించి క్లియరెన్స్ వచ్చింది. 2021లో నాటి పౌర విమానయాన శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా గారు వరంగల్ వచ్చి, నాటి సీఎం కేసీఆర్ కు మామునూరు ఎయిర్ పోర్టు నిర్మాణానికి ముందుకు రావాలని లేఖ ద్వారా కోరారు. ఇదే విషయంలో సహకరించాలని 2022 జూలై, 2023 ఫిబ్రవరిలో నేను స్వయంగా కేసీఆర్ గారికి లేఖ రాశాను. అయితే ఎలాంటి స్పందన రాలేదు. ఇప్పుడు 280 ఎకరాల భూమి సేకరించేందుకు ముందుకు వచ్చింది. భూసేకరణ త్వరగా ఎయిర్ పోర్టు అథారిటీకి అందజేస్తే త్వరగా నిర్మాణం ప్రారంభించాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. కాజీపేటలోని రైల్ మానుఫ్యాక్చరింగ్ యూనిట్ త్వరగా నిర్మాణం పూర్తి చేయాలని ఎప్పటికప్పుడు రైల్వే అధికారులను ఆదేశిస్తున్నాను. వచ్చే ఏడాది పనులు పూర్తి అవుతాయని భావిస్తున్నాను. వేయిస్తంభాల ఆలయ మంటపాన్ని పూర్తి స్థాయిలో పునర్నిర్మాణం చేశాం. వరంగల్ కోటకు సంబంధించిన భూమి అన్యాక్రాంతం అవుతోంది. అక్రమ కట్టడాల గురించి జిల్లా కలెక్టర్ కు ఆర్కియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా లేఖలు రాస్తున్నా కూడా ఎలాంటి ఫలితం లేకుండా పోతోంది. దీనిపై సీఎం, సీఎస్ కు లేఖ రాస్తాను. అమృత్ పథకం ద్వారా వరంగల్ నగరాభివృద్ధికి విడుదల చేసిన నిధులను వినియోగించుకుని పనులు పూర్తి చేయాలని ఆదేశించాను. అర్బన్ ఇన్ ఫ్రా స్ట్రక్చర్ కింద రూ.412 కోట్లు, హృదయ్ పథకం కింద ఘన్ పూర్ దేవాలయం, పద్మాక్షి దేవాలయం, కాజీపేట దర్గా, పురాతన కట్టడాల అభివృద్ధి పనుల కోసం విడుదల చేసిన నిధులను వాడుకోవాలని సూచించాను. రామప్ప ఆలయం అభివృద్ధి కోసం కేంద్రం రూ.146 కోట్లు కేటాయించింది. పత్తి కొనుగోళ్లకు సంబంధించి రైతులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని సీసీఐ అధికారులను ఆదేశించాను. 2024-25లో 41 లక్షల బేళ్ల పత్తిని తెలంగాణలో కేంద్రం కొనుగోలు చేసింది. గతేడాది 110 కొనుగోలు కేంద్రాలు ఉండగా, ఇప్పుడు 123 కేంద్రాలకు పెంచి పత్తి కొనుగోళ్లు చేపడుతున్నాం. తేమ సమస్య కూడా పరిష్కారమైంది. రైతులు తీసుకొస్తున్న పత్తిలో తేమ శాతం సగటున 8 నుంచి 9 శాతం ఉంటోంది. సీసీఐ 12 శాతం వరకు తేమ ఉన్నా కూడా తీసుకునేందుకు సుముఖత వ్యక్తం చేసింది. పత్తి రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. దళారుల మాటలను విని మోస పోవద్దని రైతులను కోరుతున్నాను. 2014 వరకు ఇప్పటివరకు కేంద్రం సుమారు రూ.60 వేల కోట్ల ఎమ్మెస్పీ చెల్లించి కొనుగోళ్లు చేపట్టింది. వరంగల్ నగరంతో పాటు చుట్టు పక్కల ప్రాంతాల్లో కేంద్రప్రభుత్వం ద్వారా అమలు చేస్తున్న పథకాలను సమీక్షించేందుకు ఇక్కడికి వచ్చాను. దేశవ్యాప్తంగా కేంద్రం అభివృద్ధి చేస్తున్న 40 రైల్వే స్టేషన్లలో మొదటగా వరంగల్ రైల్వే స్టేషన్ పూర్తయింది. అభివృద్ధి పనులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో చర్చించి, అనేక విషయాలు తెసుకున్నాను' అని అన్నారు. అమృత్, హృదయ్, హెరిటేజ్ సిటీ పథకాల కింద జరుగుతున్న పనులను సమీక్షించారు. ఈ కార్యక్రమం లో బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, కార్పొరేటర్ లు గుజ్జుల వసంత చాడ స్వాతి, రావుల కోమల కిషన్ డి ఆర్ ఓ విజయలక్ష్మి, కుడా సి పి ఓ అజిత్ రెడ్డి, బల్దియా ఎస్ ఈ సత్యనారాయణ మాజీ ఏం పి.సీతారాం నాయక్ మాజీ శాసనసభ్యులు అరూరి రమేష్ ,కొండేటి శ్రీధర్, ధర్మారావు వన్నాల శ్రీరాములు ఆర్కియాలజీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# హుస్నాబాద్‌లో పలు అభివృద్ధి పనులు

- **3న సిఎం చేతుల మీదుగా ప్రారంభం**
- **పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన పొన్నం**



**సిద్దిపేట, నవంబరు 29 (జనంసాక్షి) :** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లాల పర్యటనలో భాగంగా డిసెంబర్ 3వ తేదీన హుస్నాబాద్‌లో పర్యటించ నున్నారు. పలు కార్యక్రమాల్లో సీఎం పాల్గొంటారు. అనంతరం భారీ బహిరంగ సభలో ప్రసంగించనున్నారు. సీఎం పర్యటన దృష్ట్యా పోలీసు అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలో హుస్నాబాద్ పట్టణ శివారులోని ఏనె వద్ద మైదానంలోని బహిరంగ సభ ప్రాంగణాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. పోలీసులకు మంత్రి పొన్నం కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడారు. ప్రజాపాలన ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా జరిగిన అభివృద్ధి, ఇంకా చేయాల్సిన అభివృద్ధి పనులపై ఈ సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతారని చెప్పుకొచ్చారు. హుస్నాబాద్ నియోజకవర్గానికి సంబంధించిన అనేక అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేస్తారని మంత్రి పొన్నం ప్రభాకర్ వివరించారు. ముఖ్యమంత్రి, కేబినెట్ మంత్రుల సహకారంతో మిగిలిన సమస్యలను ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పరిష్కరించి ముందుకెళ్లే ప్రయత్నం చేస్తామని పేర్కొన్నారు. నాలుగు జిల్లాల మధ్యలో కేంద్రంగా ఉన్న హుస్నాబాద్ నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి సభకు హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు.

# దూసుకొస్తున్న దిత్వా తుఫాన్

**అమరావతి, నవంబరు29 (జనంసాక్షి) :** నైరుతి బంగాళాఖాతంలో దిత్వా తుఫాను నేపథ్యంలో విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయంలో హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత శనివారం సమీక్ష నిర్వహించారు. తుఫాను తీవ్రతను బట్టి ఎప్పటికప్పుడు అంచనా వేసి ప్రభావిత జిల్లాలను అలర్ట్ చేయాలని అధికారులను ఆదేశించారు. సహాయక చర్యలకు ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలను పంపించాలన్నారు. రేపు, ఎల్లుండి ప్రకాశం, నెల్లూరు, శ్రీసత్యసాయి, కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్ష సూచన ఉందని హోంమంత్రికి అధికారులు వివరించారు. దీంతో ఆయా జిల్లాల కలెక్టర్లతో అనిత ఫోన్లో మాట్లాడారు. ముందస్తు జాగ్రత్త చర్యలు పటిష్టంగా అమలు చేయాలని ఆదేశించారు. తుఫాను సమాచారాన్ని ఎప్పటికప్పుడు కిందిస్థాయి అధికారులకు, ప్రజలకు తెలియజేయాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో అధికార యంత్రాం గం అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కంట్రోల్ రూమ్ లను 24/7 కొనసాగించాలని ఆదేశం చారు. విపత్తుల సంస్థ కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నెంబర్లు 112, 1070, 18004250101 సంప్రందించాలని తెలిపారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్ళల్లో ఉండే వారిని గుర్తించి ముందుగానే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశాలు జారీ చేశారు. అవసరమైతే ప్రజలను సహాయక శిబిరాలకు తరలించడానికి సిద్ధంగా ఉండాలన్నారు.

# తెలంగాణ ఆత్మను మేల్కొలిపిన వ్యక్తి లోకకవి అందెశ్రీ

- **కాకతీయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి**




**హనుమకొండ (జనంసాక్షి) :** అందెశ్రీ రచనలు గుండెల్లో ఎల్లప్పుడూ సజీవంగా నిలిచిపోతాయని . కాకతీయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి అన్నారు. కేయూ సెనేట్ హాల్‌లో,కేయూ విశ్రాంత అధ్యాపకులు, మాజీ పార్లమెంట్ సభ్యులు ఆచార్య అజ్మీరా సీతారం నాయక్ అధ్యక్షతన యాది సభ జరిగింది. తెలంగాణ సాహిత్య సమరయోధుడు, రాష్ట్ర గీత రచయిత అందెశ్రీ యాదిలో నిర్వహించిన సభలో ఉపకులపతి ఆచార్య ప్రతాప్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ తన కవిత్వం ద్వారా తెలంగాణ ఆత్మను మేల్కొలిపిన మహనీయుడు అందెశ్రీ అని, ఆయన రచనలు ఎల్లప్పుడూ సజీవంగా నిలిచిపోతాయని ప్రశంసించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, పరిశోధకులు, బోధనా-బోధనేతర సిబ్బంది, విశ్రాంత ఉద్యోగులు, అతిథులను ఉద్దేశించి మాట్లాడుతూ ఆచార్య ప్రతాప్ రెడ్డిఅందెశ్రీ మాట, పాట ప్రకృతికి అత్యంత దగ్గరగా ఉంటాయని అన్నారు. ఆయన గీతాలు ప్రజలను ప్రేరణతో నింపాయని పేర్కొన్నారు. ల్యాబ్‌లో ప్రయోగం ఎంత ముఖ్యమో, పొలంలో విత్తనం అంతే ముఖ్యమని ఉదాహరణగా చెబుతూ, పుస్తకాలు చదవడంతో పాటు పల్లె ముఖాలు కూడా చదవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ప్రత్యేకమైన వ్యక్తిత్వం కలిగిన అందెశ్రీ రచనలు సమకాలీన మానవ సంక్షోభాలకు అద్దం పట్టాయి అని అన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఆయన గీతాలు ప్రజల్లో అపార చైతన్యం రగిలించాయని గుర్తుచేశారు. ఇది బొమ్మెర పోతన, కాళోజీ, నేరెళ్ల వేణుమాధవ్ వంటి మహనీయులను స్మరించుకునే గొప్ప నెల అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఆచార్యులు ఆచార్య కే. వెంకటనారాయణ, ఆచార్య బి. సురేష్ లాల్, డా. వి.ఎస్. రెడ్డి, జర్నలిజం విభాగాధిపతి, సామాజిక ఉద్యమకారుడు డాక్టర్ సంగని మల్లేశ్వర్, డా. ఎం. లింగయ్య, డా. చిర్రా రాజు, డా. చారి, డా. ముచ్చెర్ల పృథ్వీ రాజు, పొట్లపల్లి శ్రీనివాస్, జయరాజ్‌తో పాటు అందెశ్రీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. సభ ప్రారంభంలో అందెశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఒక నిమిషం మౌనం పాటిస్తూ నివాళులు అర్పించారు.

# 16 ఏండ్ల క్రితం ఉద్యమాన్ని మలుపుతిప్పిన దీక్ష

- **ఆనాటి రోజులు గుర్తు చేసుకున్న కెటిఆర్, హరీష్**

**హైదరాబాద్, నవంబర్29 (జనంసాక్షి) :** దీక్షా దివస్ సందర్భంగా తెలంగాణ ఉద్యమం నాటి రోజులను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్మరించుకున్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక మలుపుగా నిలిచిన రోజు 2009 నవంబర్ 29 అని అన్నారు. రాష్ట్ర సాదనకు 16 ఏండ్ల క్రితం సరిగ్గా ఇదే రోజు నాంది పలికిందని అన్నారు. తెలంగాణ గమ్యాన్ని మార్చిన చారిత్రాత్మక రోజు అని తెలిపారు.కరీంనగర్‌లో కేసీఆర్‌ను అరెస్టు చేసిన సమయంలో ప్రజల్లో నుంచి వచ్చిన ఆగ్రహ జ్వాలలు తెలంగాణ ఉద్యమానికి కొత్త ఊపు ఇచ్చిందని కేటీఆర్ అన్నారు. ఈ మేరకు అప్పటి పరిస్థితులను గుర్తుచేస్తూ ఆనాడు కరీంనగర్‌లో తీసిన వీడియోను సోషల్ మీడియాలో పంచుకున్నారు. అలాగే దీక్షా దివస్ సందర్భంగా తెలంగాణ ఉద్యమం నాటి రోజులను బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు గుర్తుచేసుకున్నారు. 'తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో' నినాదంతో 2009 నవంబర్ 29న ప్రారంభించిన ఆమరణ దీక్ష, ఉద్యమ గతిని మలుపు తిప్పిందని.. సరికొత్త చరిత్రకు నాంది పలికిందని.. తెలంగాణ ఏర్పాటుకు బాటలు వేసిందని తెలిపారు. 'రానే రాదు, కానే కాదు' అన్న ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటును సబ్బండ వర్గాలను ఏకం చేసి సుసాధ్యం చేసి చూపిన ఘన చరిత కేసీఆర్‌ది అని కొనియాడారు. నాలుగు కోట్ల ప్రజల ఆకాంక్ష సాధనకు అలుపెరగని పోరాటం చేసిన చరిత్ర కేసీఆర్‌ది అని అన్నారు.పదవులే కాదు, తెలంగాణ కోసం ప్రాణాలు సైతం త్యాగం చేసేందుకు సిద్ధపడ్డ ధీరత్వం కేసీఆర్‌ది అని హరీశ్‌రావు అన్నారు. తెలంగాణ అజరామర చరిత్రకు వీరోచిత సంతకం కేసీఆర్ అని వ్యాఖ్యానించారు. నాలుగు కోట్ల ప్రజల్లో మార్మోగే 'జై తెలంగాణ' అనే రణ నినాదం కేసీఆర్ అని అన్నారు. నవంబర్ 29న కేసీఆర్ దీక్ష లేకుండా డిసెంబర్ 9 ప్రకటన లేదు. డిసెంబర్ 9 ప్రకటన లేకుండా తెలంగాణ రాష్ట్రమే లేదని స్పష్టం చేశారు. దశాబ్దాల పోరాటంతోనే తెలంగాణ సిద్ధించింది తప్ప పాలకుల దయాదాక్షిణ్యాలతో కాదన్నది అక్షర సత్యమని హరీశ్‌రావు తెలిపారు.

# స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ పేరుతో భారీ మోసం

- **ముఠాను అరెస్ట్ చేసిన సైబర్ క్రైమ్ పోలీసులు**

**హైదరాబాద్, నవంబరు 29 (జనంసాక్షి) :** స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ పేరుతో భారీ మోసాలకు పాల్పడుతున్న ముఠాను హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. ముంబయిలో ఇద్దరిని అరెస్టు చేయగా.. వారిలో ప్రధాన నిందితుడు రవికుమార్‌తో పాటు మ్యూల్ బ్యాంక్ అకౌంట్లు సమకూరుస్తున్న శివేంద్ర అశోక్ సింగ్ ఉన్నారు. హైదరాబాద్‌కు చెందిన వ్యక్తికి ట్రేడింగ్ పేరుతో రూ.12.30 లక్షలు మోసం చేసినట్లు సమాచారం. నిందితులపై దేశవ్యాప్తంగా 12 కేసులు ఉన్నట్లు గుర్తించారు. నిందితుల విచారణలో మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశముందని పోలీసులు భావిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు వీరిని వలపన్ని పట్టుకున్నారు.

# సర్పంచ్ ఎన్నిక కోసం ఎస్ఐ రాజీనామా



**కోదాడ, నవంబరు 29 (జనంసాక్షి) :** రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల కోలాహలం కొనసా గుతుంది. సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఓ సబ్ ఇన్‌స్పెక్టర్ తన ఉద్యోగానికి రాజీనామా చేశాడు. కోదాడ టౌన్ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న పులి వెంకటేశ్వర్లు తన ఉద్యోగానికి రాజీనామా సమర్పించారు. స్వస్థలం కోదాడ మండలం గుడిబండ గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేసేందుకు ఆయన స్వచ్ఛంద పదవి విరమణ చేశారు. పుట్టిన ఊరికి సేవ చేయడమే లక్ష్యంగా ఇంకా 5 నెలల సర్వీస్ ఉండగానే వీఆర్ఎస్ తీసుకున్నట్లు వెల్లడించారు. మేజర్ గ్రామ పంచాయతీ అయిన గుడిబండలో మొత్తం జనాభా 4,486. ఓటర్లు 3,813. వార్డులు 12. ఆదివారం నుండి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ కొనసాగనుంది.

# చిరువ్యాపారి బాలసాని నిర్మలకు అరుదైన గౌరవం

**గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు ఆహ్వానం**

**రామగుండం, నవంబరు 29 (జనంసాక్షి) :** రామగుండం నగర పాలక సంస్థ పరిధిలోని అల్లూరు ప్రాంతానికి చెందిన చిరు మహిళా వ్యాపారి బాలసాని నిర్మలకు అరుదైన గౌరవం దక్కింది. దేశ రాజధాని న్యూఢిల్లీలో జనవరి 26న అత్యంత ప్రతిష్టాత్మకంగా జరగబోయే గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు ఆహ్వానం వచ్చింది. ఈమేరకు శనివారం సాయంత్రం నగర పాలక కార్యాలయంలో అదనపు కలెక్టర్, కమిషనర్ జే. అరుణ శ్రీ ఆమెను ప్రత్యేకంగా అభినందించారు. స్వశక్తితో ఎదగాలనుకునే మహిళలు ఆమెను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. నిర్మల చిరు వ్యాపారిగా పీఎం స్వనిధి పథకంలో పేరు నమోదు చేసుకొని గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2020లో మొదటి విడత రుణం రూ.10వేలు పొంది తన ఇంట్లో ఒక చిన్న దుకాణం ప్రారంభించింది. తన కాళ్లపై తాను నిలబడాలన్న సంకల్పంతో ప్రారంభించిన ఆమె ప్రయాణంలో సకాలంలో రుణం తీర్చి రెండవ విడత రూ.20వేలు అందుకొని అందులోనే చీరల వ్యాపారం చేపట్టింది. ఆ వ్యాపారం విజయవంతం కావడంతో మూడో విడతగా రూ.50వేలు కూడా పొంది వ్యాపారాన్ని విస్తరించింది. నగదు రహిత లావాదేవీలు నిర్వహించిన వీధి వ్యాపారులకు ప్రభుత్వం అందించిన క్యాష్ బ్యాక్ ప్రోత్సాహాన్ని కూడా సద్వినియోగం చేసుకొని అత్యధికంగా రూ.5,340 క్యాష్ బ్యాక్ సంపాదించింది. దీంతో ఆమెకు జనవరి 26న న్యూఢిల్లీలో జరగబోయే గణతంత్ర దినోత్సవ వేడుకల్లో తన భర్త బాలసాని రవికుమార్ గౌడ్ తో కలిసి పాల్గొనడానికి మిషన్ డైరెక్టర్, మెప్మా నుంచి ఆహ్వానం లభించింది. పారిశ్రామిక ప్రాంతంలోని మహిళలు, యువతులు సమయాన్ని వృథా చేయకుండా స్వయంకృషితో పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని అదనపు కలెక్టర్ అరుణ శ్రీ పేర్కొన్నారు.

# దీక్షా దివస్ అంటేే స్వాతంత్ర్య దినోత్సవమే

- **తెలంగాణ వచ్చేదాకా దీక్ష విరమించని కెసిఆర్**
- **భువనగిరి దీక్షా దివస్‌లో మాజీమంత్రి జగదీశ్ రెడ్డి**

**యాదాద్రి భువనగిరి, నవంబరు29 (జనంసాక్షి) :** కేసీఆర్ నా శవయాత్ర.. తెలంగాణ జైత్ర యాత్ర ఒకేసారి జరగాలి అన్నారని.. అప్పటిదాకా దీక్ష విరమించేది లేదని పట్టుబట్టారని అంటూ ఆనాటి ఘటనలను మాజీమంత్రి జగదీశ్‌రెడ్డి గుర్తు చేశారు. ఆనాటి ఆంధ్రా పోలీస్‌లు, నాయకులు ఎన్నో జిమ్మిక్కులు చేశారని.. అయినా అన్నింటిని ఛేదించి తెలంగాణ సాధించామన్నారు.భువనగిరి జిల్లా కేంద్రంలో నిర్వహించిన దీక్షా దివస్ వేడుకల్లో సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రరెడ్డి పాల్గొన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నవంబర్ 29 దీక్ష దివస్ మనందరికీ స్వాతంత్ర్యం తెచ్చిన రోజు అని తెలిపారు. దేశానికి ఆగస్టు 15 ఎలాగో, మనకు నవంబర్ 29 అలాగేనన్నారు. కేసీఆర్ చావు నోట్లో తలపెట్టి, మొక్కవోని పట్టుదలతో దీక్ష చేసి, ఢిల్లీ మెడలు వంచిన రోజనరి పేర్కొన్నారు. కేసీఆర్ దీక్ష చేసిన 11 రోజులు ఒక్కోక్షణం ఒక్కో భయంతో గడిపామని.. తమ నేతకు ఏమైనా అయితే తెలంగాణ ఎటు పోతుందో అని కన్నీరు పెట్టామన్నారు. కేసీఆర్ అంటే తెలంగాణ తెచ్చిన ముఖ్యమంత్రి.. తెలంగాణ కోసం చావు అంచుల దాకా, పేగులు తెగే దాకా కొట్లాడిన ఉక్కు మనిషి కేసీఆర్ అన్నారు. అలాంటి కేసీఆర్‌పై ఇప్పుడు కాంగ్రెస్ దొంగలు అవాకులు చవాకులు మాట్లాడుతున్నారని.. తస్మాత్ కొడుకుల్లారా.. కేసీఆర్‌పై నోరు జారితే ఖబడ్దార్ అంటూ హెచ్చరించారు. కేసీఆర్ తెలంగాణ సమాజానికి దేవుడని.. అందరి గుండెల్లో గూడు కట్టుకున్న మహానేత మా కేసీఆర్ అన్నారు. కేసీఆర్ సైనికులుగా మేమంతా తెలంగాణ అభివృద్ధికి కట్టుబడి పని చేశామని.. ఇప్పుడు వస్తున్న 24 గంటల కరంట్, మంచి నీళ్లు, పాడి పంటలు, తెలంగాణ ఆదాయం అన్ని అన్ని కేసీఆర్ సాధించినవేనన్నారు. కేసీఆర్‌పై కుట్రలు చేయని పార్టీ లేదని.. ఎప్పుడు పిల్లి శాపనార్థాలు పెడతారని విమర్శించారు. ఇప్పుడు కూడా కేసీఆర్ ఆరోగ్యం బాగాలేదని అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు.

# ప్రభుత్వ స్థలంలో విల్లాలు కట్టి అమ్మకం

- **రెయిన్‌బో మెడోస్ నిర్మాణ సంస్థ మోసం**



**హైదరాబాద్, నవంబరు29 (జనంసాక్షి) :** సంగారెడ్డి జిల్లాలోని కిష్టారెడ్డిపేటలో రెయిన్‌బో మెడోస్ నిర్మాణ సంస్థ పాల్పడిన అతిపెద్ద రియల్ ఎస్టేట్ మోసం తాజాగా వెలుగు చూసింది. ప్రభుత్వ స్థలంలో విల్లాలను కట్టి 40కోట్లకు మోసం చేసింది. రెవెన్యూ అధికారులు ఈ తతంగాన్ని చోద్యం చూశారే తప్ప నిలదీయలేదు. హెచ్ఎండీఏ ఆమోదించిన లేఅవుట్‌గా నమ్మించి, పలు సర్వే నంబర్లలో ఏకంగా 40 విల్లాలను అక్రమంగా నిర్మించి అమాయక ప్రజలకు విక్రయించారు. ఇటీవల రెవెన్యూ అధికారుల సర్వేలో ఈ విల్లాలన్నీ సర్వే నంబర్లు 198, 199, 204, 208, 210లలోని ప్రభుత్వ భూమిలో ఉన్నట్లు నిర్ధారణ కావడంతో, కొనుగోలు దారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విల్లాల కోసం ఒక్కో కుటుంబం రూ. 90 లక్షల నుంచి రూ. 1.1 కోటి వరకు వెచ్చించింది. మొత్తంగా, బాధితులు సుమారు రూ. 40 కోట్లకు పైగా పెట్టుబడిని నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. ఈ మోసం వెలుగులోకి రాగానే, తమకు న్యాయం చేయాలంటూ బాధితులు ఆందోళనకు దిగారు. గతంలోనే కొందరు బాధితులు అనుమానం వ్యక్తం చేసినప్పుడు, ఆ భూమి ప్రభుత్వానిదని తేలితే తాము తీసుకున్న డబ్బు మొత్తాన్ని తిరిగి చెల్లిస్తామని రెయిన్‌బో మెడోస్ సంస్థ లిఖితపూర్వక ఒప్పందం ఇచ్చింది. అయితే, ఇప్పుడు అది ప్రభుత్వ స్థలం అని నిర్ధారణ కావడంతో, నిర్మాణ సంస్థ స్పందించకుండా ముఖం చాటేయడంతో బాధితులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. తమ ఇళ్లు ప్రభుత్వ భూమిలో ఉన్నట్లు తేలడంతో, హెచ్ఎండీఏ, ఎంఆర్ఓ, ఆర్‌డిఓ వంటి ప్రభుత్వ వ్యవస్థలు ప్రభుత్వ భూమిని తనిఖీ చేయకుండా ఈ నిర్మాణాలకు ఎలా అనుమతి ఇచ్చాయని బాధితులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంస్థ తమను మోసం చేసిందని ఆరోపిస్తూ, సంస్థ భాగస్వాములైన ఇంటూరి నాగేశ్వరరావు, ఇంటూరి ప్రసాద్, ఎన్.వి. నరసింహారావులపై క్రిమినల్ కేసు నమోదు చేసి, తమకు అయిన నష్టాన్ని పూర్తిగా తిరిగి ఇప్పించాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం, బాధితులు అమీన్‌పూర్ పోలీసులను ఆశ్రయించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ వ్యవహారంపై అధికార యంత్రాంగం ఎలా స్పందిస్తుందో, బాధితులకు న్యాయం జరుగుతుందో లేదో తెలియాల్సి ఉంది.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
30 నవంబర్ 2025

# భారతదేశంలో గ్రామం! స్వయం పాలన వ్యవస్థ

భారతదేశ గ్రామీణ స్వయంపాలన భావన ఎంతో పురాతనది. వేదకాలం నుంచే గ్రామ సభ, జన సమితి వంటి సంస్థలు స్థానిక సమస్యలపై కలిసి నిర్ణయాలు తీసుకునే పద్ధతిని అనుసరించాయి. అప్పట్లో భూమి వాడకం, నీటి పంపకం, సామూహిక వనరుల సంరక్షణ, వివాదాల పరిష్కారం వంటి విషయాల్లో గ్రామ పెద్దలు సంప్రదింపుల ద్వారా తీర్పు ఇచ్చే సంప్రదాయం ఉండేది. ఈ భావనను మహాత్మా గాంధీ "గ్రామ స్వరాజ్యం" అనే మాటతో మరింత స్పష్టంగా దేశమనసులో నాటారు. స్వతంత్ర భారతదేశం నిజమైన బలం గ్రామాల్లోనే ఉందని, ప్రతి గ్రామం సాంఘిక ఆర్థిక రాజకీయ విషయంలో స్వయం సమృద్ధిగా ఉండాలని ఆయన కల కన్నారు.

ఆధ్యాత్మికంగా చాలా కాలంగా గ్రామ స్వయంపాలన నడుస్తున్నా ఆధునిక రాజ్యాంగపరమైన రూపంలో " పంచాయితీ రాజ్" వ్యవస్థ స్థాపన స్వాతంత్ర్యం తర్వాత మాత్రమే స్పష్టమైన దిశలో మొదలైంది. స్వాతంత్ర్యం అనంతరం గ్రామాభివృద్ధి కోసం కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం, నేషనల్ ఎక్స్టెన్షన్ సర్వీస్ వంటి కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. కానీ ఇవి పూర్తిగా అధికార యంత్రాంగం ఆధీనంగా నడవడంవల్ల గ్రామస్థల ప్రత్యక్ష భాగస్వామ్యం తగ్గిపోతోందని ప్రభుత్వం గమనించింది. ఈ నేపథ్యంలో 1957లో బాలవంత్‌రాయ్ మెహతా కమిటీని నియమించింది. ఈ కమిటీ "డెమోక్రటిక్ డీసెంట్రలైజేషన్" అనే భావనను ముందుకు తెచ్చి గ్రామ పంచాయతీ, మండల స్థాయి పంచాయతీ సమితి, జిల్లా పరిషత్ అనే మూడు స్థాయిల స్వయం పాలన సంస్థలను ఏర్పాటు చేయాలని సిఫారసు చేసింది. బాలవంత్‌రాయ్ మెహతా కమిటీ సూచనల ఆధారంగా స్వయం పాలనకు ప్రాయోగిక రూపం ఇవ్వడానికి మొదటి అడుగు రాజస్థాన్‌లో పడింది. 1959 అక్టోబర్ 2న నాగౌర్ జిల్లా బగ్దరి గ్రామంలో అప్పటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ ఆధ్వర్యంలో పంచాయతీ రాజ్ వ్యవస్థను అధికారికంగా ప్రారంభించారు. ఇదే రోజు గాంధీజీ జయంతి కావడంతో గ్రామ స్వరాజ్యంపై ఆయన కలను సాకారం చేసే దిశగా ఈ నిర్ణయానికి ప్రాతినిధ్య పాత్ర కలిగింది. అదే సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఇదే విధమైన పంచాయతీ రాజ్ వ్యవస్థ అమలులోకి వచ్చింది.

అయితే ఈ వ్యవస్థ చాలా రాష్ట్రాల్లో ఒకే విధంగా, ఒకే బలంతో పని చేయలేదు. ఎక్కడో బలహీనత, ఎక్కడో రాజకీయ జోక్యం, ఎక్కడో ఆర్థిక స్వావలంబన లోపం వంటి సమస్యలు ఎదిరించాయి. దాంతో గ్రామీణ స్వయం పాలనకు రాజ్యాంగ రక్షణ కల్పించాల్సిన అవసరం ఏర్పడింది. ఈ నేపథ్యంలో 73వ రాజ్యాంగ సవరణ చట్టం 1992లో పార్లమెంట్ ఆమోదంతో వెలుగులోకి వచ్చింది. ఈ సవరణ ద్వారా రాజ్యాంగంలో 9భాగం, 11వ షెడ్యూల్ జోడించబడి పంచాయతీ రాజ్ సంస్థలకు రాజ్యాంగబద్ధ హోదా లభించింది. ఈ చట్టం 1993 ఏప్రిల్ 24 నుంచి అమల్లోకి వచ్చి దేశవ్యాప్తంగా గ్రామ పంచాయతీలకు స్పష్టమైన అధికారాలు, బాధ్యతలు, ఎన్నికల నిర్వహణ, మహిళలతో పాటు అణగారిన వర్గాలకు రిజర్వేషన్లు వంటి అంశాలపై దృఢమైన పునాది వేసింది.

అందువల్ల "గ్రామీణ స్వయం పాలన భారతదేశంలో ఎప్పుడు ప్రారంభమైంది?" అన్న ప్రశ్నకు రెండు స్థాయిలుగా సమాధానం చెప్పొచ్చు. ఆలోచనాత్మకంగా చూస్తే గ్రామ సభల రూపంలో స్వయం పాలన పూర్వకాలం నుంచే ఉండింది. ఆధునిక ప్రజాస్వామ్య రూపంలో చూస్తే 1959 అక్టోబర్ 2న రాజస్థాన్ నాగౌర్‌లో పంచాయతీ రాజ్ వ్యవస్థ ప్రారంభం చెందింది. రాజ్యాంగబద్ధ స్థాయిలో చూస్తే 73వ సవరణ చట్టం అమల్లోకి వచ్చిన 1993 ఏప్రిల్ 24 నుంచి గ్రామీణ స్వయం పాలనకు దేశవ్యాప్తంగా ఏకరీతి చట్టబద్ధ పునాది ఏర్పడింది.

ఇంత స్థాపితమైన వ్యవస్థలో గ్రామ సర్వతోముఖాభివృద్ధికి సర్పంచ్ స్థానం అత్యంత కీలకమైనది. రాజ్యాంగం, రాష్ట్ర పంచాయతీ చట్టాల ప్రకారం నిర్ణయాలు తీసుకునే సాధికార సంస్థ గ్రామ సభ. ఆ గ్రామ సభ తీర్మానాలకు జీవం పోసే వ్యక్తి సర్పంచ్. గ్రామ పంచాయతీ నిధులు, ప్రభుత్వ పథకాల అమలు, సివిల్ సౌకర్యాల విస్తరణ, సామాజిక సమానత్వం, స్థానిక ఉపాధి సృష్టి, పర్యావరణ రక్షణ వంటి రంగాల్లో సర్పంచ్ నిర్ణయాలు ప్రజల దైనందిన జీవితంపై నేరుగా ప్రభావం చూపుతాయి.

సర్పంచ్ నిజాయితీగా పనిచేస్తే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుండి వచ్చే నిధులు పరిపూర్ణంగా గ్రామ అభివృద్ధి కోసం వినియోగం పొందుతాయి. పల్లెల్లో రహదారులు మెరుగుపడతాయి, తాగునీటి పథకాలు బలోపేతం అవుతాయి, డ్రైనేజీ వ్యవస్థ క్రమబద్ధంగా ఉంటుంది, గ్రామ ఆరోగ్య కేంద్రాలు చురుకుగా పనిచేస్తాయి, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణం పెరుగుతుంది. రైతుల సమస్యలపై దృష్టి పెట్టే సర్పంచ్ సాగునీటి కాలువలను సరిగ్గా నిర్వహించగలడు, వ్యవసాయ విస్తరణ అధికారులు, బ్యాంకులు, సహకార సంఘాలతో సమన్వయం పెంచి రైతులకు పంట రుణాలు, బీమా,



ఎంఎన్ఆర్ఇజిఎ వంటి పథకాలను సమర్థవంతంగా అమలు చేయగలడు.

గ్రామ స్వయం పాలన సారాంశం ప్రజల భాగస్వామ్యం. గ్రామ సభ సమావేశాలు క్రమం తప్పకుండా నిర్వహించి మహిళలు, యువత, పొట్టచేతనికులు, అణగారిన వర్గాల ప్రతినిధులు తమ అభిప్రాయాలు ధైర్యంగా చెప్పేలాగ ప్రోత్సహించే సర్పంచ్ గ్రామంలో నిజమైన ప్రజాస్వామ్య సంస్కృతిని పెంచుతాడు. పథకాల వివరాలను బహిరంగంగా గ్రామ సభ ముందు ఉంచే నాయకత్వం ఉంటే అవినీతి అవకాశాలు తగ్గుతాయి, పారదర్శకత పెరుగుతుంది.దేశ నిర్మాణం దిశగా చూస్తే సర్పంచ్ పాత్ర గ్రామ స్థాయిలోనే "జాతి నిర్మాణం" కార్యక్రమానికి నాయకత్వం వహించే స్థాయిలో ఉంటుంది. స్వచ్ఛ భారత్, హరితహారం, నీటి సంరక్షణ, పునరుత్పాదక శక్తి వినియోగం, డిజిటల్ సేవల వినియోగం, పాఠశాలల్లో ఉపాధి నైపుణ్యాలకు ప్రోత్సాహం వంటి ఆవిష్కరణాత్మక కార్యక్రమాలు గ్రామంలో ఎలా అమలవుతాయో సర్పంచ్ దృష్టి, నిబద్ధతపై ఆధారపడి ఉంటుంది. ఒక గ్రామం విజయవంతంగా రూపాంతరం చెందితే దాని ప్రభావం పక్క గ్రామాలపై కూడా పడుతుంది, చివరికి ఒక మండలం, ఒక జిల్లా అభివృద్ధి మార్గంలో చేరుతుంది.

వచ్చే సర్పంచ్ ఎన్నికలు ఈ నేపథ్యంలో అత్యంత ప్రాముఖ్యమైనవి. ఓటరు ఒక్కరు కూడా "మన బంధువు కాబట్టి", "చిన్న ఉపకారం చేశాడు కాబట్టి", "పార్టీ సూచించిన వ్యక్తి కాబట్టి" అనే కారణాలపై ఆధారపడి నిర్ణయం తీసుకుంటే గ్రామ భవిష్యత్‌ను చిన్న వ్యక్తిగత ప్రయోజనాల కోసం తాకట్టు పెట్టినట్టే అవుతుంది. దానికి బదులు "ఎవరి పనితీరు ఎలా ఉంది", "గ్రామ సభలో ఇప్పటివరకు ఎలా మాట్లాడారు", "నిధుల వినియోగంపై ఎప్పుడైనా వివరణ ఇచ్చారా", "సామాజిక సమానత్వంపై వారి వైఖరి ఏమిటి", "స్త్రీల స్వావలంబనపై ఏ విధమైన కార్యక్రమాలు చేయాలనుకుంటున్నారు", "యువతకు ఉపాధి నైపుణ్యాలపై ఎలాంటి ప్రణాళిక కలిగి ఉన్నారు" వంటి ప్రశ్నలను గ్రామస్థులు తమలో తాము అడిగి సమాధానం కనుక్కోవాలి.

దేశమాతకు నిజమైన గౌరవం కేవలం జెండా ఎగురవేయడంలో, దేశభక్తి నినాదాలు అరిచే కార్యక్రమాల్లో మాత్రమే కాకుండా గ్రామస్థాయిలో ఉన్న ప్రజాస్వామ్య అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడంలో ఉంది. రాజ్యాంగం అందించిన గ్రామీణ స్వయం పాలన వ్యవస్థను బలహీనంగా కాకుండా శక్తివంతంగా నిలుపుదల చేయాల్సిన బాధ్యత ప్రతి ఓటరిపై ఉంటుంది. అభివృద్ధి పట్ల అంకితభావం కలిగిన, జాతి ప్రయోజనం ముందు పెట్టే, గ్రామంలోని ప్రతి వర్గాన్ని సమానంగా చూడగల, ధైర్యంగా అవినీతి తలెత్తకుండా అడ్డుకునే స్వభావం ఉన్న వ్యక్తినే సర్పంచ్ స్థానానికి ఎన్నుకోవడం ద్వారా మనం దేశమాత అభివృద్ధికి ప్రత్యక్షంగా భాగస్వాములమవుతాం.కాబట్టి ఈ ఎన్నికల్లో ప్రతి గ్రామ ఓటు సామాన్య రాజకీయ నిర్ణయం కాదు, దేశ భవిష్యత్తుకు పునాది వేసే చారిత్రక నిర్ణయం. గ్రామ స్వయం పాలన ప్రారంభమైన ఆదర్శాన్ని గుర్తుచేసుకుంటూ, 73వ సవరణ ద్వారా లభించిన రాజ్యాంగ గౌరవాన్ని కాపాడే విధంగా సర్పంచ్ ఎంపిక జరిగితేనే గ్రామం సర్వతోముఖాభివృద్ధికి నడుస్తుంది, దేశం సమగ్ర పురోగతికి కి దారి తీస్తుంది.



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

# బీసీల ఆత్మగీతం జూలూరు పథం



తన అక్షరాలు
యుద్ధం చేస్తయ్
కొమురం భీమ్ కొమురయ్యల చూపు
కొండా లక్ష్మణ్ బాపూజీ వకాలత్ లై
నిలదీస్తాయి
మారోజు వీరన్న ఫిరంగుల్లా మోగుతాయి
ఒకటా రెండా
తెలుగు సాహిత్య చరిత్రలో ఎవరూ రాయని
దీర్ఘ కవితల చిరునామా
బీసీ కవితా పర్జన్యం
వంచించిన విస్మరించిన వాడిని
వెంటాడే వ్యాఖ్యలు వేటాడే సింహ కవిత్వం
లెక్కలతో సహా నిలదీసే బహుజన గొంతుక
దేశమంటే అగ్రకులమేనా?
దేశంలో మేము లేమా? రాష్ట్రంలో మేము లేమా
?
దేశమంటే మట్టికాదు దేశమంటే
మనుషులేనోయ్ అన్నప్పుడు
బీసీలు మనుషులు కారా?. బీసీలు ప్రజలు కారా?
అతని కలం
కపట రాజకీయాల అసమానతలను
సమంచేసే కొలిమి
మునగాల నడిగూడెం వడ్లీరభద్రయ్య మనుమడు
కవితాఝరిలో పయనమైన
అక్షరాల పేర్పు అతని కలం
పెద్దబాడిసజి
దళితబహుజన తాత్విక కాలజ్ఞానం
బీసీ రాజ్యాధికారానికై
కదంకదం కవాతై కండ్లెర్రజే చేస్తున్నడు కాదు
అశ్వరథశరభైలై మండుతున్నడు
కుర్చీలు అగ్రకులాల జాగీర్దారీ కాదు
కుర్చీలు అందరివి కుర్చీలు ప్రజాస్వామ్యం
కుర్చీలు బీసీలవి కూడ
సంక్షేమ పథకాల పేరిట
ముంగిట్లో పక్షులకు నూకల్లా చల్లి
బీసీల రాజకీయ భవిష్యత్ ను కొల్లగొట్టిన మనువాదం
బీసీ అంటే వాడెవడని
అమ్ముడుపోయేవాడని
చైతన్యమే లేదని
సామాజిక స్పృహ రాజకీయ అవగహనే అసలే లేదని
మతిలేనీ నీతిలేని కూతలు కూసే సంకుచిత
ఛాందస వాదులారా
బీసీచైతన్యం బీసీ యుద్ధరావాలు
చూసే కళ్లకు పొరలు కమ్మినవి
రాసే కలాలు కుంటినవి
మాట్లాడే నాలుకలు మడుతబడ్డవి
బీసీల వంచనకు డెబ్బేఎనిమిదేళ్ళు.
రేపటి కాలం బీసీ సూర్యోదయం.

జూలూరు గౌరిశంకర్ గారు ఉద్యమ కవి. మంచి ఉపన్యాసకులు సుపరిచితులు. ప్రస్తుత సంఘటనలు తెల్లారే సరికి పత్రికలో కవితనో వ్యాసంగానో దర్శనమవుతుంది.చదివిన పాఠకులకు మనసు కుదుటపడుతుంది.

అయితే జూలూరు పథం రెండువందల పుటల దీర్ఘకవితను మన ముందుంచాడు..కాశ్మీర్ నుంచి కన్యాకుమారి దాక రైలు బండిలా ఈ దీర్ఘకవిత ప్రయాణిస్తూంటుంది.ప్రతి అధ్యాయం ఒక బోగిలా ...బడుగు జీవితాల,పోరాటాలు, బీసీ ప్రాపంచిక దృక్పథాలు ముచ్చటిస్తున్నట్లు వాదిస్తున్నట్లు కథలు చెబుతూ పాటలు పాడుతున్నట్లు యుద్ధానికి సిద్ధం చేస్తున్నట్లు సాగుతుంటది. అనేక ఉద్యమాలకు బాసటగా నిలిచిన జూలూరు కవిత్వం.తెలంగాణ ఉద్యమం,దళితోద్యమం ,విప్లవోద్యమం , స్త్రీ వాద అస్తిత్వ ఉద్యమాలు కావొచ్చు ఏదైనా ఆధిపత్యానికి వ్యతిరేకంగా సమానత్వానికి సమభావనకు,మట్టికి మనిషికీ,మనిషికి ఊరికీ,ఊరికి బహుజనుల పోరాట సంబంధాల వారసత్వాన్ని ఆవిష్కరించడం గొప్ప విషయం..

బీసీ అస్తిత్వమే అభ్యున్నతికి సామాజిక రాజకీయ సాధికారతకి నిలువెత్తు "బీసీల ఆత్మగీతం జూలూరు పథం".జూలూరు కవిత్వంలో ఇదొక ఆత్మ కథనాత్మక కవిత అన్నాడు కానీ,ముమ్మాటికి బీసీల ఆత్మగీతం. చూసినవి అనుభవించినవి నడిచినవి, నిలిచినవి తెలిసినవి పొగొట్టుకున్నట్టు దృశ్యమానం చేశాడు. సముద్రపు అలల్లా కొలిమిలో నిప్పుల్లా అన్ని సత్యాలే.

దుఃఖపు జీవితాల చుట్టూ అల్లుకున్న కలలు, కన్నీళ్లు కేరింతలు పోరాటాలు, అవమానాల గాయాల సమాహారమే జూలూరు పథం. ఎన్నాళ్లు బిగబట్టాడో గానీ అగ్నిపర్వతంలా బద్దలై, బొడ్డులో నుంచి దూసిన కత్తిలా, అమ్ముల పొదిలో బాణంలా, ఇది ఒక వలపోత, ఒక తలపోత ఒక పలువరింత తిరుగుబాటు తెగతెంపుల తెలంగాణ సంగ్రామం .దిక్కులు పిక్కటిల్లేలా గర్జిచి రాశాడు.ఎత్తిన జెండాని నడిచిన తొవ్వని, మాట్లాడిన మాటల్ని,జాజు కుంచెలతో రాసిన అక్షరాల్ని గెలిపించడానికి కాలంతో యుద్ధం చేస్తూ ఎదురీదాడు.యుద్ధక్షేత్రమయ్యాడు.

అతను రాయని సందర్భం లేదు తాఃని వస్తువులేదు. తాను ఇదివరకే గతంలోనే కవిత్వం వ్యాసాలతో తెలుగు సాహిత్యంలో లబ్దప్రతిష్టుడు. అశ్వపు పరుగులా నిమిషంలో నిప్పుల వర్షం కురిపించిన దీర్ఘకవితలెన్నో...ఎన్నెన్నో..

పగిడేరు ఎన్కౌంటర్ దుఃఖం "ఎలియాస్"
దళిత కవిత్వ నేపథ్యం"పాదముద్ర"
కరువు రైతుల ఆత్మహత్యల కన్నీళ్లే "కాటు"
మలిదశ తెలంగాణ ఉద్యమ తొలి పిడికిలి "నా తెలంగాణ"
గద్దర్ పై దాడి జరిగిన నేపథ్యంలో రాజ్యము...గద్దరు మనము!!! (ప్రసేను వంశీకృష్ణ తో కలిపి)
పర్యావరణ పరిరక్షణపై "ఊరు చావు"
కార్పొరేట్ కళాశాలల విద్యార్థుల ఆత్మహత్యల స్వరూపం
"ఓ నమశ్శివాయ'
విప్లవోద్యమ ప్రస్థానం మొగిలిచర్ల
"ముండ్లకర్ర,"మాలకాకి", "సెగ" కవిత్వ సంకలనాలు
బహుజన ధీర్ఘ కవిత "సిలబస్లో లేని పాఠం"
బీసీ కవిత్వం " నాలుగో కన్ను"
ఇది తెగతెంపుల సంగ్రామం, తెగిస్తేనే తెలంగాణ సాధ్యం
"చెకిముఖి రాయి"
తెలంగాణ ఉద్యమ సమయంలో "పొంతకుండ"
అస్తిత్వ ఉద్యమాల పోరాటాల చౌరస్త వడ్రంగి కుల "కొలిమి"
అమెరికా ఆధిపత్య దాడుల నేపథ్యంలో "మూడవగుణపాఠం"
మిషన్ భగీరథ స్ఫూర్తితో చెరువును అక్షరీకరించిన "నీటిగుమ్మి"
తెలంగాణ సామాజిక జనజీవన వెతల
కు అక్షరరూపం "పొక్కిలి" సురవరం అనంతరం ధిక్కారంగా

వెనుకబడిన కులాల చైతన్య కేతనం,బీసీ అస్తిత్వ. సాంస్కృతిక నాదం "వెంటాడె కలాలు వెనుకబడిన కులాలు" బీసీ కవితా. సంకలనం.... అరాచాకానికీ ఆధిపత్యానికీ ముచ్చెమటలు పోయించిన సద్దాంహుస్సేన్ ఉరితీతను నిరసిస్తూ "సదాసద్దాం" తెచ్చాడు.తెలంగాణ ఉద్యమంలో ఉద్యోగులు సబ్బండ జనులు చేసిన చారిత్రక సుదీర్ఘ సమ్మె 42రోజుల సకలజనుల సమ్మె యదార్థ సంఘటనలను రెండు బృహత్తర సంకలనాలుగా తెలంగాణ చేతికిచ్చాడు., సాహసాలు సంచారాలు ఉద్యమ సంకలనాలకు కవిత్వపు చౌరస్త. బహుజన పందిరి జూలూరు గౌరిశంకర్.

భావితరాలకోసం ఉద్యమ చైతన్యాన్ని నిక్షిప్తం చేశాడు. సమకాలీన సమస్యలకు నిత్యం స్పందిస్తూ ఉద్యమ కవిత్వంలో మునిగాడు.ఇలా ఎన్నింటినో రాసి మనలోకి భావజాల చైతన్యం నింపాడు. తెలంగాణ బాటకు బీసీ బాటకు కవిత్వపు కేతనాలను రెపరెపలాడించాడు.

జాషువా -నా ఆత్మకథ, శ్రీ శ్రీ -అనంతం,కాళోజీ - నా గొడవ, సామల సదాశివ-యాది, దాశరథి-జీవన యానం, నాజర్ పింజారి షేక్, పుచ్చలపల్లి సుందరయ్య -విప్లవపథంలో నా పయనం, మల్లుస్వరాజ్యం- నా గొంతె తుపాకి పాట, సరస్వతి గోరా- గోరాతో నా జీవితం, కుందుర్తి -బతుకు మాట, గడియారం రామకృష్ణశర్మ శతపత్రం, మై పాదర్ బాలయ్య, శివశంకర్ - అదొక్కటే ముగింపు, గుడిసెల వెంకట్ స్వామి - మేరా సఫర్ తెలుగు నేలన ఎన్నో ఆత్మకథలు. వాటిలాగే అదే ఒరవడిలో చదువాల్సిన "జూలూరు పథం" విప్లవొద్యమం తెలంగాణ ఉద్యమం ఆవిష్కరిస్తూనే బీసి రాజకీయ ఉద్యమం వివిధ సందర్భాల్లో కదిలించిన ప్రతి క్షణాలు కవితా రూపాలై కదనరంగాన్ని పూరించాడు.ప్రతి కవితను ప్రతి వాక్యాన్ని జూలూరు పథంలో చదువుదాం...

- ◆ కవిత్వం నా తల్లి వేరు// పాట జీవనది బహుజనావళి
- ◆ తెలంగాణలో కవులు సోక్రటీస్ వారసులు//

మట్టిని ముద్దాడి మట్టిని ఆలింగనం చేసుకుని బతుకునిచ్చిన మట్టిని//వంటి నిండా రాసుకొని ఆ మట్టి పంచే జీవికలను అక్షరాలా// మట్టి ముద్దలను// చేస్తున్న తెలంగాణ కవులు.

తరువాయి రేపటి సంచికలో..

వనపట్ల సుబ్బయ్య, 9492765358

# ఖనిజ సంపద కొల్లగొట్టడానికే ఆదివాసులపై ఆపరేషన్ కగార్

మార్క్సిజం మావోయిజం ఆలోచనలతో గత కొన్ని సంవత్సరాలు క్రితం ఏర్పడినటువంటి నక్సల్బరీ ఉద్యమం మొదలైనప్పటి నుండి 1967 నుండి 2020 వరకు ఎన్నో త్యాగాలు వారికి సొంతమైనాయి నేడు నక్సల్బరీ నుండి మావోయిస్టు దాకా పీపుల్స్ వార్ నుండి మావోయిస్టుదాక ఎన్నో రూపాంతరాలు చెందింది నేటి వరకు మావోయిస్టు పార్టీగా అతిపెద్ద విప్లవ పార్టీగా భారతదేశంలోని ఆవిర్భవించింది భారతదేశంలో పశ్చిమబెంగాల్ డార్జిలింగ్ జిల్లా అనే గ్రామంలో నక్సల్బారి గ్రామంలో శాంతి ముండా కాఫీ తేయాకు తోటల్లో భూమికోసం భుక్తి కోసం ఉద్భవించింది అక్కడి నుండి పశ్చిమ బెంగాల్ నుంచి మొదలైన నక్సల్బరీ ఉద్యమం శ్రీకాకుళం కొండలలో గిరిజన ఉపాధ్యాయులు ఆదిభట్ల కైలాసం వెంపాట సత్యం కోరన్న కొమురన్న గణపతి ఎందరో యువ కిశోరాలు ఎదురుకాల్పులలో చనిపోయారు అప్పట్లో జలగం వెంగళరావు ముఖ్యమంత్రి ఆయన వరుస ఎన్కౌంటర్లతో నక్సల్ బరి ఉద్యమం పూర్తిగా తుడుచుక పోయింది బాహాటంగానే ప్రకటించారు ఎన్నో నక్సల్బరీ ఉద్యమంలో ఆటుపోటులను అధిగమిస్తూ గమ్యం గమనం చేర్చుకుంటూనే ఉంటుంది ఉద్యమ ప్రస్థానంలో రెండు అడుగులు వెనక్కి వేస్తే నాలుగడుగులు ముందుకు సాగింది తెలంగాణలో 1981లో జగిత్యాల జైత్రయాత్ర రైతులను భారీ సంఖ్యలో కదిలించారు జనాన్ని చూసిన పోలీసులు కాల్పులను మొదలుపెట్టారు ఆ కాల్పుల్లో ఎంతోమంది రైతులు ప్రాణాలు కోల్పోయారు ఇంద్రవెల్లిలో గిరిజనులపై పోలీసులు కాల్పులు జరపడంతో 21 మంది గిరిజన వీరులు నేలరాలినారు 1975లో ఎమర్జెన్సీ హయంలో గిరాయిపల్లిలో సురపానేని జనార్ధన్, ఆనంద్ రావు లంక మోహన్ రెడ్డి సుధాకర్ లను చెట్టుకు కట్టేసి కాల్చి చంపారు తెలంగాణ నుండి విప్లవ నేతలు పశ్చిమబెంగాల్ వెళ్తే పశ్చిమబెంగాల్ నుంచి తెలంగాణకు వచ్చి విప్లవ నేతలు విప్లవ ఉద్యమాన్ని శూన్యంగా పరిశీలించారు కిషన్ జి పశ్చిమబెంగాల్లో లాల్ గాడ్ విప్లవ ఉద్యమానికి నాయకత్వం వహించారు భారత దేశంలో ఒక ప్రాంతం నుంచి మొదలైన నక్సల్బరీ ఉద్యమం ఎగబాకింది ఆనాడు భారత దేశంలో తెలంగాణ గుండెకాయ లాంటిది తెలంగాణ నుండి 1980లో నక్సల్బరీ ఉద్యమానికి పూర్తి స్థాయిలో అజ్ఞాతవాసం వెళ్లిన నాయకులే నేడు కేంద్ర కమిటీ స్థాయికి ఎదిగారు తెలంగాణలో 1980 నుండి 96 వరకు సామంతరమైన ప్రభుత్వాన్ని నడిపించగలిగారు వరుస ఎన్కౌంటర్లతో వరుస లొంగుబాటులో అరెస్టులు వల్ల తెలంగాణలో సాయి దళాలు లేకుండా పోయింది దండకారణ్యానికి చేరినై భూమికోసం భుక్తి కోసం తెలంగాణ ప్రజల విముక్తి కోసం తాడిత ప్రజల కోసం ప్రజల విముక్తి కోసం బంచన్ దొర కాళ్ళు మొక్కుతా అనే బానిస నుంచి విముక్తి కల్పించింది సాయుధ పోరాటమే కమ్యూనిస్టులు 1942లో రజాకారులకు వ్యతిరేకంగా జరిపిన పోరులో పదివేల మంది అమర్త్యం పొందారు పది లక్షల ఎకరాల భూములను భూస్వాముల వద్ద నుంచి పేదలకు పంచారు తెలంగాణ అంటే త్యాగాలకు పుట్టినిల్లు విప్లవాలకు పుట్టినిల్లు ఇదంతా ఒకెత్తయితే కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆపరేషన్ కగార్ మావోయిస్టులను ఆదివాసులను అతిలోకతలం చేస్తుంది దండకారణ్యంలో మావోయిస్టులు గత 50 ఏళ్లుగా పట్టును సాధించారు వారికి పెట్టని దండకారణ్యం ఉంది దండకారణ్యం వ్యాప్తంగా దట్టమైన అడవులు ఆదివాసులు తెగలు నివసిస్తున్నారు ఆదివాసులకు నాగరికత అంటే తెలియదు వారికి మావోయిస్టులు అండగాయై వ్యవసాయాన్ని నేర్పించారు నాగరికతను నేర్పించారు ఆదివాసుల కోసం ఇక్కడో తెలంగాణ నుండి దండక అరణ్యం అడవుల కెళ్ళి నూతన ప్రజాస్వామ్య విప్లవం కోసం పోరును మరింత ముందుకు నడిపారు దాండకారణ్యంలో దండులై చీమలదండులై కదిలారు జారండ్ చతిస్గడ్ ఉత్తరాంచల్ బీహార్ ఒరిస్సా మధ్యప్రదేశ్ మహారాష్ట్ర తెలంగాణ ఆంధ్ర ఆయా రాష్ట్రాలలో 254 జిల్లాలో నక్సల్ ప్రభావితం తీవ్రంగా ఉందని గతంలోని కేంద్ర ప్రభుత్వాలు నివేదికలను వెల్లడించాయి ఆపరేషన్ కగర్‌తో మావోయిస్టులు ఉనికిడి పట్టును కొంతమేరకు కోల్పోతున్నారు లొంగుబాటులు ఎన్కౌంటర్లే ఇందుకు ప్రధాన కారణం మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు ఎన్కౌంటర్ తర్వాత మావోయిస్టు పార్టీకి పెద్దదెబ్బ తగిలినట్టే దానితో ఆగకుండా మల్లోజుల వేణుగోపాల్ తక్కడపెల్లి వాసుదేవరావు లు ఆయుధాలు అప్పగించి లొంగిపోవడం పార్టీకి పెద్ద నష్టమే వీరితో లొంగుబాట్లు ఆగకుండా తరచూ లొంగుబాటులతో పార్టీ నష్టపోతుంది ఆపరేషన్ కగార్‌తో బేస్ క్యాంపులు ఏర్పాటు చేసి సుమారు 654 బేస్ క్యాంపులు ఉన్నాయని తెలుస్తుంది వేలాదిమంది పోలీస్ బలగాలను అడవుల్లో దించి అడవులలో ఉన్నటువంటి ఖనిజ సంపదను స్వదేశీ విదేశీ బహుళ జాతి కార్పోరేట్ సంస్థలకు అమ్మడం కోసమే మావోయిస్టులను ఆదివాసులను నిర్మూలిస్తున్నారని ప్రజా సంఘాలు వాము పక్షాలు తీవ్రస్థాయిలో కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్నారు మోడీ అమిత్ షా లు పాకిస్తాన్ తో చర్చలు జరుపుతారు కానీ మన భారతదేశంలో పుట్టినటువంటి భారతీయులతో చర్చలు జరపకుండా ఏకపక్షంగా కాల్పులకు తెగబడుతున్నారు ఆపరేషన్ కగార్ తో మావోయిస్టులు ఆదివాసులు సుమారు 1000 మంది వరకు పోలీసుల కాల్పుల్లో చనిపోయి ఉంటారని ఒక అంచనా ఉంది నంబాల కేశవరావు ఎన్కౌంటర్ అనంతరం మరుసటిరోజే మహారాష్ట్రలో ఐదు వేల ఎకరాల భూమిని ఓ బహుళ జాతి సంస్థకు మహారాష్ట్ర ప్రభుత్వం లీజుకి ఇచ్చింది చతిస్గడ్ రాష్ట్రంలో కూడా మాడవి హిడ్మ చత్తీస్గడ్ భూములను కూడా బహుళజాతి కంపెనీలకు కట్టబెట్టారు మైనింగ్ యదేచ్ఛగా కొనసాగుతుంది అడవిపై ఆదివాసులకు అడవి బిడ్డలకు పూర్తి హక్కు ఉంటుంది అడవి బిడ్డల ఆదివాసుల హక్కులను కాలదన్ని కేంద్ర ప్రభుత్వం సొంతగా ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటూ ఆదివాసుల హక్కులను పూర్తిగా కాలదన్నుతుంది దండకరణ్యంలో మైనింగ్ కొనసాగితే పర్యావరణానికి పూర్తిగా ప్రమాదం వాటిల్లే ప్రమాదం ఉంది చత్తీస్గడ్ రాష్ట్రంలో ఖనిజ సంపద కోసం మైనింగ్ తోపకాలు బోర్డులు ఏదేచ్ఛగా పెడుతున్నారు క్యాన్సర్ వ్యాధి వస్తుందని బోర్డులో ఉండడం విశేషం అడవి హక్కులు అడవిని పరిరక్షించుకోవడానికి ఇన్నాళ్ల కాలం మావోయిస్టు లు ఉండడంతో ఏ ఒక్క బహుళ జాతి సంస్థలు అక్కడ వెళ్లాలన్న భయపడేవి ఇప్పుడు మావోయిస్టులు లేరని దర్జాగా మైనింగ్ తవ్వకాలు మొదలుపెట్టారు ఆదివాసులకు అండ ఎవరు పాలకులు అనుకున్నదే పూర్తి అవుతది గలగల పారే సెలహేరులు చల్లని గాలులు వీచే పచ్చని అడవులు అందమైన కొండ కోనలు ఎత్తైన కొండలు లోతైన లోయలు గలగల పారే జలపాతాలు నదులు వాగులు వంకలు అన్ని విధ్వాంశం అవుతాయా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి మోదీ అదానికి అడవిని కట్టబెట్టి



పర్యావరణానికి పూర్తిగా హాని కలిగించే విధంగా ముందుకు సాగుతున్నారని వామపక్ష పార్టీల నేతలు బహటంగానే వ్యతిరేకిస్తున్నారు చత్తీస్గడ్ ఒరిస్సా మహారాష్ట్ర ఆంధ్రప్రదేశ్ తెలంగాణ కర్రెగుట్టలు డ్రోన్ కెమెరాలు సాయుధ భద్రత బలగాలు విహరించాయి అడవి మొత్తాన్ని తమ ఆధీనంలోకి తీసుకు వచ్చి మావోయిస్టుల ఏరు వేత కోసం జల్లెడ పడుతున్నారు దండకారణ్యం రావణకాష్టంగా మారింది ఎటు చూసినా ఆదివాసుల వలసలతో ఆదివాసుల గూడాలు గుడారాలు చెదిరిపోయి పుట్టకొకరు చెట్టుకొకరు ఏకాకి లాగా బతుకు హీడుస్తున్నారు సాయుధ బలగాల భయంతో ఆదివాసులు వేల సంఖ్యలో అడుగులను వదిలేసి తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలకు వలసలు పెరిగినాయి ప్రభుత్వ గణాంకాలే చెబుతున్నాయి స్వాతంత్రం వచ్చి 78 ఏళ్లైనా ఆదివాసులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిన పాపాన పోలే ఆదివాసులకు కనీసం కూడు గుడ్డ గూడు లేదు ఆదివాసుల బతుకులు అడవికే పరిమితమైనవి భారతదేశానికి మూలవాసులు ఆదివాసులు మధ్యభారతంలో రాజ్య హింస చెలరేగి ఆ రాజ్య హింసలో ఎంతోమంది ఆదివాసులు మావోయిస్టులు తమ ప్రాణాలను తృణప్రాయంగా వదిలేస్తున్నారు మానవ హక్కులను హరించబడినవి భారతదేశ ప్రధాని మోడీ అమిత్ షా ధన దాహానికి అడ్డు అదుపు లేకుండా పోయింది సాయుధ పోలీసుల బలగాల బాంబులకు విశ్రాంతి లేదు ఆదివాసి ప్రజలకు కంటిమీద కునుకు లేదు దండకారణ్యంలో తూటా పడని స్థలము లేదు వలసదారులకు ఆకలి తీర్చే హస్తాలు లేవు కేంద్రం ధనధహం తీయడం లేదు ప్రాణాలు అంటే లెక్కలేదు మానవత్వం పూర్తిగా మరణించింది రాక్షస దాడులు ఆగడం లేదు ఆదివాసుల నామరూపాలు లేకుండా పోయినాయి ఆదివాసి మహిళలపై దారుణాలు జరుగుతూనే ఉన్నాయి ప్రాణాలు ఉన్న ఆదివాసి ప్రజలు పలుచబడ్డారు ఎక్కడ చూసినా మరణాలు సంభవిస్తున్నాయి కాల్పుల విరమణ అనేది లేకుండా పోయింది వారిని అడ్డు అదుపు చేసేది ఎవరు ఆదివాసి ప్రాంతాలలో పచ్చని అడవులలో పక్షుల రాగాల మధ్య కోయిలమ్మ పాటల వడిలో అందంగా కనిపించే ఆ పచ్చని అడవులలో పోలీసుల బూట్లతో తుపాకుల మూతలతో దద్దరిల్లుతుంది ఆ దండకరణ్యం ఆదివాసులకు మద్దతుగా భారత దేశ వ్యాప్తంగా సంఘీభావం తెలుపుతూనే ఉన్నారు అయినా ఆపరేషన్ కగార్ మరింత ముందుకు దూసుకెల్లడంతో ఆదివాసి ప్రజలు భయం గుప్పెట్టిలో బతుకుతున్నారు ఇప్పుడు ఆదివాసులకు కావాల్సింది వారి హక్కులు అడవి మీద పూర్తిగా హక్కులు బహుళ జాతి కంపెనీల అగత్యాలనుంచి వారికి రక్షణ కల్పించాలని బలగాల పోలీసుల నుంచి ప్రాణాపాయం నుండి వారికి రక్షణ కల్పించాలని ప్రజాసంఘాల నేతలు ప్రభుత్వాలకు ముట్టికాయలు వేస్తూనే ఉన్నారు మావోయిస్టుల చాకుతో కేంద్ర ప్రభుత్వం అడవుల్లో ఉన్నటువంటి ఖనిజ సంపదను విదేశీ స్వదేశీ కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు తహతహలాడుతుంది ఆపరేషన్ కగార్ తో మావోయిస్టులు నిర్మూలన కోసం వేలాది కోట్ల రూపాయలు కేంద్రం ఖర్చు చేసింది మావోయిస్టులు ఆపరేషన్ కగార్ మొదలైనప్పటినుంచి చర్చలకు వస్తామని అంటూనే ఉన్న చర్చలు జరుపమని కేంద్రం మొండికేసింది కేంద్రంపై చర్చలు జరపాలి అంటూ ప్రజా సంఘాలు వామపక్ష పార్టీలు ఆయా రాజకీయ పార్టీలు కేంద్రంపై ఒత్తిడి తెచ్చినప్పటికీ చర్చలు జరపమంటూ మొండికేసి ఆపరేషన్ కగార్ ను ఆపమంటూ అమిత్ షా మోడీ లు మరింత ముందుకు దూకుడుగా వ్యవహరిస్తున్నారు ఈ మైనింగ్ వల్ల అడవి భూములు అంతరించిపోయి ఆదివాసులు నివసించడానికి ప్రమాదకరంగా మారుతుంది అడవులలో ఇప్పటికే స్మగ్లర్లను చెలరేగిపోతున్నారని వార్తలు వస్తున్నాయి 2026 మార్చి నాటికి ఆపరేషన్ కగార్ పూర్తి చేస్తామంటూ మావోయిస్టు రైతు ప్రాంతంగా ప్రకటిస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పలు దశాలుగా ప్రకటించారు మావోయిస్టుల ఆదివాసుల మీద యుద్ధం కాకుండా భారతదేశంలో ఉన్నటువంటి ఆర్థిక అసమానతలను పేదరికాన్ని వలసలను నిర్మూలించాలని ఒక భావజాలం చంపినంత మాత్రాన ఆ భావజాలం ప్రజల హృదయాల నుండి బ్రిటిష్ కాలం నుండి బ్రిటిష్ వలస వాదానికి వ్యతిరేకంగా ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అల్లూరి సీతారామరాజు బిసాముండే కొమరం భీం అల్లూరి సీతారామరాజు నేటి తరం ఆదివాసీ నాయకులు మడవి హిడ్మ వరకు ఎందరెందరో తమ అమూల్యమైన ప్రాణాలను వదిలేసుకుంటున్నారు అడవి మాదని అడవిపై హక్కులు మాకేనని ఆదివాసులు గిరిజనులు ఎప్పటినుండో పోరాటాలు నిర్వర్తిస్తూనే ఉన్నారు పాలకులకు పేదలను పట్టించుకోకుండా ధనవంతులకే ఊడిగం చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి మావోయిస్టులను కోవర్టుల సహాయంతో పట్టుకొని తీవ్ర చిత్రహింసలకు గురిచేసి ఎన్కౌంటర్ హత్యలకు పాల్పడుతూ కట్టుకథలు అల్లుతున్నారని పౌర హక్కుల సంఘాలు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నాయి భారతదేశంలో దేశ సంపదంత ఐదు శాతం మందిలోనే ఉందని పేదరికం ఉన్నంతవరకు విప్లవ ఉద్యమాలు చిరస్థాయిగా కొనసాగుతాయి నాడు భగత్ సింగ్ సుగుదేవ్ రాజు గురువులను ఉరితీస్తే ఉద్యమం ఆగిందా నేటి వరకు కూడా అదే తరహాలో విప్లవాలు కొనసాగుతూనే ఉన్నాయి పాలకులు ఎప్పుడైనా ప్రజల సమస్యలు పట్టించుకోకుండా తూటాలతోనే సమాధానం చెబుతా అంటున్నారు ఇప్పటికైనా ఆపరేషన్ కగర్ కాకుండా మావోయిస్టులతో చర్చలు జరిపి శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పేందుకు కేంద్ర ప్రభుత్వాలు అడుగుల వేయాలని ప్రజలు కోరుతున్నారు

-దామరపల్లి నర్సింహ్మారెడ్డి
95505555138

# బీఆర్ఎస్‌తోనే నిజమైన అభివృద్ధి

**● ఎమ్మెల్యే కృష్ణారావు**



**శేరిలింగంపల్లి, నవంబర్ 29 (జనంసాక్షి) :** భారత రాష్ట్ర సమితి పార్టీతోనే తెలంగాణ రాష్ట్రంలో నిజమైన అభివృద్ధి సాధ్యపడుతుందని, ఇప్పుడు రాష్ట్రంలో కొనసాగుతున్న పార్టీ మాటలతో గడిపేసే పార్టీ అని, ఢిల్లీకి మూటలు మోసే పార్టీ అని కూకట్‌పల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పేర్కొన్నారు. ఈ మేరకు శేరిలింగంపల్లి నియోజకవర్గ కొండాపూర్ డివిజన్ పరిధి ఆఫీస్ పెట్ ప్రేమ్ నగర్ బి బ్లాక్ లో అల్లావుద్దీన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన బిఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని శనివారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ అనే పేరు చెప్పుకుంటున్నామంటే దానికి బిఆర్ఎస్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు కెసిఆర్ వల్లనే సాధ్యమైందని తెలంగాణ ప్రజలు గుర్తుంచుకోవాలని అన్నారు. ఎమ్మెల్యే గాంధీ ఏ పార్టీలో ఉన్నాడో ఆయనకే తెలియట్లేదని, మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్, మాజీ మంత్రి కెటిఆర్ పుణ్యమా అని కోట్ల రూపాయల నిధులు శేరిలింగంపల్లి నియోజకవర్గానికి ఇచ్చారని గుర్తు చేశారు. ఎమ్మెల్యే అరికెపూడిగాంధీ కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లినప్పటినుండి నియోజకవర్గానికి ఎన్నికోట్ల నిధులు తెచ్చారో ప్రజల సమక్షంలో వివరించాలని మాధవరం డిమాండ్ చేశారు. పార్టీ కోసం ప్రజల కోసం పనిచేసేవారికి కార్పొరేటర్ ఎన్నికలలో మరియు ఎమ్మెల్యే ఎన్నికలలో అవకాశాలు ఇప్పించే బాధ్యత తనదని ఈ సందర్భంగా నాయకులు కార్యకర్తలకు కృష్ణారావు హామీని ఇచ్చారు. ఎమ్మెల్యే గాంధీపై వ్యతిరేకతతో కాంగ్రెస్ పార్టీలో చేరిన కార్పొరేటర్లు తిరిగిరావాలని కృష్ణారావు కోరారు. మాజీ కార్పొరేటర్ బి. నవతారెడ్డి చెప్పినట్టు జై తెలంగాణ అనే పదం ఎమ్మెల్యే గాంధీ నోటివెంట రాలేదని, దానికి సాక్ష్యం మాజీ కార్పొరేటర్ సాయిబాబా అని చెప్పడం ఎంతో ఆశ్చర్యంగా ఉందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఆంధ్ర ప్రాంతానికి చెందిన అరికపూడి తెలంగాణ శాసనసభ్యుడిగా కొనసాగుతున్నాడంటే ప్రాంతీయ విభేదాలు లేకుండా స్నేహభావంతో కలిసి ఉండాలన్న కెసిఆర్ ఆలోచన అని ఈ సందర్భంగా గుర్తు చేశారు. తెలిపారు. తమపార్టీ కార్యకర్తలను పోలీసులు ఇబ్బంది పెడుతు కేసులు బనాయిస్తున్నారని, అధికారం ఎవరికి శాశ్వతం కాదన్న నిజాన్ని గ్రహిస్తే మంచిదన్నారు. తమ కార్యకర్తలను ఇబ్బంది పెడితే ఊరుకునేది లేదని పోలీసు వారికి కృష్ణారావు సూటిగా స్పష్టం చేశారు. అల్లావుద్దీన్ పటేల్ మాట్లాడుతూ కొండాపూర్ డివిజన్ లో ఏ సమస్య వచ్చినా ప్రజలతోపాటు ఉంటూ వారి సమస్య పరిష్కరిస్తానని పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని పార్టీ ప్రారంభోత్సవానికి వచ్చిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేస్తున్నానని ఆయన అన్నారు, ఈ కార్యక్రమంలో గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ సాయిబాబా, మాజీ కార్పొరేటర్ నవతారెడ్డి, రవి యాదవ్, సీనియర్ నాయకులు రంగారావు, వాల హరీష్ రావు, గంగారం సంగారెడ్డి, బాబు మోహన్, మల్లేష్, శ్రీనివాస్ గౌడ్, చందానగర్ శ్రీకాంత్, మహిళ నాయకురాలు రోజా, డివిజన్ సీనియర్ నాయకులు సంతోష్, బాలరాజ్, లక్ష్మణ్, మహేందర్, రాజశేఖర్ యాదగిరి, శ్రీను నాయుడు, పార్టీ కార్యకర్తలు మహిళలు పాల్గొన్నారు.

## దళితుల భూముల కబ్జాపై కమిషన్ కఠిన వైఖరి



**మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి, నవంబర్ 29 (జనం సాక్షి) :** ఎస్సీ ఎస్టీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడడమే కాకుండా వారికి న్యాయం జరిగే వరకూ పోరాడుతామని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమీషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య వెల్లడించారు, కూకట్పల్లి మండలం మూసాపేట్ దాయరగూడలో సర్వే నెంబర్ 155 లోని దళితుల భూములు హైడ్రా అధికారుల దౌర్జన్యంతో కబ్జా అయ్యాయని బాధితులు తెలిపిన నేపథ్యంలో చైర్మన్ ప్రత్యక్షంగా పరిశీలించగా, కోర్టు కేసు పెండింగ్ లో ఉన్నప్పటికీ దశాబ్దాలుగా దళితుల పూర్వీకులు అనుభవిస్తున్న భూమిపై ఫెన్సింగ్ వేయడం తీవ్ర అన్యాయమని పేర్కొన్నారు, దళితుల హక్కులు హరించే వారెవరైనా ఉపేక్షించేది లేదని హెచ్చరిస్తూ హైడ్రా హెచ్ఎండిఏ అధికారులకు నోటీసులు జారీ చేస్తామని, అవసరమైతే ఎస్సీ ఎస్టీ హక్కుల ఉల్లంఘన కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు, బాధితులకు ఎలాంటి నోటీసులు, నష్టపరిహారం ఇవ్వకుండా స్థలాన్ని కబ్జా చేయడం చట్ట విరుద్ధమని వ్యాఖ్యానించారు, దళితులకు న్యాయం జరిగి భూములు తిరిగి అందే వరకు తమ అండదండలు ఉంటాయని భరోసా ఇచ్చారు, ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి ఆర్డీవో శ్యాంప్రకాష్, జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి వినోద్ కుమార్, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి పద్మజ, స్థానికులు పాల్గొన్నారు.

## వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు ప్రత్యేక చర్యలు

**● టీజీ ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ చక్రపాణి**



**కాప్రా, నవంబర్ 29 (జనం సాక్షి) :** రాష్ట్రంలో వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ ను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని తెలంగాణ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కమర్షియల్ డైరెక్టర్ చక్రపాణి అన్నారు. కాలనీల్లో నెలకొన్న విద్యుత్ సమస్యల పరిష్కరంలో భాగంగా శనివారం చర్లపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ పరిదిలోని సాయినగర్ కాలనీతో పాటు పది కాలనీల్లో భస్తీబాట నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఇంజనీర్ కామేష్, హబ్సీగూడ విద్యుత్ సర్కిల్ సూపరింటెండెంట్ అఫ్ ఇంజనీర్ (ఎస్ఈ) వెంకన్నలతో కలసి డైరెక్టర్ చక్రపాణి పాల్గొన్నారు. చర్లపల్లి డివిజన్ పరిదిలోని సాయినగర్ కాలనీలో విద్యుత్ సిబ్బందితో కలసి వారు పర్యాటించారు. కాలనీవాసులతో మాట్లాడి విద్యుత్ సమస్యలను పరిక్షరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానికంగా నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిక్షరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నమని ఇందులో భాగంగా వారంలో మూడు రోజులపాటు భస్తీబాట, విద్యుత్ వినియోగదారుల శిభిరం వంటి కార్యక్రమాలు చేపడుతున్నమని తెలిపారు. విద్యుత్ సమస్యలు ఎప్పటికప్పుడు పరిక్షరించేందుకు 24 గంటల పాటు తమ సిబ్బంది పని చేస్తూ అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈకార్యక్రమంలో సైనిక్ పురి డివిజన్ డీఈ అన్వర్ పాషా, చర్లపల్లి ఏ డి ఈ రాందాస్, చర్లపల్లి ఏఈ బాలరాజ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం మెడలు వంచి జర్నలిస్టుల హక్కులను కాపాడుతాం

**మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబర్ 29 (జనం సాక్షి) :** రాష్ట్రంలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన ప్రస్తుత అధికార పార్టీ రెండేళ్లు గడచిన ఎటువంటి చర్యలు తీసుకోక పోవటాన్ని నిరసిస్తూ డిసెంబర్ 3 నుంచి నిరసన కార్యక్రమాలు రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్నామని టీయూడబ్ల్యూజే (ఐజేయు) రాష్ట్ర అధ్యక్షులు విరాహత్ అలీ ప్రకటించారు. అనేక సందర్భాల్లో గత ప్రభుత్వం ఇచ్చిన అక్రిడేషన్ కార్డులను రెన్యువల్ చేస్తున్నారన్న విషయంతో పాటు హెల్త్ కార్డులు పనిచేయడం లేదన్న వాస్తవాలను రాష్ట్ర సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లిన ప్రయోజనం లేకుండా పోతుందని ఆయన పేర్కొన్నారు. జర్నలిస్టుల హక్కుల సాధనకు త్వరలో చేపట్టనున్న నిరసన కార్యక్రమాలలో జర్నలిస్టులంతా పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ అనుబంధంగా ఉన్న తెలంగాణ స్టేట్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ సుదీర్ఘ కాలం పాటు జర్నలిస్టుల ప్రయోజనాల కోసమే కృషి చేస్తుందని ఆయన వివరించారు. జర్నలిస్టుల ప్రయోజనాల అధికారపక్షంతో నిరంతరం పోరాటం చేసే సత్తా ధైర్యం గల యూనియన్ లో జర్నలిస్టులు సభ్యత్వం పొందాలని ఆయన సూచించారు. అక్రిడేషన్ కార్డులు... హెల్త్ కార్డులు... అర్హులైన జర్నలిస్టులందరికీ డబల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించే వరకు ప్రభుత్వంతో పోరాటం చేస్తామని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్ నారాయణ వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో అధికార పార్టీ నాయకులు వ్యవహరించిన తీరు వల్ల ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాలలోని జర్నలిస్టు సంఘాలు బలహీన పడ్డాయని... ఒక్కొక్క జిల్లాలో వర్కింగ్ జర్నలిస్టులను సమన్వయపరుస్తూ సంఘాన్ని బలోపేతం చేశామని రాష్ట్ర కార్యదర్శి మధు గౌడ్ వెల్లడించారు. గత కొన్నేళ్లపాటు యూనియన్ సభ్యుల తిరువళ్ల స్తబ్దత నెలకొందని అన్నారు. అన్ని మండలాలను పర్యటించి జర్నలిస్టులలో యూనియన్ చేపడుతున్న



కార్యక్రమాలు.. జర్నలిస్టుల సంక్షేమానికి పలు పథకాల కోసం ప్రభుత్వాన్ని ఒప్పించి సాధిస్తున్న విజయాలను వివరించటం వల్ల పెద్ద ఎత్తున సభ్యత్వాలు చేపట్టడం వల్ల మూడవ మహాసభలు విజయవంతమయ్యాయని ఆయన పేర్కొన్నారు.

## ముఖ్యమంత్రి దిష్టిబొమ్మ దహనం

**● సఫిల్ గూడ ఎన్టీఆర్ విగ్రహం వద్ద భారీ ఆందోళన**



**మల్కాజిగిరి, నవంబర్ 29 (జనంసాక్షి) :** రాష్ట్ర ఓబీసీ మోర్చా పార్టీ పిలుపు మేరకు, కామారెడ్డి డిక్లరేషన్‌లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించి, తాజాగా జీవో నెంబర్ 46 ద్వారా మోసం చేశారని ఆరోపిస్తూ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో శనివారం సఫిల్ గూడా చౌరస్తాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు మంగేష కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఓబీసీ మోర్చా నాయకులు మాట్లాడుతూ, బీసీల పట్ల ముఖ్యమంత్రి ద్వంద్వ వైఖరిని అవలంభిస్తున్నారని, ఇచ్చిన హామీని అమలు చేయకుండా జీవో 46 ద్వారా వెన్నుపోటు పొడిచారని మండిపడ్డారు. బీసీల హక్కుల కోసం ఓబీసీ మోర్చా పోరాటాన్ని ఉధృతం చేస్తుందని హెచ్చరించారు. రాష్ట్రంలో జరిగే గ్రామపంచాయతీ ఎన్నికలలో బిజెపి పార్టీ బలపరిచిన అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించి కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్కే శ్రీనివాస్, ప్రసన్న నాయుడు, విఠోబా, జీడి బాలచందర్ గౌడ్, ప్రియతమ రామకృష్ణ, ఓం ప్రకాష్, సంతోష్, నీలం శ్రీనివాస్, గౌలికార్ ఆనంద్, వాసంశెట్టి శ్రీనివాస్ ముదిరాజ్,గణేష్, శ్రీనివాస్ తోపాటు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



**తాండూరు, నవంబర్ 29 (జనంసాక్షి) :** యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సిగ్మా ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ బండ రవిపాల్ రెడ్డి పేర్కొన్నారు. సేవా భారతి, నిష్ట ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం తాండూరు పట్టణం తులసి గార్డెన్‌లో పదో తరగతి విద్యార్థులకు పర్సనాలిటీ డెవలప్మెంట్, కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిగ్మా ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ బండ రవిపాల్ రెడ్డి విద్యార్థులకు ఉన్నత లక్ష్యాలు, సమయపాలన, క్రమశిక్షణ ప్రాముఖ్యతపై విలువైన సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల ఉద్దేశించి మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో విజయం సాధించాలంటే రెగ్యులర్ గా పేపర్ ని చదవాలని యువకులు చెడు వ్యసనాలు డ్రగ్స్ బెట్టింగు లాంటి వాటికి బానిసలు కాకుండా దూరంగా ఉండాలన్నారు. పరీక్షల సమయంలో ఎన్ని సార్లు చదివిన ఒకసారి రాయాలని దాని వల్ల గుర్తుంటుందని రోజు మాదిరిగానే చెయ్యాలన్నారు. సింగ్రి అకాడమీ డైరెక్టర్ శ్రీనివాసరావు మోటివేషన్ చేస్తూ విజయం సాధించడానికి ధైర్యం, పట్టుదల, నిరంతర సాధన అవసరమని వివరించారు .భవిష్యత్తులో నీటు ఐఐటి లాంటి పరీక్షలకు ఇప్పటినుండే ప్రిపేర్ కావాలని దానికి మా వంతు సాయం అందిస్తామన్నారు. ఇలాంటి కార్యక్రమాలు చేపట్టిన నిష్టా ఫౌండేషన్ సేవా భారతి ప్రతినిధులని అభినందించారు. తాండూరు పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన సుమారు 600 మంది పైగా విద్యార్థులు ఈ కార్యక్రమానికి హాజరై ఆసక్తిగా వినిపించారు. విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను వెలికితీసి, భవిష్యత్ లక్ష్యాలు నిర్దేశించేందుకు ఈ కార్యక్రమం ఎంతో దోహదపడిందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాండూరు మాజీ మున్సిపల్ చైర్పర్సన్ కె. విజయ లక్ష్మి,బాలకృష్ణ, గాజుల బసవరాజ్ అనురాధ ,రమేష్, కేవిఎం వెంకట్, వెంకటేష్ వెంకట్ రెడ్డి ,మోహన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి , సుబ్బా రావు, ప్రభు శంకర్ ఉపాధ్యాయులు స్టూడెంట్స్ పాల్గొన్నారు.

## మానవతావాది వైకుంఠ రావుకు నేషనల్ ఎక్స్‌లెన్స్ అవార్డు



**న్యూఢిల్లీ, నవంబరు 29 (జనం సాక్షి) :** మానవతావాది వై వైకుంఠ రావు(వైకుఠం)కు నేషనల్ ఎక్స్ లెన్స్ అవార్డు -2025 దక్కింది. శనివారం న్యూఢిల్లీలో కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత సహాయ మంత్రి రాందాస్ అథవాలే చేతులు మీదుగా వైకుంఠం అవార్డును అందుకున్నారు. జాతీయ రాజ్యాంగ దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని దేశంలో స్వేచ్ఛ, సమానత్వం కోసం పాటుపడే వారికి అవార్డులు అందించింది. అందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ నుంచి కాకినాడ జిల్లా పెద్దాపురం గ్రామానికి చెందిన వై వైకుంఠ రావును అవార్డుకు ఎంపికచేసింది. "గాస్పల్ మినిస్ట్రీస్" అనే స్వచ్ఛంద సంస్థ ద్వారా వైకుంఠం అనేక సేవా కార్యక్రమాలు చేస్తుంటారు. అలాగే, రాకడవారి వృద్ధాశ్రమం నెలకొల్పి అనాథలైన వృద్ధులకు ఆశ్రయం కల్పిస్తున్నారు. తరచూ అన్నదానాలు నిర్వహించడం, పేదలకు దుస్తులు అందజేస్తుంటారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం పాటుపడుతుంటారు. వైకుంఠం సేవలకు గుర్తింపుగా అంబేద్కర్ గ్లోబల్ ఫౌండేషన్ నేషనల్ ఎక్స్ లెన్స్ అవార్డుకు ఎంపిక చేసింది. తెలుగు రాష్ట్రాల నుంచి ఈ అవార్డుకు వైకుంఠం ఒక్కరే ఎంపిక కావడం గమనార్హం. అవార్డు దక్కిన సందర్భంగా వైకుంఠరావు మీడియాతో మాట్లాడారు. అవార్డు తనలోని సేవాభావాన్ని మరింత మెల్కొలిపిందని తెలిపారు. సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తానని చెప్పారు.

## 50 లక్షల నిధులతో అండర్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన



**శామీర్‌పేట్, నవంబర్ 29 (జనం సాక్షి) :** తూంకుంట మున్సిపల్ పరిధిలోని శామీర్‌పేట్‌లో అండర్ డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి కోసం మున్సి పల్ నిధులతో 55 లక్షల 50 వేల రూపాయల వ్యయంతో చేపట్టనున్న పనులకు మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి తోటకూర వజ్రేష్ యాదవ్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్ ,రాష్ట్ర హజ్ కమిటీ సభ్యులు మహమ్మద్ ముజీబ్ బుద్దిన్ ,జిల్లా ఆర్టీఏ మెంబర్,తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు భీమిడి జైపాల్ రెడ్డి, మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహులు యాదవ్ ,ఇందిరమ్మ కమిటీ సభ్యులు, మాజీ ప్రజా ప్రతినిధులు,నాయకులు కలిసి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మూడు చింతలపల్లి మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు వెంకటేష్,అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు తుంకి రమేష్,కట్ట మైసమ్మ దేవాలయం చైర్మన్ మేకల మహేందర్ యాదవ్, జిల్లా కాంగ్రెస్ మాజీ ప్రధాన కార్యదర్శి బాల్ రాజు గౌడ్,మార్కెట్ కమిటీ డైరెక్టర్ తుంకి బిక్షపతి,మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షులు యాష్కి శంకర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## వనపర్తి అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ నిరంజన్ రెడ్డి



**వనపర్తి బ్యూరో, నవంబరు 29 (జనంసాక్షి) :** టిఆర్ఎస్ ప్రభుత్వంలో కనీవినీ ఎరుగని రీతిలో వనపర్తి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి కే దక్కుతుంది. ఆయన చేసిన అభివృద్ధికి ఆకర్షితులై బిఆర్ఎస్ తీర్థం పుచ్చుకుంటున్నారు. వనపర్తి నియోజకవర్గాన్ని నీళ్లతో సస్యశ్యామలం చేసి రైతుల చే నీళ్ల నిరంజన్ రెడ్డిగా పిలుచుకొని అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ గా మారారు.మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి సమక్షంలో మాజీ జిల్లా రైతు సమితి అధ్యక్షులు జగదీశ్వర్ రెడ్డి ఆధ్వర్యములో పెద్దమందడి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నుండి,స్వాతి, హరికుమార్ రెడ్డి,మాదిరెడ్డితో పాటు 200 మంది బి.ఆర్.ఎస్ పార్టీలో చేరారు.నిరంజన్ రెడ్డి స్వాతి కి సర్పంచ్ అభ్యర్థిగా మద్దతు తెలిపారు. అదేవిధంగా అంకాయపల్లి తాండా నుండి మొత్యా నాయక్, చంద్రు, బుచన్న, నాగరాజుతో పాటు 100మంది కాంగ్రెస్ పార్టీ నుండి బి.ఆర్.ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ మోత్యా నాయక్ కి సర్పంచ్ అభ్యర్థిగా మద్దతు తెలిపారు. ప్రజలు కె.సి.ఆర్ ని ఓడించి తప్పు చేశామని అభివృద్ధి అంటే కె.సి.ఆర్ అని నమ్మి పార్టీలోకి వస్తున్న అందరినీ సముచిత స్థానం కల్పించి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.బి.ఆర్.ఎస్ పార్టీ మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్టర్ సోనిపై చర్యలు తీసుకోవాలి

**ఇబ్రహీంపట్నం, నవంబర్ 29 (జనం సాక్షి) :** ప్రభుత్వ ఆదాయమును గండి కొడుతూ గత కొంత కాలంగా అవినీతి అక్రమాలకు పాలుపడుతున్న ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్టర్ డి.సోనీ పై తగు విచారణ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఓ హైకోర్టు న్యాయవాది అన్నారు. సబ్ రిజిస్టర్ కార్యలయములో డి.సోనీ సినీయర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ ఇంచార్జ్ సబ్ రిజిస్టర్‌గా చలామణి అవుతూ కోట్లాది రూపాయల అవినీతి అక్రమాలకు పాలుపడుతున్నారు. ఈ విషయములో పలు మార్లు సంబందిత పై అధికారులకు పిర్యాదులు చేసిన చర్యలు తీసుకోవడం లేదు. ఇలా గతంలో కూడ అనేకమార్లు ఆమెపై రాష్ట్ర స్టాంపు డ్యూటీ కమిషనర్ కి, అవినీతి నిరోధక శాఖ, జిల్లా కలెక్టర్, జిల్లా రిజిస్ట్రార్లకు ఫిర్యాదులు చేశారు. గతంలో 2024 సంవత్సరంలో అక్టోబర్ లో నకిలీ ఎల్ఆర్ఎస్ పత్రాలతో రిజిస్ట్రేషన్ చేసినట్లు ఫిర్యాదు చేయడం జరిగినది. ఇబ్రాహీంపట్నం మండలం మంగళ్ పల్లి సర్వే నెం.లో 367 గల భూ యాజమనికి తెలియకుండా మరో వ్యక్తి కి రిజిస్ట్రేషన్ చేయడంతో పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదుతో కేసు నమోదు చేయడం జరిగినది. ఈ విషయంలో తన పై అధికారి డిప్యూటీ ఇన్స్పెక్టర్ జనరల్ ఎస్.డి. టింకుల్ జాన్ సహకారముతో భారీ అక్రమాలకు పాలుపడుతున్నారు. ఇప్పటివరకు ఇన్చార్జి సబ్ రిజిస్టర్‌గా 8 చోట్ల విధులు నిర్వహించింది ప్రతిచోట అవినీతికి పాల్పడడంతో సదరు వ్యక్తులు పిర్యాదు చేశారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అవినీతి దందా చేయడం కోసం కొంతమంది ప్రైవేట్ వ్యక్తులను నియమించుకున్నది ప్రతి ఫైలుకు ఒక రేటు ఫిక్స్ గా ఉంటుంది అనుమతులు లేకుండా నేరుగా అక్రమ లేఔట్లలో రిజిస్ట్రేషన్ లు చేశారు. ఈ విషయంపై గత సంవత్సరం అక్టోబర్ లో రాష్ట్ర రిజిస్టర్ ఉన్నతాధికారులకు రాష్ట్ర రియల్ ఎస్టేట్ సంఘం ఫిర్యాదు చేశారు. బొంగులూరు, ఆదిభట్ల, మంగళపల్లి పటేల్ గూడ ప్రాంతాలలో బహుళ అంతస్తులు ఉన్న బిల్డింగులకు సైతం రెండంతస్తుల భవనంగా చూపిస్తూ స్టాంప్ డ్యూటీ, రెవిన్యూ మున్సిపల్ శాఖ ఆదాయాన్ని గండి కొడుతూ ప్రభుత్వానికి రావలసిన నిధులను పక్కదారి మళ్లించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జీవో 58, 59 రద్దు చేయడం జరిగింది. ఈ క్రమంలోని అక్రమ లేఔట్ లో ఎల్.ఆర్.ఎస్ ఉన్న వాటినే రిజిస్ట్రేషన్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అందుకు భిన్నంగా ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్టర్ ప్లాటుకు లక్షల రూపాయలు తీసుకొని, చట్ట వ్యతిరేకంగా రిజిస్ట్రేషన్ చేయడంతో స్థానికంగా కొంతమంది ఫిర్యాదు చేశారని, దీంతో ప్రభుత్వ ఆదాయానికి భారీ ఎత్తున గండిపడింది. ఇబ్రహీంపట్నం మండలం కొంగరకలన్ లో సర్వే నెంబర్ 31/పార్ట్, 32/పార్ట్, 33, 35, 36, 37, 38, 39/పార్ట్ భూమిలో గల 11 ఎకరాల 34 గుంటలలో దండు ప్రభు, దండు భూపాల్ గౌడ్, దండు గోపమ్మ, రైతుల పట్టా భూమి కాగా, అందులో రెండు ఎకరాల భూమిని నగరానికి చెందిన కాకి గంగాధర్ గౌడ్ కు జిపిఏ చేయగా, మొత్తం భూమి 11 ఎకరాల 34 గంటలకు, హెచ్ఎండిఏ అనుమతి తెచ్చి, కార్తికేయ ప్రాజెక్టు పేరుతో లేఔట్ చేసి 42 ప్లాట్లను నేరుగా విక్రయించాడు. అటు ప్రభుత్వ ఆదాయాన్ని గండి కొడుతూ ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్టర్ డి.సోనితో కుమ్మక్కై కొనుగోలుదారుకు



అమ్మడం, రైతులు భూమి మొత్తం రిజిస్ట్రేషన్ చేయలేదు కాబట్టి, న్యాయ స్థానాన్ని ఆశ్రయిస్తే, 42 మంది ప్లాట్ల కొనుగోలుదారులు రోడ్డున పడే అవకాశం ఉంది, కొనుగోలుదారులకు తగు న్యాయం చేయాలని, అలాగే కాకి గంగాధర్‌పై, సబ్ రిజిస్టర్ డి.సోనీ పై, డిఐజి ఎస్.డి టింకుల్ జాన్‌లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఐజి రిజిస్ట్రేషన్ స్టాంప్ డ్యూటీ, తెలంగాణ రాష్ట్ర కమిషనర్ కి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి (రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి) కి, తెలంగాణ రాష్ట అవినీతి నిరోధక శాఖ హైదరాబాద్ కి, జిల్లా కలెక్టర్ రంగారెడ్డి జిల్లాకి ఫిర్యాదు చేయడం జరిగింది. ఇప్పటివరకు ఆమెపై ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో స్థానిక ప్రజలు ఉన్నతాధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం 30 నవంబర్ 2025

# రిటర్నింగ్ అధికారులు నిబద్ధతతో పని చేయాలి

● జిల్లా పంచాయతీ అధికారి శ్రీకాంత్



**గద్వాల నడిగడ్డ, నవంబర్ 29 (జనం సాక్షి) :** గ్రామపంచాయతీ ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు స్టేజి-2 రిటర్నింగ్ అధికారులు నిబద్ధతో పని చేయాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీకాంత్ అన్నారు. శనివారం ఐడీఓసీ సమావేశం హాల్ నందు గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు రిటర్నింగ్ అధికారులకు స్టేజి-2 ఎన్నికల ట్రినింగ్ నోడల్ అధికారి రమేష్ బాబుతో కలిసి శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఎన్నికల రెండో దశలో రిటర్నింగ్ అధికారి పాత్ర అత్యంత కీలకమని తెలిపారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ను కఠినంగా అమలు చేయాలని,ప్రతి పోలింగ్ స్టేషన్‌లో అవసరమైన ఏర్పాట్లు, భద్రతా చర్యలు, వెబ్‌కాస్టింగ్, సౌకర్యాలు అన్నీ సిద్ధంగా ఉండాలనన్నారు. పోలింగ్ 7 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 1 గంటకు ముగియాలని, క్యూలో నిల్చున్న ఓటర్లకు మాత్రమే ఓటు వేయడానికి అనుమతించాలన్నారు.పిఒలు ఫార్మ్ 25,పేపర్ సీల్ అకౌంట్,ప్రెసిడింగ్ అఫీసర్ డైరీ,పిఒ డిక్లరేషన్ వంటి చట్టపరమైన పత్రాలను ఖచ్చితంగా పూర్తి చేయాలన్నారు.ఎన్నికల సమయంలో ఏ విధమైన అక్రమాలు, పోలింగ్ స్టేషన్ వద్ద ప్రచారం, లంచాలు ఇవ్వడం, బెదిరించడం వంటి చర్యలను తీవ్ర నేరంగా పరిగణించి, అలాంటి ఘటనలు జరిగిన వెంటనే పోలీసులకు,ఎంపిడిఓలకు తెలియజేయాలని అన్నారు. కౌంటింగ్ ప్రక్రియలో, పోలింగ్ ముగిసిన తర్వాత బ్యాలెట్ బాక్స్‌లను సీల్ చేసి,కౌంటింగ్ సక్రమంగా నిర్వహించాలన్నారు. కౌంటింగ్ అదే రోజు మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమవుతుందని తెలిపారు. మొదట పోస్టల్ బ్యాలెట్స్‌ను లెక్కించి, తర్వాత వార్డ్ మెంబర్ బ్యాలెట్ పేపర్లను వేరు చేసి లెక్కించాలన్నారు. అన్ని వార్డుల వార్డ్ మెంబర్ లెక్కలు పూర్తయ్యాక సర్పంచ్ బ్యాలెట్ పత్రాలను డ్రమ్‌లో కలిపి అభ్యర్థులవారీగా లెక్కించాలన్నారు. సమాన ఓట్లు వచ్చినప్పుడు డ్రా ఆఫ్ లాట్స్‌తో విజేతను నిర్ణయించాలన్నారు. అన్ని ఫలితాలను టి-పోల్ సాఫ్ట్‌వేర్‌లో కూడా అప్‌లోడ్ చేయాలన్నారు. ఉప సర్పంచ్ ఎన్నికల విషయంలో, సర్పంచ్ మరియు వార్డ్ మెంబర్ ఎన్నికల ఫలితాలు ప్రకటించిన వెంటనే ఉప-సర్పంచ్ ఎన్నికలను నిర్వహించాలని, కనీసం సగం సభ్యులు హాజరై ఉండాలని చెప్పారు.ఎన్నికల ఖర్చులు కూడా నియమాలకు అనుగుణంగా నిర్వహించాలని,అభ్యర్థులు తమ ఖర్చులను 45 రోజుల్లో ఎంపిడిఓకి సమర్పించాలన్నారు.ఖర్చుల పరిమితి గ్రామ పంచాయతీ జనాభా ఆధారంగా నిర్ణయించబడిందని వివరించారు.గ్రామీణ ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే ఈ ఎన్నికలు పూర్తిగా ప్రశాంతంగా సాగేందుకు కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్స్,రిటర్నింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## రైతులు రోడ్లపై ధాన్యాన్ని ఆరబెట్టొద్దు

● అదనపు కలెక్టర్ ఖీమ్య నాయక్



**వనపర్తి బ్యూరో, నవంబర్ 29 (జనం సాక్షి) :** రైతులు ధాన్యాన్ని రోడ్లపై కాకుండా కల్లాల్లోనే ఆరబెట్టుకోవాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ ఖీమ్య నాయక్ సూచించారు.ఆత్మకూరు మండలంలోని జూరాల, దేవరపల్లి గ్రామాల పరిధిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు రోడ్లపై ధాన్యం నిల్వ ఉంచడం పట్ల కేంద్రం నిర్వాహకులపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ధాన్యాన్ని రోడ్లపై కాకుండా కల్లాల్లోనే ఆరబెట్టుకోవాలని సూచించారు. తేమ శాతం వచ్చిన వెంటనే ధాన్యాన్ని కొనుగోలు చేసి, తక్షణమే ట్యాగ్ చేసిన రైస్ మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం దేవరపల్లి పీఏసీఎస్ పిఏసిఎస్ కేంద్రాన్ని సందర్శించి అక్కడ ఉన్న రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం రవాణాలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, అవసరమైన మేరకు వాహనాలను పంపించాలని ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లను ఆదేశించారు. తేమ శాతం వచ్చిన వెంటనే ధాన్యాన్ని కొనుగోలు చేసి, తక్షణమే ట్యాగ్ చేసిన రైస్ మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు.చివరగా ఆత్మకూరు మండలంలోని శ్రీ బాలాజీ ఇండస్ట్రీస్ (రైస్ మిల్లు) ను సందర్శించి, పీపీసీ కేంద్రాల నుండి వస్తున్న ధాన్యం దిగుమతి, రవాణా తీరును పరిశీలించారు. ధాన్యం సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.

## గ్రామపంచాయతీ ఎన్నికల పారదర్శకంగా నిర్వహించాలి



**సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 29 (జనం సాక్షి) :** జిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికల పారదర్శకంగా నిర్వహించేందుకు ఆయా నోడల్ అధికారులు తమ తమ విధులను సమర్ధవంతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల పరిశీలకులు కార్తీక్ రెడ్డి, రాకేష్‌లు అన్నారు. జిల్లా కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో శనివారం గ్రామపంచాయతీల ఎన్నికల నిర్వహణపై జిల్లా నోడల్ అధికారులతో సాధారణ పరిశీలకులు కార్తీక్ రెడ్డి, వ్యయ పరిశీలకులు రాకేష్ సమీక్షా సమావేశం నిర్వహించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం చేపట్టిన వివిధ ఏర్పాట్లను పరిశీలకులకు వివరించారు. మొదటి విడత నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ నేటితో ముగిసిందని, రేపటి నుండి రెండవ విడత నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కానుందని తెలిపారు. ఈ సందర్భంగా, నోడల్ అధికారులకు కేటాయించిన విధుల అమలు, ఏర్పాట్ల పురోగతి గురించి పరిశీలకులు ఆయా నోడల్ అధికారులతో వివరంగా అడిగి తెలుసుకున్నారు. ఆయా నోడల్ అధికారులు తమ తమ బాధ్యతల పరిధిలో చేపట్టిన చర్యలను పరిశీలకులకు వివరించారు. ఈ సందర్భంగా పరిశీలకులు పలు సూచనలు చేసారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈఓ జానకి రెడ్డి, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

# దివ్యాంగులను ప్రోత్సహిస్తే అన్ని రంగాల్లో రాణిస్తారు

● అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ

**గద్వాల నడిగడ్డ, నవంబర్ 29 (జనం సాక్షి) :** దివ్యాంగులు మనోధైర్యంతో, ఆత్మవిశ్వాసంతో ఉంటారని,వారిని ప్రోత్సహిస్తే అన్ని రంగాల్లో రాణిస్తారని అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా శనివారం మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గద్వాల ఇండోర్ స్టేడియంలో జిల్లా స్థాయి దివ్యాంగుల ఆటల పోటీల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అదనపు కలెక్టర్ హాజరై మాట్లాడారు.దివ్యమైన అవకాశం ఉన్నవారే దివ్యాంగులని, భగవంతుడు తమకు ఏదో లోటు ఇచ్చాడని భావించకూడదన్నారు. అంతర్జాతీయ స్థాయిలో వివిధ రంగాల్లో ప్రతిభ చాటిన దివ్యాంగుల జీవిత చరిత్రల పుస్తకాలు చదివితే,స్ఫూర్తినిచ్చే వీడియోలు చూడడం ద్వారా ప్రతి ఒక్కరిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు.ప్రతి ఒక్కరూ క్రీడలను తమ జీవితంలో ఒక భాగం చేసుకోవాలని దివ్యాంగులను సైతం ప్రోత్సహిస్తూ ఈ క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. క్రీడలతో శారీరకంగా దృఢంగా ఉండడమే కాక, మానసికంగా చురుగ్గా ఆలోచించేందుకు అవకాశం ఉందన్నారు. ఉత్సాహంగా ఉన్నవారికి మంచి ఆలోచనలు వస్తాయని,ఫలితంగా వారి విధుల్లో ప్రతిభ చాటడమే కాక సమాజ అభివృద్ధికి కృషి చేస్తారన్నారు.జిల్లాలో మూడు నైబర్హుడ్ కేంద్రాలు ఏర్పాటు చేశారని ఇక్కడ శారీరకంగా,మానసికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న వ్యక్తులకు అవసరమైన చికిత్స అందించటమే కాక ఇతర సౌకర్యాలు కల్పించడం జరిగిందన్నారు.దివ్యాంగులు ఏ విషయంలోనూ తక్కువ కాదని ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత చదువులు అభ్యసించాలని,అన్ని రంగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్న క్రీడల్లో ప్రతిభ చాటినవారు రాష్ట్రస్థాయిలోనూ గెలుపొంది జోగులాంబ గద్వాల ఖ్యాతిని ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు. అనంతరం క్యారమ్స్, చెస్, జావిలిన్ త్రో, షాట్ పుట్, రన్నింగ్ పోటీలను అధికారులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పి మొగిలయ్య, జిల్లా సంక్షేమ అధికారిని సునంద, విద్యా శాఖ అధికారిని విజయలక్ష్మి, డివైఎస్ఓ కృష్ణయ్య, డిఎంహెచ్వో సంధ్య కిరణ్మయి, డిఆర్డిఏ ఏపీడి శ్రీనివాసులు, డిసిపిఓ నరసింహ తదితరులు పాల్గొన్నారు.



# ఎరువుల చట్టాలపై డీలర్లు అవగాహన కలిగి ఉండాలి

● జిల్లా వ్యవసాయ అధికారి దేవ్ కుమార్



**మెదక్, నవంబర్ 29 (జనం సాక్షి) :** ఎరువుల చట్టాలపై డీలర్లు అవగాహన కలిగి ఉండాలని జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్ సూచించారు. హవేలీఘన్పూర్ మండలం రైతు వేదికలో జిల్లాలో గల పురుగుమందులు, ఎరువుల విత్తన డీలర్లకు 48 వారాలపాటు వ్యవసాయ విస్తరణ సేవల విభాగంపై సర్టిఫికెట్ ప్రోగ్రాం కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమం ఆత్మ సౌజన్యంతో నిర్వహించబడుతుంది. ఈ కార్యక్రమంలో డీలర్లకు విత్తన మరియు పురుగుమందులు ఎరువుల చట్టాలపై అవగాహన మరియు వ్యవసాయానికి సంబంధించి విత్తన దశ నుంచి మొదలుకొని పంట కోత వరకు జరిగే వివిధ అంశాలలో సమగ్ర పోషక యాజమాన్యం సమగ్ర సస్యరక్షణ చర్యలు సమగ్ర వ్యవసాయ విధానాలపై డీలర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్ మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో నమోదుచేసుకున్న అటువంటి డీలర్లు అందరూ 48 వారాలపాటు తప్పనిసరిగా విధిగా హాజరు అవుతూ విత్తనాల పురుగుమందులు, ఎరువుల చట్టాలపై అవగాహన పెంచుకుంటూ వ్యవసాయ, అనుబంధ రంగాలలో వస్తున్నటువంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని మరియు రైతుల యొక్క ఆదాయ పెంపుకు తీసుకోవాల్సిన చర్యల గూర్చి, పంట కోత అనంతరం ఉత్పత్తుల నుండి ఉప ఉత్పత్తులను విలువ ఆధారిత ఉత్పత్తులను తయారుచేసి అధిక ఆదాయం పొందే విధంగా తీసుకోవాల్సిన చర్యలు గూర్చి తాము నేర్చుకొని రైతాంగానికి సేవ చేయాలని డీలర్లకు సూచించారు. ఈ కార్యక్రమానికి నలభై ఎనిమిది వారాల పాటు సమన్వయకర్తగా నరేందర్ పెండ్యాల వ్యవహరిస్తారు అన్నారు. 2023 -24 సంవత్సరానికి ఈ కోర్సును విజయవంతంగా పూర్తి చేసిన డీలర్లకు సర్టిఫికెట్లను జిల్లా వ్యవసాయ అధికారి చేతుల మీదుగా ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు టెక్నికల్ విన్సెంట్ వినయ్స, హాయ వ్యవసాయ సంచాలకులు మెదక్ డివిజన్ విజయనిర్మల, ఇన్చార్జి సహాయ వ్యవసాయ సంచాలకులు రాజ నారాయణ, మండల వ్యవసాయ అధికారులు టెక్నికల్ యాదగిరి, నాగ మాధురి మండల వ్యవసాయ అధికారి బాల్ రెడ్డి, డీలర్లు పాల్గొన్నారు.

# విద్యార్థులు గురువులను గౌరవించాలి



**వీపనగండ్ల, నవంబర్ 30 (జనం సాక్షి) :** హైదరాబాద్ ఆల్వాల్‌లో జనసిస్ నోవానోవా ఇంటర్నేషనల్ పాఠశాలలో పాఠశాల వార్షికోత్సవ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విశ్రాంత జి. కృష్ణారావు, జెనిసిస్ పాఠశాల వ్యవస్థాపకులు చైర్మన్ జయపాల్ రెడ్డి, పాఠశాల డైరెక్టర్ అఖిల రెడ్డి, మోటివేటర్, ఉపన్యాసకులు వేణుగోపాల్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా విశ్రాంత జీకే రావు మాట్లాడుతూ విద్యార్థులు ఉపాధ్యాయులను విద్యార్థులు అన్నివేళలా గౌరవించాలని, విద్యార్థులు క్రమశిక్షణ తమ ఉపాధ్యాయులను చూసి నేర్చుకోవాలని అన్నారు. డైరెక్టర్ అఖిల రెడ్డి మాట్లాడుతూ జనసిస్ ఇంటర్నేషనల్ పాఠశాలలో ఆవిరా అని ఈ కార్యక్రమానికి పేరు పెట్టడానికి కారణాలు వివరించారు. అవిరా అంటే వింగ్స్ అని అర్థమని విద్యార్థులు పక్షుల మాదిరిగా జీవితంలో చదువు క్రమశిక్షణ అనే రెక్కలతో జీవితంలో ఉన్నత స్థానానికి ఎదగాలని కోరారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయుల పాఠశాల యాజమాన్యం సలహాలు సూచనలు పాటిస్తూ విద్యార్థులకు ప్రోత్సాహం అందించాలని అప్పుడే విద్యార్థులు జీవితంలో విజయం సాధిస్తారని అన్నారు. వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులను ఉత్సాహపరుస్తూ నమ్మకంతో విద్యను నేర్చుకోవాలని, నమ్మకం మీ మనసులో ఉంటే విజయం మీ చెంతకు చేరుతుందని అన్నారు. జనసిస్ పాఠశాల వ్యవస్థాపకులు జయపాల్ రెడ్డి మాట్లాడుతూ ఇప్పటివరకు జనసిస్ పాఠశాలలో విద్యార్థులకు చదువుతూపాటు సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహిస్తూ విద్యార్థులను ఉత్సాహ పరుస్తున్నామని అన్నారు. విద్యార్థులకు నాణ్యత మైన విద్యను అందిస్తున్నామని, వార్షిక ప్రణాళిక ప్రకారం పాఠ్యాంశాలను బోధిస్తూ పోటీ పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నామని అన్నారు. చదువుతోపాటు క్రీడలను ప్రోత్సహిస్తూ రాష్ట్రస్థాయిలో, జాతీయస్థాయిలో మా విద్యార్థులు పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శోభా రెడ్డి, వివిధ జనసిస్ పాఠశాల శాఖల ప్రధానోపాధ్యాయులు, డైరెక్టర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అతిథులను, తల్లిదండ్రులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రథమంగా స్వాగత నాట్యం భరతనాట్యం, ఉట్టిపడే ఉట్టిపడేటట్టుగా చేసిన విద్యార్థుల తల్లిదండ్రులను ఆకర్షించాయి.

## గ్రామపంచాయతీ నామినేషన్ల వద్ద బందోబస్తు



**మద్దూరు, నవంబర్ 29 (జనం సాక్షి) :** కోస్గి సర్కిల్ పరిధిలో జరుగనున్న గ్రామపంచాయతీ ఎన్నికల ఏర్పాట్లను దృష్టిలో ఉంచుకుని, కోస్గి సీఐ సైదులు, మద్దూర్ ఎస్సై విజయ్‌కుమార్‌లు శనివారం మద్దూర్ మండలంలోని దోరేపల్లి, పల్లెగడ్డ తండా, నిడ్జింత, కొత్త పల్లి మండల నామినేషన్ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా అధికారులు కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన భద్రతా చర్యలు, నామినేషన్ దాఖలు కోసం వచ్చే అభ్యర్థులు మరియు ప్రజలకు అందుబాటులో ఉంచాల్సిన అవసరమైన ప్రాథమిక సౌకర్యాలను పూర్తిగా పరిశీలించారు. తదుపరి మద్దూరు మండలంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించి, పోలింగ్ రోజు ఎటువంటి అంతరాయాలు లేకుండా, శాంతి భద్రతల మధ్య ఎన్నికలు జరిగేలా అవసరమైన అన్ని ఏర్పాట్లను చేయాలని సంబంధిత అధికారులకు సూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, పోలీసులు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## పోలీసుల సేవలను గుర్తించడం ప్రశంసనీయం



**మెదక్ జిల్లా బ్యూరో, నవంబర్ 29 (జనం సాక్షి) :** పోలీసుల సేవలను గుర్తించడం ప్రశంసనీయమని జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు అన్నారు. మెదక్ టౌన్ లో పెళ్లి రోజు జరిగిన 10 తులాల బంగారం దొంగతనం కేసును మెదక్ టౌన్ పోలీసులు వేగంగా ఛేదించారు. పెళ్లి కూతురిని పెళ్లికి రెడీ చేస్తున్న సమయంలో గదిలో ఉన్న 10 తులాల బంగారు ఆభరణాలు దొంగతనానికి గురవ్వడంతో బాధిత కుటుంబం మెదక్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదు చేశారు. ఈ మేరకు మెదక్ టౌన్ ఇన్‌స్పెక్టర్ మహేష్ కేసు నమోదు చేసి, విషయాన్ని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు నివేదించారు. వెంటనే స్పందించిన ఎస్పీ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తును వేగవంతం చేశారు. దర్యాప్తు ప్రక్రియలో స్వాధీనం చేసిన మొత్తం 10 తులాల బంగారు ఆభరణాలను పోలీసులు బాధిత కుటుంబానికి కోర్ట్ ద్వారా తిరిగి అందజేశారు. విలువైన ఆభరణాలను వేగంగా రికవరీ చేసి అందించినందుకు బాధిత కుటుంబ సభ్యులు జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

## అట్టహాసంగా దివ్యాంగుల ఆటల పోటీలు



**నారాయణపేట, నవంబర్ 29 (జనం సాక్షి) :** అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశాల మేరకు శనివారం జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో జిల్లా మహిళా,శిశు, దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్ జెండర్ల సాధికారత సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన దివ్యాంగుల క్రీడా పోటీలు అట్టహాసంగా జరిగాయి.ఈ క్రీడా పోటీలకు ముఖ్య అతిథిగా హాజరైన ఎస్. జీ.ఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూదివ్యాంగులకు ఉల్లాసం, ఆత్మస్థైర్యం కల్పించడం కోసమే ఈ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని, దివ్యాంగులు అధిక సంఖ్యలో పాల్గొని జిల్లా స్థాయిలో నైపుణ్యం చూపాలని ఆకాక్షించారు.జిల్లాలో ప్రతిభ చూపిన వారిని హైదరాబాద్ లో జరిగే రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు జిల్లా తరపున పంపించడం జరుగుతుందని ఆయన తెలిపారు. దివ్యాంగులు ఉత్సాహంగా ఈ క్రీడల్లో పాల్గొని తమలోని క్రీడా నైపుణ్యాన్ని చాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాల్గొన్న సీడీపీవో జయ మాట్లాడుతూ..జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ సహకారంతో ఈ క్రీడలను నిర్వహించడం జరుగుతుందన్నారు. వికలాంగులు ఐకమత్యంతో ఆనందంగా పోటీలలో పాల్గొనాలని కోరారు. గెలిచినా..ఓడినా అందరూ సమానమే అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఫ్. ఆర్.ఓ సాయి, డీ డబ్ల్యు ఓ సిబ్బంది, వికలాంగుల సంఘం జిల్లా అధ్యక్షులు నగేష్ గౌడ్, అజీజ్ ఖాన్, కాశప్ప, రాధా, జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన దివ్యాంగులు తదితరులు పాల్గొన్నారు.

# నామినేషన్ల స్క్రూటినీ ఏర్పాట్లు సిద్ధం చేసుకోండి

● జిల్లా కలెక్టర్, ఎన్నికల అథారిటీ ఆదర్శ్ సురభి




**వనపర్తి బ్యూరో, నవంబర్ 29 (జనంసాక్షి) :** గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లు నిర్లక్ష్యానికి తావు లేకుండా పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లాలోని తహసిల్దారులు ఎంపీడీవోలతో గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దిశా నిర్దేశం చేశారు. మొదటి విడతలో ఎన్నికలు జరగనున్న ఐదు మండలాలకు సంబంధించి నామినేషన్ల పరిశీలనకు ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలని సూచించారు.డిసెంబర్ ఒకటో తేదీన అన్ని మండలాల్లో ప్రిసైడింగ్ అధికారులకు ఓటింగ్ నిర్వహణపై శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయాలని అందుకు అవసరమైన స్థలం, కంప్యూటర్లు, మౌలిక వసతులు సిద్ధం చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా డిసెంబర్ 4వ తేదీన ఒ.పి ఒ లకు శిక్షణ కార్యక్రమం ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఎన్నికల నిర్వహణలో పాల్గొని సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్‌కు అవసరమైన ఫారం 14, ఫారం 17 శిక్షణ రోజు ఇచ్చే విధంగా చూడాలని సూచించారు. మొదటి విడతలో జరిగే ఎన్నికలకు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ డిసెంబర్ 8వ తేదీన, రెండవ విడత వారికి డిసెంబర్ 12, మూడవ విడతకు డిసెంబర్ 14వ తేదీన సంబంధిత మండల అభివృద్ధి అధికారి కార్యాలయాల్లో నిర్వహించడం జరుగుతుందని, అందుకు అవసరమైన ఏర్పాట్లు సిద్ధం చేసుకోవాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ పోల్ అయ్యాక వాటిని స్ట్రాంగ్ రూమ్ లో భద్రం చేసి పోలీస్ కాపలా ఉండే విధంగా ఎతేసుకోవాలని సూచించారు.పోలింగ్ ముందురోజు బ్యాలెట్ బాక్సులు, మెటీరియల్ పోలింగ్ స్టేషన్లకు పంపించే విధంగా మండల కేంద్రాల్లో డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలు మండల స్థాయిలో ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు.నామినేషన్ ఉపసంహరణ చేసుకునే అభ్యర్థుల నుంచి అనెక్సర్ - 1 లో సంతకం తీసుకోవాలని, ఒకవేళ ఒక్కరే అభ్యర్థి పోటీలో మిగిలితే అభ్యర్థి నుండి అనేక్సర్ - 2 తీసుకోవాలని సూచించారు.ఓటరుకు సకాలంలో ఓటర్ స్లిప్ అందించే విధంగా చర్యలు తీసుకోవాలని, డబుల్ ఓటర్లు, చనిపోయిన ఓటర్ల జాబితా సిద్ధం చేసి ప్రిసైడింగ్ అధికారికి ముందుగానే అందించాలని సూచించారు.వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ యాదయ్య, ఆర్డిఓ సుబ్రహ్మణ్యం, డిపిఓ తరుణ్ చక్రవర్తి, డివిజనల్ పంచాయతీ అధికారి రఘుపతి రెడ్డి, పిడి డిఆర్డిఓ ఉమాదేవి, డిప్యూటీ సీఈవో రామ మహేశ్వర్ రెడ్డి,ఎలక్షన్ సూపరింటెండెంట్ మదన్ మోహన్, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీఓ లు తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుండి రెండో విడత నామినేషన్లు షురూ

- ఆయా గ్రామాల అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ శర్మ




**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా నేటి(ఆదివారం) నుండి రెండో విడత నామినేషన్లు ప్రారంభం కానున్నాయని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ శర్మ కోరారు. రెండో విడత నామినేషన్లు ఈ నెల 30 నుండి డిసెంబర్ 2 వరకు ఉదయం 10.30 నుండి సాయంత్రం 5 గంటల వరకు స్వీకరించడం జరుగుతుందని, ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేయాలని రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. 2వ విడతలో చిట్యాల మండలంలో 26 గ్రామ పంచాయతిలకు, 218 వార్డులకు, టేకుమట్ల మండలంలో 25 పంచాయతిలకు, 198 వార్డులకు, భూపాలపల్లి మండలంలో 26 గ్రామ పంచాయతీలకు, 216 వార్డులకు, అదేవిధంగా పలిమెల మండలంలో 8 గ్రామ పంచాయతిలకు 62 వార్డులకు మొత్తం నాలుగు మండలాలలోని 85 గ్రామ పంచాయతీలకు, 694 వార్డులలో ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంగం మార్గదర్శకాల మేరకు నోటిఫికేషన్, నామినేషన్లు స్వీకరణ ప్రక్రియ ప్రారంభం అవుతుందని తెలిపారు. నోటిఫికేషన్ గ్రామ పంచాయతీ కార్యాలయం, గ్రామంలోని ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేయాలని, అలాగే ఓటరు జాబితా నోటీస్ బోర్డులో పెట్టాలని సూచించారు. జిల్లాలో రాజకీయ పార్టీలకు సంబంధించిన పోస్టర్లు, ఫ్లెక్సీలు తొలగించి 24, 48, 72 గంటల నివేదికకు ఎంపీడీవోల ధ్రువీకరణతో నివేదిక అందచేయాలని తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనపై ప్రజలు పిర్యాదు చేసేందుకు వీలుగా కలెక్టరేట్ నందు 24 గంటలు పనిచేసేలా 9030632608 సహాయక కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నామినేషన్ కేంద్రాల వద్ద నామినేషన్ ఫారాలు సమృద్ధిగా అందుబాటులో ఉంచాలని ఆయన అధికారులను ఆదేశించారు.

**ఎన్నికల నిర్వహణలో రిటర్నింగ్ అధికారుల పాత్ర కీలకం**

గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో రిటర్నింగ్ అధికారుల పాత్ర అత్యంత కీలకమని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. శనివారం ఐడిఓసి కార్యాలయంలో స్టేజ్-2 రిటర్నింగ్ అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని ముఖ్య సూచనలు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో లాజిస్టిక్స్, మాన్‌పవర్ వినియోగం, నామినేషన్ స్వీకరణ నుండి ఓట్ల లెక్కింపు వరకు ప్రతి దశలో రిటర్నింగ్ అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. నామినేషన్లు స్వీకరించే దశ నుండి గెలుపొందిన అభ్యర్థుల జాబితా ప్రకటన వరకు నిర్వర్తించే ప్రతి పని అత్యంత బాధ్యతాయుతమైందని పేర్కొన్నారు. తదుపరి మాస్టర్ ట్రైనర్లు కుసునపు కిరణ్‌కుమార్, రాజేంద్రప్రసాద్ స్టేజ్-2 అధికారుల విధులు, బాధ్యతలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగహన కల్పించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, ఆర్డిఓ రవి, ట్రైనింగ్ డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, ఎంపీడీవోలు, స్టేజ్-2 అధికారులు, మండల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

**విత్తన చట్టం 2025 ముసాయిదాపై చర్చ**

ప్రస్తుత వ్యవసాయ పరిస్థితులకు అనుగుణంగా రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడానికి, నకిలీ విత్తనాలపై నిషేధం విధించడానికి, విత్తనాల దిగుమతిని సరళీకరించడానికి, రైతు హక్కులను రక్షించడానికి నూతన విత్తన చట్టం ముసాయిదా ప్రతిపాదించడం జరిగిందని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. శనివారం ఐడిఓసి కార్యాలయ సమావేశపు హాలులో నూతన విత్తన చట్టం 2025 ముసాయిదాపై వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పోలీస్, ఉద్యాన, విత్తన కంపెనీలు, ఇన్ఫుట్ డీలర్లు, రైతుల ఉత్పత్తి సంఘాలు అనుబంధ సంస్థలు, రైతులతో అభిప్రాయ సేకరణ, చర్చా సదస్సుకు ముఖ్య అతిథిగా కలెక్టర్ హాజరయ్యారు. భారత ప్రభుత్వం ప్రతిపాదించిన నూతన విత్తన చట్టం 2025 ముసాయిదాపై చేయవలసిన మార్పులు, చేర్పులపై రైతులు, విత్తన డీలర్లు, ఇన్ఫుట్ డీలర్లు, రైతు సంఘాలు తమ అమూల్యమైన సూచనలు, సలహాలు అందించాలని ఆయన సూచించారు. వాణిజ్య ప్రక్రియల సరళీకరణ, నిబంధనల ఉల్లంఘన జరిగినపుడు కఠినమైన శిక్షలు ఉంటాయని తెలిపారు. నాణ్యత నియంత్రణ చర్యలు వంటి అంశాలను ఈ చట్టంలో స్పష్టంగా ఆయన పొందుపరిచినట్లు వివరించారు. ఈ ప్రతిపాదిత చట్టంలో మొత్తం 10 అధ్యాయాలు, 48 విభాగాలు ఉన్నాయని కలెక్టర్ వివరించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్పీ నరేష్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు, ఉద్యాన వన అధికారి సునీల్ కుమార్, మహదేవపూర్ వ్యవసాయ శాఖ ఏడీఏ శ్రీపాల్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి పాల్గొన్నారు.



## ఎన్నికల నిబంధనలను పాటించాలి

- ఖర్చులను ఖచ్చితంగా నమోదు చేయాలి
- ఎన్నికల వ్యయ పర్యవేక్షకులు రవి

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** ఎన్నికల నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, ఖర్చులను ఖచ్చితంగా నమోదు చేయాలని జిల్లా ఎన్నికల వ్యయ పర్యవేక్షకులు రవి అన్నారు. శనివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కొత్తపల్లిగోరి మండలంలో ఆయన పర్యటించారు. ఎన్నికల వ్యయ నియంత్రణ చర్యలను పరిశీలిస్తూ, అభ్యర్థులు, రాజకీయ ప్రతినిధులు ఎన్నికల ప్రచారంలో ఖర్చులను ఎన్నికల నియమావళి ప్రకారం నమోదు చేయాలని సూచించారు. మండలంలో పర్యవేక్షణకు ఏర్పాటు చేసిన ఎన్నికల ఖర్చు పర్యవేక్షణ బృందాల పనితీరును ఆయన పరిశీలించి, వారి విధులను మరింత బలోపేతం చేయాలని సూచించారు. ప్రచార సామగ్రి, వాహన వినియోగం, సమావేశాలు, మైక్ లాంటి అంశాల్లో ఖర్చుల పర్యవేక్షణను కచ్చితంగా చేయాలని ఆయన ఆదేశించారు. ఎన్నికలు నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, వ్యయ పర్యవేక్షణ బృంద సభ్యులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## విద్యుద్ఘాతంతో మహిళ, గేదె మృతి

**వరంగల్ ఈస్ట్, నవంబర్ 29 (జనం సాక్షి) :** విద్యుత్ షాక్ కు గురై మహిళ తో పాటు గేదె దుర్మరణం చెందిన సంఘటన చోటుచేసుకుంది. వరంగల్ జిల్లా కిల వరంగల్ మండలం వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు నియోజకవర్గం లోని 43వ డివిజన్ జక్క లొద్ది గ్రామానికి చెందిన పెండ్యాల సుక్కమ్మ (50), తన సొంత బర్రెలు కాసుకుంటూ ఇంటింటికి పాలు పోసుకుంటూ జీవనం గడుపుతున్నది. సాయంత్రం వేళ బర్రె ఇంటికి రాని కారణంగా ఈమె దుగ్యాల శ్రీనివాస రావు 65 ఎకరాల ప్లాట్ల కోసం చేసిన వెంచర్లో కరెంటు స్తంభములకున్న వైర్లను నిర్లక్ష్యంగా వేయడం వలన కరెంటు షాక్ తో మరణించడం జరిగినది. వారి నిర్లక్ష్యం కారణంగా శవాన్ని ఈ వెంచర్ లోని పెట్టి డి ఎస్ ఆర్ యాజమాన్యం, కరెంటు డిపార్ట్మెంట్ అధికారులు వచ్చేవరకు, ఆ కుటుంబానికి న్యాయం జరిగే వరకూ, ధర్నా నిర్వహించారు.

# తరగతి గదే ప్రయోగశాల కావాలి

- ఆర్జెడి సత్యనారాయణ రెడ్డి
- ఘనంగా ముగిసిన వరంగల్ జిల్లా స్థాయి ఇన్స్పైర్
- ఇన్ స్పైర్ ప్రాజెక్టుల నుండి16 మంది , ఆర్బీవిపీ ఎగ్జిబిట్ నుంచి 14 మంది రాష్ట స్థాయికి ఎంపిక



**వరంగల్ ఈస్ట్, నవంబర్ 29 (జనం సాక్షి) :** వరంగల్ జిల్లా స్థాయి ఇన్స్పైర్ మరియు బాల వైజ్ఞానిక ప్రదర్శన ఉర్సుగుట్టలోని తాళ్ళ పద్మావతి ఇంటర్నేషనల్ స్కూల్లో ఘనంగా ముగిసింది. మూడు రోజులపాటు నిర్వహించిన ఈ ప్రదర్శనలో జిల్లా నలుమూలల నుండి వచ్చిన విద్యార్థులు తమ సృజనాత్మక శాస్త్రీయ మోడళ్ళను ప్రదర్శించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విద్యాశాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు సత్యనారాయణ రెడ్డి హాజరై విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. తరగతిగదే ప్రయోగశాల కావాలని అన్నారు. ఆధునిక ప్రపంచంలో శాస్త్రవిజ్ఞానం పాత్ర అమోఘమని పేర్కొంటూ, ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో పరిశోధనాశక్తి, సమస్యల పరిష్కార నైపుణ్యం, సైన్స్‌పై ఆసక్తి పెరుగుతుందని అన్నారు. శాస్త్రీయ ఆలోచనలు ఉన్న విద్యార్థులు రానున్న తరాల అభివృద్ధికి మార్గదర్శకులవుతారని భావించారు.కార్యక్రమం కన్వీనర్ డిఇఓ రంగయ్య నాయుడు ప్రసంగిస్తూ, శాస్త్రీయ రంగంలో ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులను చూసి గర్వంగా ఉందన్నారు. గురువుల కృషి, తల్లిదండ్రుల ప్రోత్సాహం, విద్యార్థుల ప్రతిభ కలిసినప్పుడే ఇలాంటి విజయాలు సాధ్యమవుతాయని పేర్కొన్నారు.కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ కట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ, వార్షికంగా నిర్వహించే ఇన్స్పైర్ మరియు బాల వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థుల శాస్త్రీయ ప్రతిభను వెలికితీస్తాయని చెప్పారు. ఈసారి ప్రదర్శనలో పాల్గొన్న మోడళ్ల నాణ్యత అత్యుత్తమంగా ఉందని అభినందించారు. రాష్ట్రస్థాయి ప్రదర్శనలో వరంగల్ జిల్లా అత్యధిక స్థాయిలో ప్రతిభ కనబరుస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.ప్రదర్శనలో ఉత్తమ ఎగ్జిబిట్లు మరియు ప్రాజెక్టు లకు బహుమతులు అందజేశారు. రాష్ట స్థాయి పోటీలకు అర్హత పొందిన విద్యార్థుల పేర్లను ప్రకటించి వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంలు, అధ్యాపకులు, వివిధ కమిటీ సభ్యులు, విద్యార్థులు వందలాదిగా పాల్గొన్నారు.ఇన్స్పైర్ మనక్ ప్రదర్శనలో జిల్లా స్థాయికి 164 ఎంపిక కాబడ్డాయి. వీటి నుండి పది శాతం అనగా 16 ప్రాజెక్టులు రాష్ట్రస్థాయికి ఈరోజు ఎంపిక చేశారు. ఆర్బివిపి సైన్స్ ఎగ్జిబిషన్లో ఏడు థీంల నుండి జూనియర్ మరియు సీనియర్ విభాగంలో ప్రథమ స్థానం పొందిన ఎగ్జిబిట్లను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ప్లాస్టిక్ ను నివారించడం ఎలా అనే అంశంపై జరిగిన సెమినార్లో తాళ్ళ పద్మావతి ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థి మునజా హాఫియా ప్రథమ స్థానం పొంది రాష్ట స్థాయికి ఎంపికైంది. శనివారం ప్రదర్శనను 9000 మంది విద్యార్థులు తిలకించారు. మూడు రోజులపాటు 19,000 మంది విద్యార్థులు, సందర్శకులు సందర్శించారు. యూనివర్సిటీ, వివిధ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల లెక్చరర్ లు జడ్జిలుగా వ్యవహరించారు. విద్యార్థులు ప్రదర్శించిన విభిన్న ఎగ్జిబిట్లు ఆసక్తికరంగా ఉన్నాయి. కార్యక్రమంలో అతిథులుగా జిల్లా సెక్టోరియల్ అధికారులు ఉంద్రాతి సుజన్ తేజ, డిసిఇబి సెక్రెటరీ గారె కృష్ణమూర్తి, ఖిలా వరంగల్ ఎంఈఓ బి ప్రసాద్, తాళ్ల పద్మావతి విద్యాసంస్థల అధినేత తాళ్ల మల్లేశం, డైరెక్టర్లు వంశీ ,వరుణ్, రాహుల్, తాళ్ల పద్మావతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ జె వెంకటేశ్వరరావు, ట్రస్మా రాష్ట సలహాదారు కె. భూపాల్ రావు, నాయకులు డి.రాంమూర్తి, వడుప్సా బాధ్యులు బిల్ల రవి,ఆడెపు శ్యామ్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు,18 కమిటీల కన్వీనర్లు, కో కన్వీనర్లు సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమ వ్యాఖ్యాతగా టి. శ్రీధరాచార్యులు వ్యవహరించారు. జిల్లాస్థాయి ఇన్స్పైర్ ముగింపు కార్యక్రమంలో శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థి కె. అనన్య చేసిన శాస్త్రీయ నృత్యం మరియు కొంకపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు చేసిన రఘుకుల తిలకా రామా... కోలాటం,జల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల నృత్యం,తాళ్ళ పద్మావతి ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థుల నృత్యం, సమ్మక్క సారలమ్మ ద్విపాత్రాభినయం చాలా ఆకట్టుకుంది.

# భీమన్న గుట్ట సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**నిర్మల్ బ్యూరో, నవంబర్29 (జనంసాక్షి) :** పట్టణంలోని భీమన్న గుట్ట భూముల సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ హామీ ఇచ్చారు. శనివారం కలెక్టరేట్లోని తన చాంబర్ లో నిర్మల్ ముదిరాజ్ సంఘ బృందం సభ్యులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ విషయమై ఇప్పటికే ప్రభుత్వానికి నివేదికలు పంపినట్లు చెప్పారు. ప్రభుత్వ ఆదేశాలను రాగానే, ఆ ఆదేశాలను అనుసరించి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ప్రజలు ఎవరు ఈ విషయంపై ఎటువంటి ఆందోళన చెందనవసరం లేదని అన్నారు. చేపట్టిన ఆందోళనలు విరమించాలని కోరారు. ఈ సమావేశంలో ముదిరాజ్ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాటకారి సాయన్న, జిల్లా అధ్యక్షులు గణేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు సాయి, యువజన సంఘ అధ్యక్షులు రాజేష్, ప్రధాన కార్యదర్శి చరణ్, ఉపాధ్యక్షులు అర్జున్ రాజ్, తదితరులు పాల్గొన్నారు.

**కలెక్టర్ ఆదేశానుసారం ఆందోళనకారులతో దీక్ష విరమింపజేసిన ఆర్డిఓ.**


జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశాల మేరకు, భీమన్న గుట్ట సమస్య పరిష్కారం కొరకు గత ఐదు రోజులుగా ఆందోళన చేస్తున్న వారితో ఆర్డీవో రత్నకళ్యాణి, నిమ్మ రసాన్ని అందజేసి దీక్షను విరమింప చేశారు. తమ ఆందోళనలను అర్థం చేసుకొని, సమస్య పరిష్కారం కొరకు చొరవ తీసుకున్నందుకు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ కు, దీక్ష విరమింప చేసిన ఆర్డీవో కు దీక్ష చేపట్టినవారు కృతజ్ఞతలు తెలియజేశారు. దీక్ష విరమింపచేసిన వారిలో ఆర్డిఓ వెంట తహసిల్దార్ రాజు ఉన్నారు.

## గ్రామ పంచాయతీ ఎన్నికలు ప్రజాస్వామ్యబద్ధంగా జరగాలి

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



**ములుగు ప్రతినిధి, నవంబర్ 29(జనంసాక్షి) :** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్, వార్డు సభ్యుల పదవులను వేలం వేయడం వంటి చర్యలకు ఎవరైనా పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని, ఎన్నికలు ప్రజాస్వామ్యబద్ధంగా జరగాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీ రాజ్ సంస్థల ఎన్నికలను పూర్తిగా స్వేచ్ఛాయుతంగా, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించడం రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఎన్నికల్లో నామినేషన్ సమయంలో బెదిరింపులు, దౌర్జన్యం, లంచాలు, సర్పంచ్/వార్డు పదవులకు ఏకగ్రీవాలకు వేలం వంటి అనైతిక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇలాంటి చర్యలు ప్రజాస్వామ్యానికి విరుద్ధమని, ఎన్నికలు నిస్పక్షపాతంగా నిర్వహించేలా ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. భారత శిక్షాస్మృతిలోని సెక్షన్ 171-ఏ ప్రకారం ఎన్నికలలో అక్రమ ప్రవర్తనలు, సెక్షన్ 171-బి ప్రకారం లంచగొండితనం, సెక్షన్ 171-సి ప్రకారం ఓటర్లపై అనుచిత ప్రభావం లేదా బెదిరింపులు ఎన్నికల నేరాలుగా పరిగణించ బడతాయని తెలిపారు. వీటికి సెక్షన్ 171-ఈ మరియు 171-ఎఫ్ ప్రకారం ఒక సంవత్సరం వరకు జైలు శిక్ష, జరిమానా లేదా రెండూ విధించవచ్చు, అలాగే అనైతిక చర్యలకు పాల్పడిన వారు ఆరు సంవత్సరాల పాటు ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనర్హులు అవుతారని తెలిపారు. పదవులను వేలం వేయడం, లంచగొండితనం, అనుచిత ప్రభావం వంటి ఎవరైనా నామినేషన్ లేదా ఉపసంహరణ సమయంలో అడ్డంకులు సృష్టించినా, బెదిరింపులు చేసినా, డబ్బు లేదా ఇతర ప్రలోభాలకు గురిచేసిన లేదా పదవులను వేలం వేస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని, కలెక్టర్ తెలియజేశారు.



## భట్టిని కలిసిన జనగామ డిసిసి అధ్యక్షురాలు లకావత్ ధనవంతి

**పాలకుర్తి నవంబర్ 29 (జనంసాక్షి) :** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ను శనివారం జనగామ డిసిసి అధ్యక్షురాలు లకావత్ ధనవంతి- లక్ష్మీనారాయణ దంపతులు మర్యాదపూర్వకంగా కలిసి తమను డిసిసి అధ్యక్షురాలిగా నియమించినందుకు డిసిసి అధ్యక్షురాలు అధ్యక్షురాలు జెడ్పి ఛైర్మెన్ లకావత్ ధనవంతి-టిపీసీసీ సభ్యుడు డాక్టర్ లకావత్ లక్ష్మీ నారాయణ నాయక్ దంపతులు కృత్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా పార్టీ బలోపేతం కోసం కృషిచేయాలని, స్థానిక సంస్థల ఎన్నికలల్లో అందరినీ కలుపుకొని అత్యధిక స్థానాలు గెలిచేలా పాటుపడాలని భట్టి విక్రమార్క, డిసిసి అధ్యక్షురాలు లకావత్ ధనవంతి కి సూచించారు.

## దివ్యాంగులను అన్ని రంగాల్లో ప్రోత్సహించాలి

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**నిర్మల్ రూరల్, నవంబర్29(జనం సాక్షి) :** దివ్యాంగులకు అన్ని రంగాలలో ప్రోత్సాహకం అందించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు.శనివారం సాయంత్రం పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని దివ్యాంగులకు జిల్లా స్థాయి క్రీడా పోటీలను నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగులకు అందరూ ప్రోత్సాహకాన్ని అందిస్తూ సమాజంలో భాగస్వామ్యం చేయాలన్నారు.గతంలో ఎంతోమంది దివ్యాంగులు పట్టుదలతో శ్రమించి వివిధ రంగాల్లో ఉన్నత శిఖరాలకు చేరుకున్నారని గుర్తు చేశారు.ఇటీవలి అందుల క్రికెట్ ప్రపంచ కప్ భారత జట్టు గెలుచుకుందని తెలిపారు.దివ్యాంగులంతా క్రీడలను తమ జీవితంలో భాగస్వామ్యం చేసుకోవాలని,క్రీడల వలన ఉల్లాసం కలుగుతుందని తెలిపారు.దివ్యాంగుల కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.తప్పకుండా డిఆర్ సి సమావేశాలు నిర్వహించి, సమస్యలను తెలుసుకుంటూ తగిన విధంగా చర్యలు చేపడతామని తెలిపారు.దివ్యాంగులు తమ నైపుణ్యాలు పెంచుకొని వివిధ రంగాలలో ప్రగతి సాధించాలని సూచించారు.అనంతరం దివ్యాంగుల పరుగు పందెపు పోటీలను ప్రారంభించారు.దివ్యాంగులతో కలిసి చెస్, క్యారం బోర్డు ఆడారు.ఈ కార్యక్రమంలో డీఈవో భోజన్న,డివైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి,డీపీఆర్వో విష్ణువర్ధన్,సంక్షేమ శాఖ అధికారులు,ఇతర అధికారులు, సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధిని చూసే కాంగ్రెస్‌లో చేరుతున్నారు

- ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



**పాలకుర్తి, నవంబర్ 29(జనంసాక్షి) :** పాలకుర్తి నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్ లోకి చేరుతున్నారని స్థానిక ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో దేవరుప్పుల మండలం లక్ష్మన్ తండా గ్రామానికి చెందిన 15 మంది బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ లో చేరగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను అత్యదిక మెజారిటీతో గెలిపించే విధంగా పార్టీ శ్రేణులు పని చేయాలని సూచించారు. పార్టీ కోసం పని చేసే ప్రతి కార్యకర్త చిత్తశుద్ధితో సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నల్ల శ్రీరాములు పార్టీ ముఖ్య నాయకులు ఉన్నారు.

## నామినేషన్ ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలి

- కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట ప్రతినిధి, నవంబర్ 29 (జనంసాక్షి) :** నామినేషన్ ప్రక్రియ సజావుగా ఎలాంటి పొరపాట్లు లేకుండా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని రిటర్నింగ్ అధికారులను జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు.నాగారం మండల కేంద్రంలోని నామినేషన్ కేంద్రాన్ని,తిరుమలగిరి మండలం తొండ గ్రామంలోని గ్రామపంచాయతీ ఎలక్షన్ నామినేషన్ కేంద్రాన్ని జిల్లా ఎస్పీ కె.నరసింహతో కలిసి సందర్శించి మొదట విడత ఎన్నికలు జరుగు పంచాయతీలలో చివరి రోజు నామినేషన్ ప్రక్రియ గురించి అడిగి తెలుసుకున్నారు.ఎన్నికల నిబంధనల మేరకు నామినేషన్స్ వేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవోలు భీమ్ సింగ్, లాజర్,తహసీల్దార్లు హరి కిషోర్ శర్మ, హరిప్రసాద్, ఆర్ఐ బాబా తదితరులు పాల్గొన్నారు.

## శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

- డీఎస్పీ అబ్దుల్ రహమాన్



**చంద్రుగొండ, నవంబర్ 29 (జనం సాక్షి) :** పంచాయతీ ఎన్నికలలో అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికలు శాంతియుతంగా జరిగేందుకు సహకరించాలని, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని డిఎస్పి అబ్దుల్ రహమాన్ హెచ్చరించారు. చంద్రుగొండ మండలంలోని చంద్రుగొండ గానుగపాడు రావికంపాడు దామరచర్లలో ని నామినేషన్ల కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రతి ఒక్కరు తోడ్పాటు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జూలూరుపాడు సిఐ లక్ష్మి, ఎస్సై శివరామకృష్ణ ఎంపీడీవో బయ్యారపు అశోక్ సెక్రటరీ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల నియమావళిపై పకడ్బందీ చర్యలు

- స్థానిక ఎన్నికలపై పోలీసుల ప్రత్యేకత నిఘా



**దేవరకొండ, నవంబర్ 29 (జనం సాక్షి) :** ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన సందర్భంగా దేవరకొండ రెవెన్యూ డివిజన్ ప్రాంతంలో ఎన్నికల నియమావళిని పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు శ్రీకారం చుట్టారు.అందులో భాగంగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎస్ రమణారెడ్డి స్థానిక డిఎస్పి ఎం వీ శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో శనివారం ఆర్డీవో కార్యాలయంలో డివిజన్లోని పోలీసు శాఖ అధికారులతో, ఎంపీడీవోలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అన్ని మండలాల సి ఐ లు,ఎస్ఐలు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి పంచాయతీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ




**తిరుమలగిరి (సాగర్), నవంబర్ 29 (జనంసాక్షి) :** నల్గొండ జిల్లాలో రెండవ విడత జరిగే పంచాయతీ ఎన్నికలకు నామినేషన్ల స్వీకరణ కోసం అధికారులు అన్ని ఏర్పాట్లనుపూర్తి చేశారు. నేటి నుండి డిసెంబర్ రెండవ తేదీ వరకు నామినేషన్ల చివరి తేదీ, ఇందుకోసం అల్వాల, తెట్టకుంట, శ్రీరాంపురం, పెద్దబావి తండా గ్రామాల అభ్యర్థులు అల్వాలలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో, తిరుమలగిరి , రంగుండ్ల, తూట్ పేట, ఎల్లాపురం గ్రామాల అభ్యర్థులు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తిరుమలగిరిలో, కొంపల్లి , సిల్గాపూర్, ఎల్లాపురం తండా , ఎల్లాపురం ,సుంకిశాల తండా గ్రామాల అభ్యర్థులు గ్రామపంచాయతీ భవనం కొంపెల్లి లో , రాజవరం , జువిచెట్టు తండా, బోయగూడం, గట్టుమీద తండా గ్రామాల అభ్యర్థులు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రాజవరంలో ,గరిక నెట్టు తండా, తునికినూతల , కీచ్య తండా ,తిమ్మాయిపాలెం , నాయకునితండా గ్రామాల అభ్యర్థులు ప్రాథమిక పాఠశాల కీచ్యతండా లో , మెగ్య తండా ,శీతల తండా, నేతాపురం ,ధన్ సింగ్ తండా గ్రామాల అభ్యర్థులు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నేతాపురంలో, బట్టు వెంకన్న బావి తండా, చింతలపాలెం, నాగార్జున పేట, సపావత్ తండా ,గోడుమడక గ్రామాల అభ్యర్థులు గ్రామ పంచాయతీ భవనం చింతలపాలెంలో, జాల్ తండా ,నెల్లికల్ ,ఎర్ర చెరువు తండా ,చెంచువాని తండా ,పిల్లిగుండ్ల తండా గ్రామాల అభ్యర్థులు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నెల్లికల్ లో, నామినేషన్ పత్రాలు సమర్పించవలసి ఉంటుంది అని ఇన్చార్జి ఎంపీడీవో భిక్షం రాజు తెలిపారు. అభ్యర్థులందరూ సరైన ధ్రువపత్రాలతో నామినేషన్ దాఖలు చేయాలని ఆయన కోరారు.

# యువత క్రీడలతో పాటు భవిష్యత్తుపై దృష్టి పెట్టాలి

- యువత అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలి
- గంజాయి తాగేవారిని పట్టిస్తే 10,000 నగదు బహుమతి
- ఇఎల్వి ఫౌండేషన్ చైర్మన్ భాస్కర్



**చౌటుప్పల్, నవంబర్ 29 (జనం సాక్షి) :** యువత క్రీడలతో పాటు భవిష్యత్తుపై దృష్టి పెట్టాలని ఇ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ భాస్కర్ అన్నారు.మండల పరిధిలోని కొయ్యలగూడెం ఎల్లంబావి గ్రామంలో యువకులు స్వచ్ఛందంగా ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌ను ఇ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ భాస్కర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గ్రామీణ యువత స్వచ్ఛందంగా ఇలాంటి క్రీడా కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో సంతోషకరమన్నారు. యువకులు ఇలాగే ఆరోగ్యకరమైన అలవాట్లను, క్రీడలను ప్రోత్సహించాలని తెలిపారు.నేటి సమాజంలో గంజాయి వినియోగం, దొంగతనాలు, చైన్ స్నాచింగ్‌లు, అత్యాచారాలు వంటి నేరాలు పెరుగుతున్నాయని, యువత అటువంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి తాగేవారిని, లేదా అమ్మకాలు చేసేవారిని పోలీసులకు పట్టించిన వారికి నా ఫౌండేషన్ తరఫున రూ. 10,000 నగదు బహుమతిని అందిస్తానని పేర్కొన్నారు. గ్రామ యువకులు ప్రభుత్వ పరంగా స్థలాన్ని సాధించుకోగలిగితే, ఆ మైదానంలో అన్ని రకాల క్రీడలకు సంబంధించిన సదుపాయాలు, మౌలిక వసతులను కల్పిస్తానని హామీ ఇచ్చారు. యువత కేవలం క్రీడలకే పరిమితం కాకుండా, తమ ఆర్థిక అభివృద్ధిపై కూడా దృష్టి సారించాలన్నారు. ప్రతి వ్యక్తిలో ఏదో ఒక ప్రత్యేకమైన టాలెంట్ ఉంటుంది ఆ టాలెంట్‌తో ముందుకు వెళ్లాలని తెలిపారు. మీ టాలెంట్‌ను గుర్తించి, దానికి ఆర్థిక వనరులు కావాలంటే నేను మీకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. గ్రామంలోని యువకులు బలంగా, చైతన్యవంతంగా మారితేనే దేశం బాగుపడుతుందని ఆయన తెలిపారు. తాను 18 సంవత్సరాలకే బెంగళూరు వెళ్లి వ్యాపారం ప్రారంభించానని, యువత కూడా క్రీడలకు ఎంత ప్రాధాన్యమిస్తారో తమ భవిష్యత్తుకు కూడా అంతే ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. యువకులు తమ తల్లిదండ్రులకు చేదోడు వాదోడుగా నిలవాలని, వారిని గౌరవించాలని కోరారు. తల్లిదండ్రులను, దేశాన్ని ఎవరైతే గౌరవిస్తారో వాడు ఎప్పటికీ ఓడిపోడు అని తెలిపారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని అన్ని రకాల క్రీడల అభివృద్ధి కోసం తమ ఫౌండేషన్ తరఫున ఒక సమగ్ర ప్రణాళికను రూపొందిస్తున్నామని, త్వరలోనే దానిని ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ డైరెక్టర్ ఇరగదిండ్ల అశోక్, బిజెపి మండల అధ్యక్షుడు కైరంకొండ అశోక్, అల్మాస్పేట గౌతమ్, నారని భాస్కర్, కంది రవికాంత్ రెడ్డి, కొయ్యడ రమేష్, నాగుల మహేష్, పిల్లలమర్రి సాయి, కంకల శ్రీకాంత్ ఇ ఎల్ వి ఫౌండేషన్ డైరెక్టర్ అశోక్ ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## 24 గంటల పాటు త్రాగునీటి సరఫరాకు చర్యలు



**ఖమ్మం, నవంబర్ 29 (జనం సాక్షి) :** ఖమ్మం నగరంలో 24 గంటల పాటు త్రాగునీటి సరఫరాకు చర్యలు చేపట్టామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. శనివారం ఖమ్మం నగరం 35వ డివిజన్ లో పర్యటించి 50.25 లక్షల రూపాయలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ నగరంలో చేపట్టే అభివృద్ధి పనులు నాలుగు కాలాల పాటు స్థిరంగా ఉండే విధంగా పూర్తి చేయాలని అన్నారు. ప్రతి ఒక్కరూ ఖమ్మం నగరాన్ని పరిశుభ్రంగా ఉంచుకునేందుకు బాధ్యతతో వ్యవహరించాలని అన్నారు. కార్పొరేటర్లు, ప్రజలు మున్సిపల్ కమీషనర్ కు సహకరిస్తూ పారిశుధ్య నిర్వహణ మెరుగ్గా ఉండేలా చూడాలని అన్నారు. అమృత్ పథకం క్రింద ఖమ్మం మున్సిపాలిటీకి 220 కోట్ల రూపాయలు మంజూరు చేయడం జరిగిందని, అధికారులు, ప్రజా ప్రతినిధులు కూర్చొని చేపట్టాల్సిన పనుల యొక్క డిపిఆర్ తయారు చేయాలని అన్నారు. డిసెంబర్ నెలలో అమృత్ పనులకు టెండర్ పిలిచి రాబోయే వేసవి కాలం నాటికి పనులు పూర్తి చేయాలని, నగర వ్యాప్తంగా 24 గంటల పాటు త్రాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని అన్నారు. నగరంలో డ్రైయిన్ నిర్మాణం కోసం మరో 200 కోట్ల పనులు జరుగుతున్నాయని అన్నారు. ఖమ్మం ఖిల్లాకు రోప్ వే సౌకర్యం కల్పించి పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టామని, లకారం ప్రక్కన శిల్పారామం నిర్మిస్తున్నామని, వెలుగు మట్ల అర్బన్ పార్క్ అభివృద్ధి చర్యలు చేపట్టామని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, నగర మేయర్ పునుకొల్లు నీరజ, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, కార్పొరేటర్లు, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## వీడిఎస్ సేవలను సద్వియోగం చేసుకోవాలి



**దేవరకొండ, నవంబర్ 29 (జనం సాక్షి) :** మహిళలు, బాలికలు నేటి పోటీ ప్రపంచంలో నిలబడాలంటే ఒక నిర్దిష్టమైన లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకోవాలని, దానికి అనుగుణంగా ప్రతిక్షణం పరితపిస్తూ ముందుకు సాగితే ఎలాంటి విజయాలైన కూడా సాధించగలుగుతామని బెస్ట్ సర్వీస్ సొసైటీ జాతీయ అవార్డు గ్రహీత, వీడిఎస్ కోఆర్డినేటర్ డా. లావుడి బాషా చౌహన్ తెలిపారు. శనివారం పట్టణంలోని విలేజ్ డెవలప్మెంట్ సొసైటీ వారి ఆధ్వర్యంలో, ఈ ఎస్ ఎస్ వి వై వారి ఆర్థిక సహకారంతో ఉచిత బ్యూటిషన్ కోర్సు పూర్తి చేసుకున్న వారికి రవి,శాంతి,కవిత కలిసి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా లావుడి భాష మాట్లాడుతూ గ్రామీణ యువతులు మహిళలు, గృహిణిలు ఉద్యోగం రాలేదనే బెంగ లేకుండా కొద్ది రోజులపాటు బ్యూటిషన్ కోర్సో ఉచిత శిక్షణతో స్వయం ఉపాధి కల్పించవచ్చని అన్నారు.

## మణుగూరు ఏరియాలో 83 శాతం బొగ్గు ఉత్పత్తి




**మణుగూరు, నవంబర్ 29 (జనంసాక్షి) :** వర్షా ప్రభావం వల్ల బొగ్గు ఉత్పత్తి తగ్గిందని జనరల్ మేనేజర్ దుర్గం రామచంద్ర అన్నారు. శని వారం జిఎం కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ... నవంబర్ నెలలో మణుగూరు ఏరియాలో బొగ్గు ఉత్పత్తి లక్ష్యం 10 లక్షల 58 వేల 500 టన్నులకు గాను 8 లక్షల 31 వేల 433 టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించారు. నవంబర్ నెలలో సాధించిన బొగ్గు ఉత్పత్తి 83 శాతం. అలాగే 01 ఏప్రిల్ 2025 నుండి 29 నవంబర్ 2025 వరకు ప్రొగ్రెస్సివ్ బొగ్గు ఉత్పత్తి 72 లక్షల 69 వేల 500 టన్నుల లక్ష్యానికి గాను 68 లక్షల 15 వేల 358 టన్నులు సాధించడం జరిగింది. అనగా 94 శాతం సాధించడం జరిగింది. నవంబర్ నెలలో మణుగూరు ఏరియా 8 లక్షల 32 వేల 631 టన్నుల బొగ్గును రవాణా చేయటం జరిగింది. అలాగే 01 ఏప్రిల్, 2025 నుండి 29 నవంబర్ 2025 వరకు ప్రోగ్రెస్సివ్ గా 66 లక్షల 75 వేల 953 టన్నులు రవాణా చేశారు. నవంబర్ నెలలో ఓవర్ బర్డెన్ డిపార్ట్ మెంటల్ గా 15 లక్షల క్యూబిక్ మీటర్లకు లక్ష్యానికి గాను 90 శాతంతో 13 లక్షల 47 వేల క్యూబిక్ మీటర్లు తీయటం జరిగింది. అలాగే పదవి విరమణ మెడికల్ ఉద్యోగులకు ఇతర చెల్లింపులు చేయటం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో ఏరియా ఇంజినీర్ ఆర్. శ్రీనివాస్, ఏరియా రక్షణ అధికారి వెంకటరామరావు, ఎం ఎన్ జి ఓసీ ప్రాజెక్ట్ అధికారి ఈ. శ్రీనివాస్ , ఏజీఎం(ఐఈడి) సిహెచ్ రాంబాబు, డిజిఎం(పర్సనల్) ఎస్. రమేశ్, డిజిఎం( ఫైనాన్స్) ఎం. అనురాధా, డివై.సిఎంఓ జ్యోతిర్మై, పర్యావరణ అధికారి జే. శ్రీనివాస రావు. ఏరియా సెక్యూరిటీ అధికారి కే. శ్రీనివాస్, డివై. ఎస్ఈ డివిఎస్ఎన్ ప్రవీణ్ , తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన విద్య అందించడం అధ్యాపకుల బాధ్యత



**జహీరాబాద్, నవంబర్ 29 (జనం సాక్షి) :** విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం అధ్యాపకుల భాధ్యత అని డాక్టర్ ప్రవీణ అన్నారు. టెలంగాణా ఉన్నత విద్యా కమిషనర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల విద్యా, బోధనా పనితీరును అంచనా వేసే విద్యా పరిశీలన (అకాడమిక్ ఆడిట్) 2022-23, 2023-24 సంవత్సరాల కోసం ప్రభుత్వ డిగ్రీ కళాశాల జహీరాబాద్‌లో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యా సలహాదారులుగా తారా ప్రభుత్వ కళాశాల సంగారెడ్డి ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. ప్రవీణ అదే కళాశాల వాణిజ్య విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎం. వీరేంద్ర పాల్గొన్నారు. వారు కళాశాలలోని 15 విభాగాల పనితీరును కళాశాల ప్రగతిని సమీక్షించారు.

## వికలాంగులకు జిల్లా స్థాయి క్రీడా పోటీలు



**సూర్యాపేట ప్రతినిధి, నవంబర్ 29 (జనంసాక్షి) :** అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళ, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో జిల్లా సంక్షేమ అధికారి కె.నరసింహ రావు అధ్యక్షతన శనివారం జిల్లాలోని దివ్యాంగులకు క్రీడా పోటీలు నిర్వహించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల్లో క్రీడా పోటీల ద్వారా మానసిక ఉల్లాసం, మనోధైర్యం కలుగుతుందన్నారు.క్యారమ్ బోర్డ్, చెస్, పరుగుపందెం,షార్ట్ పుట్ లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ క్రీడా పోటీలలో ప్రతిభ కనబరిచిన వారికి డిసెంబర్ 3న జరిగే జిల్లా స్థాయి అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం కార్యక్రమంలో బహుమతులను అందజేయనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకట రమణ, డిఈఓ అశోక్ , జిల్లా యూత్ అండ్ స్పోర్ట్స్ ఆఫీసర్ వెంకట్ రెడ్డి, సిడీపీవోలు , సూపర్ వైజర్స్, సిబ్బంది,దివ్యాంగుల సంఘాల అధ్యక్షులు, నాయకులు , అపూర్వ పాఠశాల ఉఫాద్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# కల్లుగీత వృత్తిని ఆధునీకరించాలి

- నీరాను ప్రభుత్వమే ప్రచారం చేయాలి
- ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మీ




**సూర్యాపేట ప్రతినిధి, నవంబర్ 29 (జనంసాక్షి) :** కల్లు గీత వృత్తిని ఆధునికరించాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి అన్నారు.శనివారం జిల్లా కేంద్రంలోని అంతటి విజయ్ ఫంక్షన్ హాల్ లో జరిగిన కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర 4వ మహాసభలను ఆమె ప్రారంభించి మాట్లాడారు.కల్లు గీత వృత్తిని ఆధునికరించి, నీరా, తాటి, ఈత ఉత్పత్తులను ప్రోత్సహించి ఉపాధి కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం చెందాయని అన్నారు.ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం అనేక వాగ్దానాలు ఇచ్చి అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు అవుతున్న నేటికీ కల్లుగీత కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని అన్నారు.అభివృద్ధి పేరుతో తాటి, ఈత చెట్లను నరికి వేయడం మూలంగా గీత వృత్తి రోజురోజుకు అంతరిస్తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బహుళ జాతి సంస్థల లాభాల కోసం పనిచేస్తున్నాయని విమర్శించారు.ఎన్నో పోషక విలువలు ఉన్న కల్లును ప్రచారం చేయకుండా బడా వ్యాపార వర్గాల ప్రయోజనాల కోసం పాలకులు పనిచేస్తున్నారని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం మద్యంను ఆదాయ వనరుగా చూస్తూ విచ్చలవిడిగా మద్యానికి పర్మిషన్ ఇవ్వడం మూలంగా ఆ మద్యానికి బానిసై లక్షలాది కుటుంబాలు మృత్యువాతన పడుతున్నాయని పేర్కొన్నారు.మద్యం వల్ల జరిగే నష్టాలపై ప్రభుత్వాలు ప్రచారం చేయాలన్నారు.దేశీయ వస్తువులను వాడండని ప్రధాని మోడీ చెబుతూ ప్రకృతి పానీయం నీరా, కల్లును ఎందుకు ప్రోత్సహించడం లేదని ప్రశ్నించారు.తమ హక్కుల సాధన కోసం కల్లుగీత కార్మిక సంఘం నాయకత్వం ఐక్యంగా ఉద్యమించాలని, అప్పుడే కల్లుగీత కార్మికుల సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు.కల్లుగీత వృత్తి చేసే వారందరికీ కాటమయ్య రక్షణ కవచం ఇవ్వాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు కోరారు.లక్షలాదిమందికి ఉపాధి కల్పిస్తున్న కల్లుగీత వృత్తికి రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర ప్రణాళికలు రూపొందించాలన్నారు. సుప్రజ హాస్పిటల్ ఎండి శిగ విజయ్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో సభకు హాజరైన ప్రతినిధులకు వైద్య పరీక్షలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎంవి.రమణ, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ బాలగాని జయరాములు, ఎస్.రమేష్ కుమార్, మడ్డి అంజిబాబు, బుర్ర స్వప్న,రాష్ట్ర నాయకులు చౌగాని సీతారాములు, కౌడిన్య అమెరికన్ ఆఫ్ నార్త్ ఇండియా అసోసియేషన్ చైర్మన్ నాతి శ్రీనివాస్ గౌడ్, మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి బాలకృష్ణ, కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి తప్పెట్ల స్కైలాబ్ బాబు, జిఎంపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుత రవీందర్, వాయిద్య కళాకారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు శాంత కుమార్, రాష్ట్ర నాయకులు గౌని వెంకన్న, బాలే వెంకట మల్లయ్య, బూడిద గోపి, ఉషాగాని వెంకట నరసయ్య, ఎల్గూరి గోవింద్ తదితరులు పాల్గొన్నారు.




అలీబాబా ఏఐ గ్లాసెస్ ఆవిష్కరణ

టెక్నాలజీ వాడకం పెరుగుతున్న కొద్దీ టెక్ గ్యాడ్జెట్లపై ప్రజలకు ఆసక్తి ?కూడా అధికమవుతోంది. స్మార్ట్‌ఫోన్‌ల తర్వాత ఇప్పుడు ఏఐ పవర్డ్ వేరబుల్స్‌పై మక్కువ చూపుతున్నారు.ముఖ్యంగా స్మార్ట్ గ్లాసెస్‌లు మార్కెట్ ఏటా పెరుగుతోంది. ఐడీసీ రిపోర్ట్ ప్రకారం 2025 రెండో త్రైమాసికంలో గ్లోబల్ వేరబుల్స్ మార్కెట్ 9.6% వృద్ధి చెందింది. చైనాలో 50 మిలియన్ యూనిట్ల స్మార్ట్ గ్లాసెస్ విక్రయించారు. ఈ నేపథ్యంలో చైనా ఈ-కామర్స్ దిగ్గజం అలీబాబా తన మొదటి ఏఐ గ్లాసెస్‌ను ఆవిష్కరించింది. 'క్వార్క్ ఏఐ గ్లాసెస్' పేరుతో విడుదల చేసిన ఈ గాడ్జెట్ మెటా గ్లాసెస్‌కు పోటీ ఇస్తుందని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ గ్లాసెస్‌తో అలీబాబా కన్స్యూమర్ ఏఐ మార్కెట్‌లో ఎంట్రీ ఇచ్చింది.అలీబాబా క్వెన్ లార్జ్ లాంగ్వేజ్ మోడల్ ద్వారా క్వార్క్ ఏఐ అసిస్టెంట్‌తో ఈ గ్లాసెస్‌ను రెగ్యులర్ ఐవేర్‌లాగా కనిపించే డిజైన్‌తో తీసుకొచ్చారు. బ్లాక్ ప్లాస్టిక్ ఫ్రేమ్‌తో స్టైలిష్‌గా ఉండటం వల్ల ఇవి రోజువారీ ఉపయోగానికి సరిపోతాయని కంపెనీ తెలిపింది. మెటా రేబాన్ డిస్‌ప్లే గ్లాసెస్ లాంటి హెవీ గ్యాడ్జెట్‌లకు విరుద్ధంగా ఇవి కేవలం 40 గ్రాముల బరువు మాత్రమే కలిగి ఉంటాయని చెప్పింది. ప్రెస్క్రిప్షన్ లెన్స్ సపోర్ట్ చేస్తూ వివిధ ఫ్రేమ్ కలర్స్, లెన్స్ ఆప్షన్‌లతో అందుబాటులో తీసుకొచ్చినట్లు తెలిపింది.

క్వార్క్ ఏఐ గ్లాసెస్‌ను ఫ్లాగ్‌షిప్ లైఫ్‌స్టైల్ ఫోకస్డ్ మోడళ్లలో ఆవిష్కరించారు. మోడల్‌ను అనుసరించి ఫీచర్లలో తేడాలుంటాయి. ఈ గ్లాసెస్‌లోని కీలక ఫీచర్లు కింది విధంగా ఉన్నాయి.విదేశీ భాషల్లో సంభాషణలు లేదా టెక్స్ట్‌ను ఇన్‌స్టంట్‌గా అనువదిస్తుంది. ప్రయాణికులకు, బిజినెస్ ప్రొఫెషనల్స్‌కు ఇది

# బ్లాక్‌ఫ్రైడే అమ్మకాల హోరు..


**న్యూఢిల్లీ:**దీపావళి షాపింగ్ ఇటీవలే ముగిసినా భారతీయ కొనుగోలుదారులు మళ్లీ ఆఫర్ల కోసం వెతుకుతూ షాపింగ్ చేసేందుకు సిద్ధం అవుతున్నారు. నవంబర్ 28న అమెరికన్ బ్లాక్ ఫ్రైడే భారతదేశంలో కూడా మహా సేల్ డేగా మారిపోయింది.ఫ్లిప్‌కార్ట్, అమెజాన్, నైకా, టాటా క్లిక్, క్రోమా, మింత్రా, రిలయన్స్ డిజిటల్, సామ్‌సంగ్ షాప్.. అన్నీ వారం నుంచే 'ఎర్లీ బ్లాక్ ఫ్రైడే' పేరుతో భారీ డిస్కౌంట్ల మోత మోగిస్తున్నాయి. గతంలో బ్లాక్ ఫ్రైడే అంటే నవంబర్ చివరి శుక్రవారం ఒక్క రోజు మాత్రమే ఆఫర్లు ఉండేవి. ఈసారి చాలా ప్లాట్‌ఫామ్‌లు నవంబర్ 22-23 నుంచే సేల్స్ ప్రారంభించాయి. డిసెంబర్ 2-3 వరకు (సైబర్ మండే తర్వాత కూడా) ఇవి కొనసాగనున్నాయి. అంటే దాదాపు 10-12 రోజుల పాటు నాన్‌స్టాప్ షాపింగ్ కార్నివాల్‌గా దీన్ని పరిగణిస్తున్నాయి.

ప్రస్తుతం వివిధ రిటైలర్లు ఇస్తున్న ఆఫర్లు కింది విధంగా ఉన్నాయి.

ఎలక్ట్రానిక్స్ (60-70% వరకు ఆఫ్)
ఫ్యాషన్, లైఫ్‌స్టైల్ (80% వరకు డిస్కౌంట్)
బ్యూటీ, పర్సనల్ కేర్ (బై-1 గెట్-3 ఆఫర్లు)
హోమ్ అప్లయెన్సెస్, ఫర్నిచర్ (నో-కాస్ట్ ఈఎంఐ ం 25-40% ఆఫ్)ప్రీమియం, లగ్జరీ బ్రాండ్స్‌పై 50-60% వరకు తగ్గింపు. (పైఆఫర్లలో షరతులు వర్తిస్తాయని గుర్తుంచుకోవాలి)

'దీపావళి తర్వాత కస్టమర్లు పెద్దగా ఖర్చు చేసేందుకు మొగ్గు చూపరేమోనని అనుకున్నాం. కానీ ఈసారి డిమాండ్ అంచనాలను మించిపోయింది. ముఖ్యంగా జెన్-జీ, మిలినియల్స్ బ్లాక్ ఫ్రైడే అనగానే భారీగా కొనుగోళ్లు చేస్తున్నారు' అని ప్రముఖ ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఒకరు చెప్పారు. పరిశ్రమ అంచనాల ప్రకారం 2025 బ్లాక్ ఫ్రైడే నుంచి సైబర్ మండే వరకు వీకెండ్ సేల్స్ గత ఏడాది కంటే 22-27% ఎక్కువగా నమోదు కానున్నాయి. దీంతో భారతదేశం ప్రపంచంలోనే అత్యంత వేగంగా పెరుగుతున్న బ్లాక్ ఫ్రైడే మార్కెట్‌ల్లో ఒకటిగా అవతరించింది.




## అలీబాబా ఏఐ గ్లాసెస్ ఆవిష్కరణ



**న్యూఢిల్లీ:**టెక్నాలజీ వాడకం పెరుగుతున్న కొద్దీ టెక్ గ్యాడ్జెట్లపై ప్రజలకు ఆసక్తి ?కూడా అధికమవుతోంది. స్మార్ట్‌ఫోన్‌ల తర్వాత ఇప్పుడు ఏఐ పవర్డ్ వేరబుల్స్‌పై మక్కువ చూపుతున్నారు.ముఖ్యంగా స్మార్ట్ గ్లాసెస్‌లు మార్కెట్ ఏటా పెరుగుతోంది. ఐడీసీ రిపోర్ట్ ప్రకారం 2025 రెండో త్రైమాసికంలో గ్లోబల్ వేరబుల్స్ మార్కెట్ 9.6% వృద్ధి చెందింది. చైనాలో 50 మిలియన్ యూనిట్ల స్మార్ట్ గ్లాసెస్ విక్రయించారు. ఈ నేపథ్యంలో చైనా ఈ-కామర్స్ దిగ్గజం అలీబాబా తన మొదటి ఏఐ గ్లాసెస్‌ను ఆవిష్కరించింది. 'క్వార్క్ ఏఐ గ్లాసెస్' పేరుతో విడుదల చేసిన ఈ గాడ్జెట్ మెటా గ్లాసెస్‌కు పోటీ ఇస్తుందని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ గ్లాసెస్‌తో అలీబాబా కన్స్యూమర్ ఏఐ మార్కెట్‌లో ఎంట్రీ ఇచ్చింది.అలీబాబా క్వెన్ లార్జ్ లాంగ్వేజ్ మోడల్ ద్వారా క్వార్క్ ఏఐ అసిస్టెంట్‌తో ఈ గ్లాసెస్‌ను రెగ్యులర్ ఐవేర్‌లాగా కనిపించే డిజైన్‌తో తీసుకొచ్చారు. బ్లాక్ ప్లాస్టిక్ ఫ్రేమ్‌తో స్టైలిష్‌గా ఉండటం వల్ల ఇవి రోజువారీ ఉపయోగానికి సరిపోతాయని కంపెనీ తెలిపింది. మెటా రేబాన్ డిస్‌ప్లే గ్లాసెస్ లాంటి హెవీ గ్యాడ్జెట్‌లకు విరుద్ధంగా ఇవి కేవలం 40 గ్రాముల బరువు మాత్రమే కలిగి ఉంటాయని చెప్పింది. ప్రెస్క్రిప్షన్ లెన్స్ సపోర్ట్ చేస్తూ వివిధ ఫ్రేమ్ కలర్స్, లెన్స్ ఆప్షన్‌లతో అందుబాటులో తీసుకొచ్చినట్లు తెలిపింది.క్వార్క్ ఏఐ గ్లాసెస్‌ను ఫ్లాగ్‌షిప్ లైఫ్‌స్టైల్ ఫోకస్డ్ మోడళ్లలో ఆవిష్కరించారు. మోడల్‌ను అనుసరించి ఫీచర్లలో తేడాలుంటాయి. ఈ గ్లాసెస్‌లోని కీలక ఫీచర్లు కింది విధంగా ఉన్నాయి.విదేశీ భాషల్లో సంభాషణలు లేదా టెక్స్ట్‌ను ఇన్‌స్టంట్‌గా అనువదిస్తుంది.

# జీడీపీ.. ఆల్ టైం హై..

- సెప్టెంబర్ క్వార్టర్‌లో 8.2 శాతం వృద్ధి
- జూన్ త్రైమాసికంలో 7.8 శాతమే
- పరిశ్రమలు, సేవల రంగాల్లో పటిష్ట పనితీరు
- అంచనాలకు మించి ఆర్థిక దూకుడు

న్యూఢిల్లీ: అంచనాలను మించి, విశ్లేషకులను ఆశ్చర్యపరుస్తూ స్థూల దేశీయ ఉత్పత్తి (జీడీపీ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికంలోనూ (క్యూ2) బలమైన పనితీరు చూపించింది.ఆరు త్రైమాసికాల గరిష్ట స్థాయిలో 8.2 శాతం వృద్ధి నమోదైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో జీడీపీ వృద్ధి 7.8 శాతం కంటే మరింత బలపడింది.వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) తగ్గనుండడంతో డిమాండ్ పుంజుకుంటుందన్న అంచనాల మేరకు పరిశ్రమలు ఉత్పత్తిని పెంచడం, పండుగల సీజన్‌లో పెరిగిన వినియోగ వ్యయాలు వృద్ధికి అండగా నిలిచాయి. క్రితం ఆర్థిక సంవత్సరం (2024-25) క్యూ2లో జీడీపీ వృద్ధి 5.6 శాతంగా ఉండడం గమనార్హం. 2023-24 జనవరి-మార్చి క్వార్టర్‌లో నమోదైన 8.4 శాతం పూర్వపు గరిష్ట వృద్ధిగా ఉంది.మరోసారి భారత్ ప్రపంచంలోనే వేగవంతమైన ఆర్థిక వ్యవస్థగా మొదటి స్థానంలో నిలిచింది. ఈ కాలంలో 4.8% వృద్ధితో చైనా రెండో స్థానంలో నిలిచింది. ఎన్‌ఎస్‌వో సెప్టెంబర్ త్రైమాసికం జీడీపీ గణాంకాలను శుక్రవారం విడుదల చేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ కాలంలో జీడీపీ వృద్ధి 8 శాతంగా ఉంది. క్రితం ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో 6.1% కంటే ఎంతో మెరుగుపడింది.

**ముఖ్యాంశాలు..**

జీడీపీలో 57 శాతం వాటా కలిగిన ప్రైవేటు తుది వినియోగం 7.9 శాతం పెరిగింది. క్రితం ఏడాది ఇదే కాలంలో వృద్ధి 6.4 శాతంగా ఉంది. జూన్ త్రైమాసికంలో 7 శాతం వృద్ధి చెందడం గమనార్హం.తయారీ రంగంలో 9.1% స్థాయిలో బలమైన వృద్ధి నమోదైంది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో ఈ రంగంలో వృద్ధి 2.2 శాతమే. ఆగస్ట్ 15న స్వాతంత్ర్యదినం సందర్భంగా ప్రధాని జీఎస్‌టీ సంస్కరణలను ప్రకటించడంతో.. పెరిగే డిమాండ్‌కు అనుగుణంగా పరిశ్రమలు ఉత్పత్తిని పెంచడం ఇందుకు




దారితీసింది.సేవల రంగం లోనూ (బ్యాంకింగ్, ఫైనాన్షియల్, రియల్ ఎస్టేట్, నిపుణుల సేవలు సహా) 10.2 శాతానికి వృద్ధి బలపడింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో వృద్ధి 7.2 శాతంగా ఉంది. దేశంలో ఎక్కువ మందికి ఉపాధినిస్తున్న వ్యవసాయ రంగంలో మాత్రం వృద్ధి 3.5 శాతానికి పరిమితమైంది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో సాగు రంగం 4.1 శాతం వృద్ధిని చూపించడం గమనార్హం.ప్రభుత్వ వ్యయాలు క్రితం ఆర్థిక సంవత్సరం క్యూ2తో పోల్చితే 2.7 శాతం తగ్గాయి. జూన్ త్రైమాసికంలో 7.4 శాతం పెరగడం గమనించొచ్చు. ప్రభుత్వ మూలధన వ్యయాలు క్యూ2లో 31 శాతం పెరిగాయి. జూన్ క్వార్టర్‌లో 52 శాతం పెరుగుదల కంటే తక్కువే.? రియల్ జీడీపీ (స్థిర ధరల వద్ద/ద్రవ్యోల్బణంతో సర్దుబాటు చేసిన) సెప్టెంబర్ త్రైమాసికంలో రూ.48.63 లక్షల కోట్లుగా ఉంది. 2024-25 క్యూ2లో రూ.44.94 లక్షల కోట్లతో పోల్చితే 8.2 శాతం పెరిగింది.నామినల్ జీడీపీ సెప్టెంబర్ త్రైమాసికంలో రూ.85.25 లక్షల కోట్లుగా ఉంది. 2024-25లో రూ.78.40 లక్షల కోట్ల కంటే 8.7 శాతం వృద్ధి చెందింది.వ్యత్యాసాలు ఏకంగా రూ.1.62 లక్షల కోట్లకు పెరిగాయి. వివిధ నమూనాల ఆధారంగా జీడీపీ గణనలో వచ్చిన వ్యత్యాసాలు ఇవి.

**ఎంతో ప్రోత్సాహకరం**

**- ప్రధాని నరేంద్ర మోదీ**

2025-26 క్యూ2లో 8.2 శాతం వృద్ధి రేటు అన్నది చాలా ప్రోత్సాహకరంగా ఉంది. మేము చేపట్టిన సంస్కరణలు, వృద్ధి అనుకూల విధానాల ఫలితాన్ని సూచిస్తోంది. అంతేకాదు మన దేశ వ్యాపార సంస్థలు, ప్రజల కృషిని తెలియజేస్తోంది. మా ప్రభుత్వం సంస్కరణలను మరింత ముందుకు తీసుకెళ్లడం ద్వారా ప్రతి పౌరుడి జీవనాన్ని మరింత సులభతరం చేస్తుంది

**దేశ ఆర్థిక శక్తికి నిదర్శనం**

జీడీపీ అంచనాలు బలమైన ఆర్థిక వృద్ధి, ఆర్థిక కార్యకలాపాల వేగాన్ని సూచిస్తున్నాయి. 2025-26 క్యూ2లో 8.2 శాతం రియల్ జీడీపీ వృద్ధి రేటుతో భారత్ ప్రపంచంలోనే వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా నిలిచింది. నిలకడైన ద్రవ్య స్థిరీకరణ, లక్ష్యానికి అనుగుణంగా ప్రభుత్వ పెట్టుబడులు ఉత్పాదకతను బలోపేతం చేశాయి. వ్యాపార సులభతర నిర్వహణను మెరుగుపరిచాయి. ప్రధాని ఆధ్వర్యంలో ఈ వృద్ధి జోరును కొనసాగించేందుకు, దీర్ఘకాలంలో ఆర్థిక వృద్ధికి అనుకూలించే సంస్కరణలను చేపట్టేందుకు కట్టుబడి ఉంది.



భారత్‌లో పుతిన్ పర్యటన

# అంచనాలు భారీగానే..

**న్యూఢిల్లీ:**రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ డిసెంబర్ 4-5 తేదీల్లో భారతదేశంలో పర్యటించనుండడం అంతర్జాతీయ దౌత్య వర్గాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది. ముఖ్యంగా ఇరు దేశాల వ్యూహాత్మక సంబంధాలపై చర్చ జరుగుతోంది.సంప్రదాయంగా బలమైన మిత్ర దేశాలైన భారత్, రష్యాల మధ్య ఈ పర్యటనలో కీలక ఒప్పందాలు జరిగే అవకాశం ఉన్నట్లు కొందరు అంచనా వేస్తున్నారు. రష్యా-ఉక్రెయిన్ వివాదం తరువాత అమెరికా ఆంక్షల నేపథ్యంలో రష్యా భారత్‌కు చౌకగా ముడి చమురును అందించింది. దీంతో భారత్ చమురు దిగుమతుల్లో రష్యా ప్రధాన సరఫరాదారుగా అవతరించింది. అయితే, ఇటీవల కాలంలో ధర పరిమితుల సమస్యలు, చెల్లింపుల విధానాల్లోని క్లిష్టత, దేశీయ అవసరాల సర్దుబాటు కారణంగా భారత్ రష్యా నుంచి చమురు కొనుగోళ్లను కొంతమేరకు తగ్గించుకుంది. దాంతోపాటు భారత్‌పై అమెరికా ఆంక్షలు విధించడంతో చమురు కొనుగోళ్లు తగ్గాయి. భారత్-రష్యా స్నేహానికి ఆర్థిక మూలస్తంభంగా ఉన్న ఈ కొనుగోళ్ల తగ్గింపు రష్యాకు కొంత ఆర్థిక ఒత్తిడిని పెంచుతోంది. ఈ సమయంలో పుతిన్ పర్యటన జరగడం విశేషం. ఈ నేపథ్యంలో ఈ పర్యటన కేవలం రక్షణ లేదా ఎనర్జీ రంగాలకే పరిమితం కాకుండా రష్యాకు వివిధ మార్గాల్లో చేదోడుగా నిలిచే కొత్త ఆర్థిక, వ్యూహాత్మక ఒప్పందాలను అన్వేషించేందుకు ఉపయోగపడనుంది.

**కీలక ఒప్పందాలపై అంచనా..**

భారత్‌కు రష్యా అతిపెద్ద రక్షణ భాగస్వామి. ఈ పర్యటనలో అత్యంత కీలకమైన ఒప్పందాలు ఈ రంగంలోనే కుదిరే అవకాశం ఉంది. ట్రయంఫ్ క్షిపణి రక్షణ వ్యవస్థ డెలివరీలు, దాని భవిష్యత్తు నిర్వహణపై డీల్స్ కుదిరే అవకాశం ఉంది. అసాల్ట్ రైఫిల్స్ తయారీకి సంబంధించిన వెంచర్లపై ఒప్పందం. అత్యాధునిక రక్షణ సాంకేతికత అభివృద్ధిలో సంయుక్త పరిశోధన, అభివృద్ధి డీల్స్ జరిగే అవకాశం ఉంది. చమురు, రక్షణ పరికరాల కొనుగోళ్ల విషయంలో డాలర్‌పై ఆధారపడటాన్ని తగ్గించడం ఇరు దేశాల లక్ష్యం. దీని కోసం దేశీయ కరెన్సీలైన రూపాయి, రూబుల్ ద్వారా చెల్లింపులు జరిపే సుస్థిర యంత్రాంగాన్ని ఏర్పాటు చేయడంపై కీలక ఒప్పందం కుదిరే అవకాశం ఉంది. ఇది రష్యాపై ఉన్న అంతర్జాతీయ చెల్లింపుల ఆంక్షల ప్రభావాన్ని తగ్గించడానికి సహాయపడుతుంది.

**అంతరిక్ష, అణు శక్తి సహకారం**

భారతదేశంలో రష్యన్ సాంకేతికతతో నిర్మిస్తున్న కూడంకుళం అణు విద్యుత్ ప్లాంట్ తదుపరి యూనిట్ల నిర్మాణాన్ని వేగవంతం చేసేందుకు ఒప్పందాలు. గగన్‌యాన్ వంటి భారత అంతరిక్ష కార్యక్రమాలకు రష్యా సహకారం, సంయుక్త ఉపగ్రహ నిర్మాణ ప్రాజెక్టులపై చర్చలు జరిగే అవకాశం ఉంది.

**కొత్త డీల్స్**

చమురు కొనుగోళ్లు తగ్గిన నేపథ్యంలో రష్యా భారత్ నుంచి ఆర్థికంగా, వ్యూహాత్మకంగా ప్రయోజనం పొందేందుకు కొన్ని కొత్త రకాల డీల్స్‌కు ప్రాధాన్యత ఇచ్చే అవకాశం ఉంది. ఆంక్షల ప్రభావం తక్కువగా ఉన్న రంగాలపై దృష్టి సారిస్తూ భారత్ నుంచి రష్యాకు వ్యవసాయ ఉత్పత్తులు, ఫార్మాస్యూటికల్స్ (ముఖ్యంగా జెనరిక్ మందులు), ఐటీ సేవలను పెద్ద ఎత్తున ఎగుమతి చేసుకునేందుకు ప్రోత్సాహం లభిస్తుంది. రష్యా ఈ రంగాల్లో భారత్‌ను సుస్థిర సరఫరాదారుగా గుర్తించడానికి ఒప్పందం కుదిరే అవకాశం ఉంది.

**రవాణా కారిడార్లు**

ఇంటర్నేషనల్ నార్త్-సౌత్ ట్రాన్స్‌పోర్ట్ కారిడార్ కార్యకలాపాలను వేగవంతం చేయడంపై ఇరు దేశాలు ఆసక్తిగా ఉన్నాయి. ముంబైని రష్యాలోని సెయింట్ పీటర్స్‌బర్గ్‌తో కలుపుతూ ఇరాన్ మీదుగా సాగే ఈ కారిడార్ పశ్చిమ దేశాల ద్వారా కాకుండా, ప్రత్యామ్నాయ వాణిజ్య మార్గాన్ని అందిస్తుంది. ఇది రష్యా తన వస్తువులను ఇతర దేశాలకు తరలించడానికి కీలక వ్యూహాత్మక ప్రత్యామ్నాయం అవుతుంది.

**సహజ వాయువు**

చమురు కొనుగోళ్లు తగ్గినప్పటికీ రష్యా తన లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్ అమ్మకాలను భారత్‌లో పెంచేందుకు ప్రయత్నించవచ్చు. ముఖ్యంగా ఆర్కిటిక్ ప్రాంతంలోని ఇంధన ప్రాజెక్టుల్లో భారత పెట్టుబడులు పెంచేందుకు ఒప్పందాలు కుదరవచ్చు. ఈ డీల్స్ దీర్ఘకాలికంగా భారత్‌కు ఎనర్జీ సెక్యూరిటీను, రష్యాకు స్థిరమైన నిధులను అందిస్తాయి.

# ఎంత త్వరగా భూమిస్తే అంత త్వరగా నిర్మిస్తాం

## సెమీకండక్టర్ ల్యాబ్ కోసం రూ.4,500 కోట్లు



**న్యూఢిల్లీ:**దేశంలోని ప్రభుత్వ రంగ సెమీకండక్టర్ ఫ్యాబ్రికేషన్ ప్లాంట్ అయిన సెమీకండక్టర్ ల్యాబొరేటరీ (ఎస్‌సీఎల్)ను వచ్చే మూడేళ్లలో పూర్తిగా ఆధునీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం రూ.4,500 కోట్లు వెచ్చించనుంది. ఈమేరకు కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ, రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ వివరాలు వెల్లడించారు.ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ (మైటీ) ఆధ్వర్యంలోని స్వయంప్రతిపత్త సంస్థ అయిన ఎస్‌సీఎల్ ప్రస్తుతం అప్లికేషన్ స్పెసిఫిక్ ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్లు , ఆప్టో ఎలక్ట్రానిక్స్ పరికరాలు, ఎంఈఎంఎస్ పరికరాలకు ఎండ్ టు ఎండ్ సొల్యూషన్స్ అందిస్తోంది. ఈ సదుపాయం దేశంలోని ఏకైక ఇంటిగ్రేటెడ్ డివైస్ తయారీ యూనిట్‌గా గుర్తింపు పొందింది.'రూ.76,000 కోట్ల ఇండియా సెమీకండక్టర్ మిషన్‌లో భాగంగా ఈ రూ.4,500 కోట్ల పెట్టుబడి తోడ్పడుతుంది. ఎస్‌సీఎల్ ఉత్పత్తిని మూడేళ్లలో 100 రెట్లు పెంచాలి' అని మంత్రి అన్నారు. ప్లాంట్ విస్తరణ కోసం 25 ఎకరాల భూమిని కేటాయించాలని కేంద్రం పంజాబ్ ప్రభుత్వాన్ని అభ్యర్థించింది. 'పంజాబ్ ప్రభుత్వం ఎంత త్వరగా భూమి కేటాయిస్తే అంత త్వరగా ఎస్‌సీఎల్ విస్తరణ పూర్తవుతుంది. ఆధునీకరణ పనుల కోసం ఇప్పటికే టెండర్లు జారీ చేశాం' అని మంత్రి అన్నారు. ప్రస్తుతం 180 నానోమీటర్ నోడ్‌లో చిప్‌లు తయారు చేస్తున్న ఎస్‌సీఎల్‌ను స్టార్టప్‌లకు 'టేప్ అవుట్ ఫెసిలిటీ'గా మార్చనున్నారు.

## అంచనాల్లో 52 శాతానికి ద్రవ్యలోటు

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వ ద్రవ్యలోటు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి అక్టోబర్ చివరికి రూ.8,25,144 కోట్లుగా నమోదైంది. పూర్తి ఆర్థిక సంవత్సరానికి జీడీపీలో ద్రవ్యలోటు 4.4 శాతం (15.69 లక్షల కోట్లు)గా ఉండొచ్చన్నది కేంద్రం అంచనా. ఇందులో మొదటి ఏడు నెలల కాలంలో 52.6 శాతానికి ద్రవ్యలోటు చేరినట్టు తెలుస్తోంది.క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాలానికి ద్రవ్యలోటు అంచనాల్లో 46.5 శాతంగా ఉండడం గమనార్హం. ప్రబుత్వ వ్యయాలు-ఆదాయం మధ్య అంతరమే ద్రవ్యలోటు. కంట్రోలర్ జనరల్ ఆఫ్ అకౌంట్స్ (సీజీఏ) విడుదల చేసిన డేటా ప్రకారం.. అక్టోబర్ చివరికి ప్రభుత్వానికి రూ.18 లక్షల కోట్ల ఆదాయం వచ్చింది.ఇందులో రూ.12.74 లక్షల కోట్లు పన్ను రూపంలో రాగా, రూ.4.89 లక్షల కోట్లు పన్నేతర ఆదాయం.

# ఉక్రెయిన్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ రాజీనామా

- ప్రకటించిన అధ్యక్షుడు జెలెన్‌స్కీ
- అవినీతి ఆరోపణల నేపథ్యంలో పరిణామం

**కీవ్:** రష్యా దురాక్రమణను ఎదుర్కొంటున్న ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీకి రాజకీయపరంగా గట్టి ఎదురుదెబ్బే తగిలింది.ఆయన సన్నిహితుడు, చీఫ్ ఆఫ్ స్టాఫ్‌గా వ్యవహరిస్తున్న ఆండ్రీ యెర్మాక్(54) పదవికి రాజీనామా చేశారు. అవినీతి వ్యతిరేక విభాగం అధికారులు శుక్రవారం రాజధాని కీవ్‌లోని ఆయన నివాసంతోపాటు ఆఫీసులో సోదాలు జరిపారు. ఈ నేపథ్యంలోనే ఆండ్రీ రాజీనామా చేసినట్లు జెలెన్‌స్కీ ప్రకటించారు.తప్పు చేసినట్లు ప్రత్యేకంగా ఎలాంటి అభియోగాలు లేనప్పటికీ, రాజీనామా చేయాలన్న ఒత్తిళ్లు ఇటీవల ఆండ్రీపై పెరిగాయి. రష్యా దండయాత్రకు ముగింపు పలికేలా అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో త్వరలో జరగాల్సిన చర్చల బాధ్యతను జెలెన్‌స్కీ ఈయనకే అప్పగించారు. అయితే, ఎలాంటి వదంతులు, ఊహాగానాలు రాకూడదనేదే తన లక్ష్యమని జెలెన్‌స్కీ చెప్పారు. ఆండ్రీ స్థానంలో ఎవరికి బాధ్యతలు అప్పగించేదీ సంప్రదింపుల అనంతరం అతిత్వరలో ప్రకటిస్తానన్నారు.ఒక దేశ భక్తుడిగా ఉక్రెయిన్‌ను ధీటైన స్థానంలో నిలబెట్టినందుకు ఆయన ఆండ్రీకి ధన్యావాదాలు తెలిపారు. ఆండ్రీ యెర్మాక్ కూడా అధికారుల సోదాలపై స్పందించారు. 'దర్యాప్తు బృందానికి ఎటువంటి అభ్యంతరాలు తెలపలేదు. వారితో పూర్తిగా సహకరిస్తున్నా. నా లాయర్లు కూడా నాతో ఉన్నారు'అని టెలిగ్రామ్‌లో పేర్కొన్నారు.

# వెండికి హాల్‌మార్కింగ్..

- వజ్రాభరణాలపై ఫ్రేమ్‌వర్క్
- త్వరలో అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు

**న్యూఢిల్లీ:**బంగారు ఆభరణాలకు హాల్‌మార్కింగ్ తప్పనిసరి చేసిన ప్రభుత్వం.. విలువైన లోహాల స్వచ్ఛతను ధ్రువీకరించేలా దాని పరిధిని విస్తరించాలని చూస్తోంది. అందులో భాగంగా వెండి ఆభరణాలకు కూడా హాల్‌మార్కింగ్‌ను తప్పనిసరి చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. అంతేకాకుండా సహజ, ల్యాబ్ గ్రోన్ డైమండ్ల మధ్య వ్యత్యాసాన్ని వినియోగదారులకు స్పష్టంగా తెలియజేయడానికి, ఈ విభాగంలో పారదర్శకత, జవాబుదారీతనం తీసుకురావడానికి ఒక ఫ్రేమ్‌వర్క్‌ను కూడా ప్రభుత్వం తీసుకురానుంది.

**వెండికి హాల్‌మార్కింగ్**

జూన్ 2021 నుంచి బంగారు ఆభరణాలకు తప్పనిసరి అయిన హాల్‌మార్కింగ్ వెండి ఆభరణాల కోసం సెప్టెంబర్ 1, 2025 నుంచి స్వచ్ఛందంగా ప్రవేశపెట్టబడింది. అయితే దీన్ని రానున్న రోజుల్లో తప్పనిసరి చేయాలని యోచిస్తోంది. ఇటీవల సీఐఐ నిర్వహించిన రత్నాలు, ఆభరణాల సదస్సులో వినియో గదారుల వ్యవహారాల కార్యదర్శి నిధి ఖరే మాట్లాడుతూ..



బంగారు హాల్‌మార్కింగ్‌కు పరిశ్రమ, వినియోగదారుల నుంచి లభించిన సానుకూల స్పందన ప్రభుత్వాన్ని ప్రోత్సహించిందని తెలిపారు. 'వెండి హాల్‌మార్కింగ్‌ను స్వచ్ఛందంగా చేయడం ద్వారా దాని ఫలితం, ప్రజల స్పందన ఎలా ఉందో పరిశీలిస్తున్నాం. వెండి ఆభరణాలను సైతం ధరించే మన దేశంలోని వినియోగదారులు తాము కొనుగోలు చేస్తున్న ఉత్పత్తుల విశ్వసనీయతను నిర్ధారించడం చాలా ముఖ్యం' అని ఖరే అన్నారు. వెండి హాల్‌మార్కింగ్‌ను తప్పనిసరి చేయడానికి ముందు పరిశ్రమ ప్రతిస్పందనకు తగినంత సమయం ఇస్తున్నామని వివరించారు.తప్పనిసరి హాల్‌మార్కింగ్(బంగారానికి) ప్రారంభమైనప్పటి నుంచి మొత్తం 57.17 కోట్ల బంగారు ఆభరణాలకు హాల్‌మార్క్ చేసినట్లు తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే సుమారు 8.44 కోట్ల వస్తువులకు హాల్‌మార్క్ వేసినట్లు పేర్కొన్నారు.

బీఐఎస్ పరిధిలో..

బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) ఆధ్వర్యంలో ఈ హాల్‌మార్కింగ్ ప్రక్రియ జరుగుతోంది. ప్రస్తుతం 2 లక్షల మందికి పైగా ఆభరణాల వ్యాపారులు, 65 లైసెన్స్ పొందిన రిఫైనర్లు బీఐఎస్‌లో నమోదు చేసుకున్నారు. అస్సేయింగ్ హాల్‌మార్కింగ్ సెంటర్ల విస్తరణను కూడా ప్రభుత్వ పరిశీలిస్తుంది. దేశవ్యాప్తంగా 1,603 బీఐఎస్ గుర్తింపు పొందిన ఏహెచ్‌ఎల్‌లు, 109 ఆఫ్ సైట్ కేంద్రాలు పనిచేస్తున్నాయి. అయితే ఈ కేంద్రాల్లో దేన్నీ ప్రభుత్వం నిర్వహించకపోవడం గమనార్హం.సాంకేతికత అభివృద్ధి చెందడంతో ల్యాబ్ గ్రోన్ డైమండ్లు వాణిజ్యపరంగా లాభదాయకంగా మారాయి. అయితే, సహజ వజ్రాల కంటే అవి చౌకగా ఉన్నందున వినియోగదారులు మోసపోకుండా ఉండటానికి పారదర్శకతను నిర్ధారించేలా ఫ్రేమ్‌వర్క్ అవసరమని ఖరే నొక్కి చెప్పారు. పరిశ్రమపై భారం పడకుండా పారదర్శకత తీసుకురావడానికి ప్రభుత్వం జెమ్స్ అండ్ జ్యువెలరీ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ ఇతర సంస్థలతో కలిసి పనిచేస్తోందని తెలిపారు.

# 1 నుంచి పార్లమెంట్ శీతాకా సమావేశాలు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**పార్లమెంటు శీతాకాల సమావేశాలు డిసెంబర్ 1వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. డిసెంబర్ 19వ తేదీ వరకూ ఈ సమావేశాలు జరుగుతాయి. సమావేశాలకు ముందు సంప్రదాయంగా నిర్వహించే అఖిలపక్ష సమావేశాన్ని ఆదివారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నారు. రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన ఈ అఖిలపక్ష సమావేశం జరుగనుంది. సమావేశాలు సజావుగా జరిగేలా సహకరించాలని కేంద్రం కోరనుంది. సోమవారం నుంచి ప్రారంభమయ్యే పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో పలు అంశాలపై చర్చకు విపక్షం కసరత్తు చేస్తోంది. సర్‌తో సహా ఢిల్లీ కాలుష్యం తదితర అంశాలు చర్చకు వచ్చే అవకాశం ఉంది. ఇకపోతే కీలకమైన పౌర అణు ఇంధన రంగంలో ప్రైవేటు రంగానికి ఆహ్వానం పలికేందుకు ఉద్దేశించిన 'ది ఆటమిక్ ఎనర్జీ బిల్లు-2025'తో సహా 10 కీలక బిల్లులు సభ ముందుకు రానున్నాయి. పార్లమెంటులో ప్రవేశపెట్టనున్న కీలకమైన బిల్లులలో 'ది ఆటకమిక్ ఎనర్జీ బిల్లు-2025'తో పాటు సెక్యూరిటీస్ మార్కెట్స్ కోడ్ బిల్లు (ఎస్ఎంసి)-2025, జాతీయ రహదారుల (సవరణ) బిల్లు, అర్బిట్రేషన్, కాన్సిలియేషన్ (సవరణ) బిల్లు, ఇన్సూరెన్స్ చట్ట (సవరణ) బిల్లు, ఇన్సాల్వెన్సీ, దివాలా కోడ్ (సవరణ) తదితర బిల్లు ఉండనున్నాయి.

# మేడ్చల్ మల్కాజిగిరి రాజకీయాలకు కొత్త స్వరం





- ప్రజానాయకుడిగా ఎదుగుతున్న శంభీపూర్ రాజు
- ప్రజా సేవలో చురుకైన అడుగులు
- యువతకు ప్రేరణ - పేదలకు ఆసరా
- సమస్యలు విని.. వెంటనే పరిష్కారం
- భవిష్యత్తు నాయకుడిగా ఆశలు రేకెత్తిస్తున్న వ్యక్తిత్వం

**మేడ్చల్ బ్యూరో, నవంబర్ 29 (జనంసాక్షి) :** మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా రాజకీయాల్లో కొత్త తరం గాలి వీస్తోంది. గడిచిన కొన్నేళ్లుగా యువ నాయకుడిగా పేరొందుతూ, ప్రజల సమస్యలకు రాత్రింబవళ్లు తేడా లేకుండా స్పందిస్తూ, 'రాజు అన్నయ్య'గా మారిపోయిన వ్యక్తి శంభీపూర్ రాజు. గ్రామీణ ప్రాంతాల నుంచి నగర శివారు వరకు ప్రతి వర్గం వాడిగా ఆయన్ను గుర్తిస్తున్నారు. రాజకీయ నాయకుడు కంటే ప్రజానాయకుడిగా ఆయన ప్రయాణం జిల్లా రాజకీయ చరిత్రలో కొత్త అధ్యాయాన్ని లిఖిస్తోంది.
యువజన కార్యకర్తగా ప్రస్థానం మొదలుపెట్టిన శంభీపూర్ రాజు ఇటీవల జిల్లా స్థాయిలో అందరి దృష్టినీ ఆకర్షిస్తున్నారు. పేద విద్యార్థులకు ఉచితంగా నోట్స్, పోటీ పరీక్షల కోచింగ్ కిట్లు అందజేయడం, గ్రామాల్లో క్రీడా సామాగ్రి పంపిణీ, యువతకు ఫిట్‌నెస్ కార్యక్రమాలు నిర్వహించడం, వృద్ధులు-దివ్యాంగులకు వైద్య శిబిరాలు, సహాయక పరికరాలు ఇవ్వడం, మాదకద్రవ్య వ్యసనం నిర్మూలనకు అవగాహన ర్యాలీలు, రోడ్లు, వీధి దీపాలు, తాగునీటి సమస్యలు – ఏదైనా సరే.. అధికారులతో సమన్వయం చేసి వెంటనే పరిష్కారం చూపడం ఆయన ప్రత్యేకతగా నిలిచింది. విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ సెషన్లు, స్కాలర్‌షిప్‌ల కోసం సహాయం, పల్లెల్లో చదువు కేంద్రాలు, గ్రంథాలయాల ఏర్పాటుకు ఆయన చేపట్టిన చర్యలు యువతలో ఆశలు నింపుతున్నాయి. రాత్రి పూట కూడా ప్రజల ఇళ్ల తాకులు కొట్టి సమస్యలు వినడం, ఫోన్‌లోనైనా స్పందించడం ఆయన రాజకీయ శైలికి కొత్త నిర్వచనం ఇస్తోంది.

ఇటీవల మొబైల్ హ్యాకింగ్ ఘటనలపై వెంటనే స్పందించి ప్రభుత్వాన్ని అప్రమత్తం చేయడం ఆయనలోని బాధ్యతాయుత నాయకత్వాన్ని మరోసారి నిరూపించింది. జిల్లా వ్యాప్తంగా విద్యార్థి సంఘా లు, మేధావులు, సామాజిక వేత్తలు ఒక్కటే అంటున్నారు – "పనితీరే నాయక త్వానికి ప్రమాణం అయితే.. శంభీపూర్ రాజు దానికి జీవంత ఉదాహరణ". ప్రజలు కొత్త తరం నాయకత్వం కోసం ఎదురుచూస్తున్న ఈ తరుణంలో ఆయన చురుకైన కార్యచరణ, అభివృద్ధి దృక్పథం, ప్రజలకు చేరువైన వైఖరి జిల్లా రాజకీయాల్లో కీలక మలుపుగా మారబోతోందని అందరూ భావిస్తు న్నారు. రాబోయే రోజుల్లో మేడ్చల్-మల్కాజ్‌గిరి రాజకీయ భవిష్యత్తును శంభీపూర్ రాజు ఆకట్టుకునే అవకాశం ఉందని పలువురు రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

# జర్నలిస్టులకు ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో హెల్త్ స్కీం అమలు చేయాలి

- ఇండ్ల స్థలాల విషయంలో కొత్త విధానం తీసుకురావాలి
- మంత్రి పొంగులేటికి ఫెడరేషన్ వినతి.. త్వరలో సంఘాలతో భేటి
- సమస్యలన్నీ పరిష్కరిస్తామని మంత్రి హామీ



**హైదరాబాద్, నవంబర్ 29 (జనంసాక్షి) :** జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కమిటీ రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలు, రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేసింది. శనివారం హైదరాబాద్ లోని సచివాలయంలోని తన చాంబర్లో టీడబ్ల్యూజేఎఫ్ అడ్ హాక్ కమిటీ కన్వీనర్ పి రాంచందర్, ప్రధాన కార్యదర్శి బి.బసవపున్నయ్య ఉపాధ్యక్షులు బి. రాజశేఖర్, పి రాధిక, గుడిగ రఘు, కార్యదర్శి ఈ చంద్రశేఖర్, హెచ్ యూజే అధ్యక్షులు బి అరుణ్ కుమార్, నాయకులు అన్నిన ప్రశాంత్ తదితరులు మంత్రిని కలిశారు. దాదాపు గంటపాటు జర్నలిస్టుల సమస్యలపై చర్చించారు. వెంటనే అక్రిడిటేషన్లు ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో హెల్త్ స్కీం అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఇండ్లస్థలాల విషయంలో కొత్త విధానం తీసుకురావాలని మంత్రిని కోరారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఇండ్లస్థలాల సమస్యపై జర్నలిస్టు సంఘాలు, సీనియర్ జర్నలిస్టులతో సమావేశం నిర్వహించి పరిష్కరించాలని కోరారు. చనిపోయిన జర్నలిస్టులకు రూ. 20 లక్షల ఎక్స్ గ్రేషియా చెల్లించాలని కోరారు. మహిళా జర్నలిస్టులకు రాత్రి పూట రవాణా సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. దేశంలోని ఇతర రాష్ట్రాల మాదిరిగా రిటైర్డైన జర్నలిస్టులకు పెన్షన్ విధానం అమలు చేయాలని కోరారు. రాష్ట్ర, జిల్లా స్థాయి అక్రిడిటేషన్ కమిటీలు ఏర్పాటు చేయాలనీ, జర్నలిస్టులపై దాడులకు సంబంధించి అటాక్స్ కమిటీని నియమించాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు స్పందించిన మంత్రి పొంగులేటి.. త్వరలో జర్నలిస్టుల సంఘాలతో సమావేశం నిర్వహించి సమస్యలన్నీ పరిష్కరిస్తామని ఫెడరేషన్ నాయకులకు హామీ ఇచ్చారు. అంతకుముందు సమాచార శాఖ డైరెక్టర్ కిషోర్ బాబు, అదనపు డైరెక్టర్ డిఎస్ జగన్‌లను కలిసిన టిడబ్ల్యూజెఎఫ్ నాయకులు వినతిపత్రాలు అందజేశారు.

# ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నిబంధన తొలగించాలి

**టియుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు సత్యనారాయణ**



**నవాబుపేట్, నవంబర్, 29( జనం సాక్షి) :** నవాబుపేట్ మండల పరిధిలోని టి యు టి ఎఫ్ ఉపాధ్యాయ లకు సభ్యత్వ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారుశనివారం టియుటిఎఫ్ వికారాబాద్ జిల్లా అధ్యక్షులు సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహిస్తూ సర్వీస్‌లో ఉన్న టీచర్లకు టెట్ (టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్) తప్పనిసరి చేస్తూ ఇటీవల ప్రభుత్వం తెచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్( టి యు టి ఎఫ్ ) జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు పి. సత్యనారాయణ రెడ్డి, బి. సుదర్శన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.
శనివారం నవాబ్ పెట్ మండలంలో సంఘ సభ్యత్వ కార్యక్రమం ప్రారంభించి మండలంలోని పలు ఉన్నత, ప్రాథమిక పాఠశాలలు చించల్ పేట్,అక్నాపూర్, నారెగూడ, గంగ్యాడ, ఎల్లకొండ,లింగంపల్లి, పుల్ మామిడి, నవాబుపేట్ బడులను సందర్శించి ఉపాధ్యాయులకు సభ్యత్వం ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, టెట్ ఏర్పాటుకు (2011) ముందే నియామకమైన ఉపాధ్యాయులకు, అంతకుముందు లేని కొత్తగా ఏర్పాటు అయిన టెట్ పరీక్ష రాయమనడం విద్దూరమైనదని ఉపాధ్యాయ లోకం, సమాజం విస్మయ పోయేలా ఉందని కావున సర్వీసులో ఉన్న టీచర్లకు టెట్ పరీక్ష మినహాయింపు ఇవ్వాలని వారు పేర్కొన్నారు. ఉపాధ్యాయులకు పాత సమస్యలు తీరక పోగా ఎప్పటికప్పుడు కొత్త సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయ,ఉద్యోగుల పెండింగ్ బిల్లులు వెంటనే క్లియర్ చేయాలని, పి ఆర్ సి రిపోర్ట్ వెంటనే తెప్పించి అమలు చేయాలని, సిపిఎస్, 317 ఉపాధ్యాయు లకు సరైన న్యాయం చేయాలని ,హెల్త్ కార్డ్స్ వంటి ఉపాధ్యాయుల ప్రాథమిక సమస్యలను ప్రజా ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బాధ్యులు దేవయ్య , జిల్లా బాధ్యులు వీరయ్య, అనిల్ కుమార్, ప్రదీప్ కుమార్,అంజయ్య, సుధాకర్ గౌడ్, గోపాల్, నవాబుపేట్ మండల అధ్యక్ష కార్యదర్శులు మహిపాల్, జనార్దన్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూమిని ప్రజా అవసరాలకు వినియోగించండి



**నిజాంపేట్ నవంబర్ 29 (జనం సాక్షి) :** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం దుండిగల్ మండల పరిధిలోని మల్లంపేట్ సర్వేనెంబర్ 258(4.5 ఎకరాలు)55(1 ఎకరం) లు గల ప్రభుత్వ భూమిని చిన్నచిన్న ఆక్రమణలు తొలగించి, ప్రభుత్వ స్థలాన్ని ప్రభుత్వ పాఠశాల , రైతు బజార్ బస్సు డిపో కోసం స్వాధీనం చేసుకొని వినియోగించాలని శనివారం ఆకుల సతీష్ నేతృత్వంలో ఆంజనేయులు తో కలిసి దుండిగల్ ఎమ్మార్వో రాజేశ్వర్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆకుల సతీష్ %ఆంజనేయులు మాట్లాడుతూ మల్లంపేట గ్రామం, సర్వే నెంబర్ 258 నందు4.25 ఎకరాల ప్రభుత్వ భూమి కలదు. ప్రభుత్వ భూమి నందు నాలుగు ప్రాంతాల్లో జరిగినాయి. ప్రభుత్వ భూమి నందు గతంలో రైతు బజార్ కోసం పనులు కూడా చేయడం జరిగింది. ఈ ప్రభుత్వ భూమి నందు దాదాపు ఎకరం వరకు ఆక్రమణ అక్రమ నిర్మాణాలు చోటు చేసుకున్నాయి. ఔటర్ రింగ్ రోడ్డు ఆనుకొని ఉన్న 4.25 ఎకరాల (100 కోట్ల విలువైన) ప్రభుత్వ స్థలం 90% ఖాళీగా ఎలాంటి ఫెన్సింగ్ లేకపోవడం వల్ల రోజు ఆక్రమణకు గురవుతుంది. కావున ఇట్టి విలువైన ప్రభుత్వ స్థలం మల్లంపేట ప్రభుత్వ పాఠశాల ప్రతి వర్షాకాలంలో వర్షపు నీటి వల్ల మునిగిపోతుంది. కావున ప్రభుత్వ పాఠశాలకి గతంలో రైతు బజార్ కోసం కేటాయించిన విధంగా దీనిని కేటాయించడమే కాకుండా ఫెన్సింగ్ వేసి రక్షించాలని ,అంతేకాకుండా ఈ ప్రభుత్వ స్థలాన్ని ఆనుకొని షెడ్ లు నిర్మించి వ్యాపారం చేస్తున్న వాటిని కూల్చివేయాలని ,అంతేకాకుండా ఇటీవల వెంచర్ వారు ఫెన్సింగ్ వేసిన దాంట్లో కూడా కొద్ది స్థలము వస్తుంది. కావున తక్షణమే సర్వే చేసి ప్రభుత్వ భూమిని గుర్తించి ఆక్రమణలను తొలగించడమే కాకుండా ప్రభుత్వ భూమిని పాఠశాల/రైతు బజార్ కోసం కేటాయించడం ద్వారా ఆక్రమణలకు గురి కాకుండా రక్షించడమే కాకుండా, ప్రజా అవసరాలకు వినియోగించిన లక్ష్యం నెరవేరుతుంది అని,సర్వే నెంబర్ 55 ప్రభుత్వ స్థలం సర్వే చేసి గుర్తించి, టెంపుల్ నందు బస్సు పార్కింగ్ కి సరిపోవడం లేదు కాబట్టి మల్లంపేటకు వచ్చే బస్సుల పార్కింగ్ కోసం/ బస్ స్టాప్ కోసం కేటాయించాలని మనవి. అంతేకాకుండా సర్వే నెంబర్ 55 ప్రభుత్వ భూమి పక్కనే రెండు వెంచర్లలో కొద్దిగా కలిసి ఉన్నది కాబట్టి సర్వే చేసి దాన్ని కూడా పరిరక్షించాలని ఇదే సర్వే నెంబర్లు పాపులను తొలగించి ఈ భూములను ప్రజా అవసరాలకు వినియోగించాలని కోరడం జరిగింది.తక్షణమే స్పందించినవారు మండల తాసిల్దార్ తప్పకుండా ప్రభుత్వ స్థలాన్ని కాపాడి ,ప్రజా అవసరాలకి ఉపయోగపడే విధంగా రక్షించడమే కాకుండా వినియోగిస్తామని హామీ తెలిపారు. ఈ కార్యక్రమంలో అరుణ్ రావు, పండు, హరిదాస్, బాలరాజు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ కాలువ-నీటి పైపులైన్ల పనులు త్వరగా పూర్తి చేయాలి

**కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి**



**అల్వాల్, నవంబర్ 29 (జనంసాక్షి):** అల్వాల్ డివిజన్‌లో సాగుతున్న కాలువ, నీటి పైపులైన్ల పెండింగ్ పనులపై కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. శనివారం హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ మేనేజర్ చారితో సమావేశమై సమస్యలున్న కాలనీల వివరాలు తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను మరింత ఆలస్యం చేయకుండా తక్షణమే పూర్తి చేయాలని కార్పొరేటర్ ఆదేశించారు.

## మీ ఓట్లుకో దండం.. ఆ పదవికో దండం

# వద్దురా నాయన సర్పంచ్ పదవి

**వద్దే వద్దు దేవుడా అని మొక్కుతున్న మాజీ సర్పంచ్ రాజు**

**మరోసారి పోటీచేస్తే నా బతుకు ఆగమవడం ఖాయం**




- సొంత డబ్బులతో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ, సీసీ రోడ్లు నిర్మించాను
- ఐదేళ్లలో పైసా రాలేదు..14 కేసులు తప్ప
- రూ.50లక్షల అప్పులు చేసి బర్రెను మేపుతూ జీవనం సాగిస్తున్నాను
- ఓ తాజా మాజీ సర్పంచ్ ఆవేదన

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి) :** మీ ఓట్లుకో దండం ఆ సర్పంచ్ పదవికో దండం ఆ సర్పంచ్ పదవి వల్ల ఇంకా లక్షల రూపాయల అప్పుల్లోనే ఉన్న కనీసం చెత్త ట్రాక్టరు డీజిల్కు డబ్బులు లేకపోతే అప్పులు తెచ్చి నడిపించిన వద్దు రా నాయన మళ్లీ సర్పంచ్ పదవి వద్దే వద్దు దేవుడా అని మొక్కుతున్న ఓ మాజీ సర్పంచ్ పై జనంసాక్షి ప్రత్యేక కథనం రంగారెడ్డి జిల్లా కొత్తూర్ మండలం మక్తగూడ గ్రామ మాజీ సర్పంచ్ రాజు గత ఎన్నికల్లో సర్పంచ్ గా గెలిచాడు కానీ ప్రస్తుతం మాత్రం సర్పంచ్ ఎన్నికల వైపు కనీసం కన్నెత్తి చూడడం లేదు ఇప్పటికే ఆ సర్పంచ్ పదవితో లక్షల రూపాయల అప్పుల పాలయ్యానని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు ఒకసారి గెలిచి... ఐదేళ్లు సర్పంచ్ గా పనిచేసిన వారిలో ఎంతమంది మళ్లీ పోటీ చేయాలని అనుకుంటున్నారో ఏమో గానీ ఓ తాజా మాజీ సర్పంచ్ చెబుతున్న మాటలు మాత్రం ఐదేళ్లు పనిచేసిన వారికి ఎదురైన రకరకాల ఇబ్బందులను తేటతెల్లం చేసేలా ఉన్నాయి. "సర్పంచ్ పదవి అంటే గౌరవమర్యాదలు దక్కుతాయని అనుకున్నాను. గ్రామాభివృద్ధి కోసం ఎంతో చేశాను. చివరికి నాకు 14 పోలీసు కేసులు, రూపాయలు 50లక్షల అప్పు బహుమానంగా మిగిలాయని మాజీ సర్పంచ్ కాట్న రాజు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు సర్పంచ్ పదవులు అలంకార ప్రాయంగా మారాయని.. మరోసారి సర్పంచ్ పదవి వద్దు బాబోయ్ వద్దు.. మళ్లీ పోటీచేస్తే నా బతుకు ఆగమవడం పక్కా అని వణికిపోతున్నరాయన. రంగారెడ్డి జిల్లా కొత్తూర్ మండల పరిధిలోని మక్తగూడ గ్రామపంచాయతీ 2019లో కొత్తగా ఏర్పడింది. అప్పటి ఎన్నికల్లో గ్రామానికి చెందిన కాట్న రాజు సర్పంచ్ గా గెలు పొందారు. గ్రామపంచాయతీ భవనం, డంపింగ్ యార్డు, స్మశానవాటిక, పల్లె ప్రకృతి వనాన్ని ఆయన సొంత ఖర్చులతో నిర్మించారు. అయితే, ప్రభుత్వ స్థలం కబ్జాను ప్రశ్నించిన తనపై అక్రమంగా ఎస్సీ కేసు సహా 14 కేసులు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నుంచి నిధులొస్తాయనే నమ్మకంతో సొంతంగా రూ.50లక్షలు వెచ్చించి భూగర్భ మురుగు నీటి కాలువల నిర్మాణాలు, సీసీ రోడ్లు పూర్తి చేశానని.. ఖర్చు చేసిన డబ్బుల్లో పైసా కూడా రాలేదని రాజు చెప్పారు. బిల్లుల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఎన్నికలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. అవకాశం ఉన్న మళ్లీ పోటీలో ఉండనని, వ్యవసాయం చేసుకొని జీవనం సాగిస్తానని రాజు ఆవేదన వ్యక్తం చేశారు...

## గ్లోబల్ సమ్మిట్‌లో ఎలాంటి

# పొరపాట్లకు తావివ్వొద్దు

**జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి**



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి: (జనంసాక్షి) :** రంగారెడ్డి జిల్లా కందుకూర్ మండలం మైలుంట తాండలో నిర్వహించే గ్లోబల్ సమ్మిట్ కు సంబంధించి చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి ఎక్కడ ఎలాంటి పొరపాట్లు జరగకుండా పూర్తి చేయాలని సంబంధిత అధికారు లకు సూచించారు శనివారం రంగారెడ్డి జిల్లా కందుకూర్ మండలం మైలుంట తాండలో డిసెంబర్ 8 మరియు 9వ తేదీలలో గ్లోబల్ సమ్మిట్ నిర్వహించే ప్రాంతాన్ని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి పరిశీలించారు వివిధ ప్రాంతాల నుండి దేశాల నుండి డెలిగేట్స్ వస్తున్న సందర్భంగా విమానాశ్రయం నుండి గ్లోబల్ సమ్మిట్ నిర్వహించే ప్రాంతం వరకు రోడ్ల పరిశుభ్రంగా ఉండాలని, గ్లోబల్ సమ్మిట్ నిర్వహించే ప్రాంతంలో పారిశుద్యం చేపట్టాలని మున్సిపల్ కమిషనర్లకు సూచించారు. చెత్తను ఎప్పటికప్పుడు తరలించాలని సూచించారు. గ్లోబల్ సమ్మిట్ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లలో ఎక్కడ ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రతి ఒక్కరూ తమ విధులని బాధ్యతో నిర్వహించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. రోడ్లపై ఎక్కడ ఎలాంటి చెత్త లేకుండా చూడాలని, గుంతలు లేకుండా, నీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) శ్రీనివాస్, కందుకూర్ ఆర్డీఓ జగదీశ్వర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్లు, ఆర్ అండ్ బి అధికారులు నేషనల్ హైవే అధికారులు, సంబంధిత ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



## నామినేషన్ స్వీకరణ కేంద్రాలను సందర్శించిన అడిషనల్ డీసీపీ

**ఖమ్మం (జనంసాక్షి) :** గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ స్వీకరణ కేంద్రాలను అదనపు డిసిపి (లా అండ్ ఆర్డర్) ప్రసాద్ రావు సందర్శించారు. కొణిజర్ల, తనికెళ్ల, మంచుకొండ, అమ్మపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయాలలో ఎన్నికల సిబ్బందితో మాట్లాడారు. నామినేషన్ ముగింపు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏర్పాటు చేసిన అదనపు పోలీస్ బందోబస్తుతో నిశితంగా పర్యవేక్షించాలని పోలీస్ అధికారులకు సూచించారు. ప్రతి ఒక్కరు ఎన్నికల ప్రవర్తన నియమావళి తప్పకుండా పాటించాలని విజ్ఞప్తి చేశారు.

# భక్త రామదాసు కళాక్షేత్రాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలి

**ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**



**ఖమ్మం బ్యూరో (జనంసాక్షి) :** ఖమ్మం నగరంలో సాంస్కృతిక ప్రదర్శనలకు వేదికగా ఉన్న భక్త రామదాసు కళాక్షేత్రం ఆధునీకరణకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. శనివారం భక్త రామదాసు కళాక్షేత్రాన్ని మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య తో కలిసి జిల్లా కలెక్టర్ సందర్శించారు. కళాక్షేత్రం మొత్తం కలియతిరుగుతూ చేయవలసిన పనుల ను పరిశీలించారు. కళా క్షేత్రంలో చేపట్టవలసిన ఆధునీకరణ పనులపై టాప్ (ఫ్రూఫ్ లీకేజ్, ఎంట్రీ, ఎగ్జిట్ గేట్, పార్కింగ్, కలర్ వాష్, పరిసరాలలో పచ్చదనం కోసం మొక్కల పెంపు, నిర్మాణం, మరమ్మత్తు పనులపై అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ కళలకు, కళాకారులకు పుట్టినిల్లయిన ఖమ్మం జిల్లాలో ఉన్న భక్త రామదాసు కళాక్షేత్రాన్ని ఆధునీకరించి, మౌలిక వసతులు ఏర్పాటు చేయాలన్నారు.
భక్తరామదాసు కళాక్షేత్రం ఆకర్షణీయంగా తయారు చేయడం, సౌండ్, ఆడియో వ్యవస్థను మెరుగు పర్చడం, పూర్తి స్థాయిలో లైటింగ్ ఏర్పాటుకు చర్యలు, గోడలకు సంప్రదాయక వాల్ పెయింటింగ్స్, సీటింగ్ అరేంజ్మెంట్స్, టాప్ ప్రూఫ్ వాటర్ లీకేజ్, కళాక్షేత్రం బయట పరిసరాల్లో గ్రీనరి చర్యలు, పూర్తి స్థాయి మరమ్మత్తు పనులకు ప్రతిపాదనలు సమర్పించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఇంటీరియర్ మరింత ఆకర్షణీయంగా తయారు చేయడం, కళాక్షేత్రంలో ఏసి ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని, వెనుక ఉన్న ప్రేక్షకులకు డయాస్ స్పష్టంగా కనిపించేలా రూపొందించాలని అన్నారు. కళాక్షేత్రం సౌండ్ ప్రూఫ్, లోపల ఆడియో మైక్ వ్యవస్థ పక్కాగా ఉండేలా చూడాలని తెలిపారు. ముందు సీట్లలో కూర్చునే ప్రేక్షకులకు ఇబ్బంది కలగకుండా స్టేజీ ఏర్పాట్లు ఉండాలని కలెక్టర్ అన్నారు. ఇంజనీరింగ్ అధికారులు తయారుచేసిన మోడల్ డిజైన్ మ్యాప్ లు, ఆర్కిటెక్చర్ రూపొందించిన నమూనా వీడియోను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వెంట జెడ్పి సీఈఓ దీక్షా రైనా, పంచాయతీరాజ్ ఇఇ మహేష్ బాబు, మున్సిపల్ డిప్యూటీ కమీషనర్ శ్రీనివాస్, అసిస్టెంట్ కమిషనర్ అనిల్, ఖమ్మం అర్బన్ తహసీల్దారు సైదులు, మునిసిపల్ డిఇ ధరణి కుమార్, టౌన్ ప్లానింగ్ అధికారి సంతోష్, అధికారులు, పాల్గొన్నారు.

# ఘనంగా మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా దీక్షా దివస్ కార్యక్రమం

**నిజాంపేట్ నవంబర్ 29( జనం సాక్షి) :** బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ,కేటీఆర్ పిలుపు మేరకు మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఆధ్వర్యంలో శనివారం గండిమైసమ్మలోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన దీక్షా దివస్ ఎంతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద, మాధవరం కృష్ణా రావు, బండారి లక్ష్మా రెడ్డి, మర్రి రాజశేఖర్ రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్ రావు, మల్కాజ్గిరి పార్లమెంట్ ఇంచార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్ నందికంటి శ్రీధర్ జిల్లా తాజా మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేతలు తదితరులు పాల్గొన్నారు.



# దేశాయిపేట ఏకగ్రీవం

- సర్పంచ్‌తో పాటు ఎనిమిది వార్డు సభ్యులు పోటీలేకుండా ఎన్నిక
- ఉప సర్పంచ్‌గా సింగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి
- గతంలో నిర్మల్ పురస్కారం సాధించిన ఘనత - మళ్లీ అదే బాటలో అడుగు
- ఆలయ నిర్మాణమే ప్రేరణ - గ్రామసభలో ఒక్కటైన తీర్మానం

**చొప్పదండి, నవంబర్ 29 (జనంసాక్షి) :** చొప్పదండి మండలంలోని దేశాయిపేట గ్రామ పంచాయతీ మరోసారి ఏకగ్రీవ ఎన్నికలతో రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. సర్పంచ్ పదవి నుంచి ఎనిమిది వార్డు సభ్యుల పదవుల వరకు ఒక్క నామినేషన్‌తోనే పోటీ లేకుండా ఎన్నిక పూర్తయింది. ఈ ఏకగ్రీవ విజయానికి ముఖ్య కారణం – గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శివాలయ పనులను వేగవంతం చేయాలన్న గ్రామస్థుల ఒక్కటైన తీర్మానం. శనివారం నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసిన తర్వాత అధికారులు ఈ ఏకగ్రీవ ఎన్నికను ప్రకటించారు. వడ్లకొండ తిరుమల సర్పంచిగా, వార్డు సభ్యులుగా ఒడ్నాల శశిధర్, పెరుమాండ్ల పద్మ, కనకం తార, గొడుగు నరసయ్య, పెరుమండ్ల రేణుక, సింగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి, ఎలుకపల్లి గంగరాజు, పెరుమండ్ల శిరీష అనే ఎనిమిది మంది ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. త్వరలో జరగనున్న మొదటి సమావేశంలో సింగిరెడ్డి ప్రవీణ్ రెడ్డిని ఉప సర్పంచిగా కూడా ఏకగ్రీవంగా ఎన్నుకోనున్నట్టు గ్రామస్థులు సంతోషంగా చర్చించుకుంటున్నారు. గత పంచాయతీ పరిపాలనా కాలంలోనే దేశాయిపేట రాష్ట్ర స్థాయిలో నిర్మల్ గ్రామ పురస్కారాన్ని సాధించి గుర్తింపు పొందింది. అదే స్ఫూర్తిని కొనసాగిస్తూ ఈసారి కూడా పోటీలు పక్కనపెట్టి, గ్రామాభివృద్ధితో పాటు శివాలయ నిర్మాణ పనులను పూర్తి చేయడమే లక్ష్యంగా అందరూ ఏకమై పాలకవర్గాన్ని ఎన్నుకున్నారు. “ఆలయం పూర్తయ్యే వరకు రాజకీయాలు అవసరం లేదు, అభివృద్ధి – సేవ మాత్రమే ముఖ్యం” అని గ్రామసభలో ప్రజలు ఒక్కటే స్వరంతో తీర్మానం చేశారు. ఈ ఏకగ్రీవ ఎన్నికతో మండలంలోని ఇతర గ్రామాలకూ దేశాయిపేట ఆదర్శంగా నిలుస్తోందని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# ప్రకృతి వనరులపై కాంగ్రెస్ విధ్వంసం

## గుంపుల చెక్ డ్యాంపై సిట్టింగ్ జడ్జితో న్యాయవిచారణ చేపట్టాలి

**పెద్దపల్లి, నవంబర్ 29 (జనంసాక్షి):** పెద్దపల్లి–కరీంనగర్ జిల్లాల సరిహద్దులో రూ.24 కోట్లతో నిర్మించిన గుంపుల–శంభునిపల్లి చెక్‌డ్యామ్ ధ్వంసానికి గురికావడంపై బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గొట్టిముక్కుల సురేష్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం పెద్దపల్లిలోని తన నివాసంలో మానేరు పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు అంబటి కరుణాకర్ రెడ్డితో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. “బీఆర్ఎస్ హయాంలో మొదలైన ప్రకృతి వనరుల విధ్వంసాన్ని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తోంది. ఇసుక దోపిడీ మరింత తీవ్రమైంది. నవంబర్ 22న ఇరిగేషన్ డీఈ జమ్మికుంట పోలీస్ స్టేషన్‌లో రూ.3 కోట్ల ఆస్తి నష్టంపై ఫిర్యాదు చేశారు. నవంబర్ 23న తీసిన ఫోటోల్లో జిలెటిన్ స్టిక్స్‌తో చెక్‌డ్యామ్ పేల్చిన ఆనవాళ్లు స్పష్టంగా కనిపిస్తున్నాయి” అని సురేష్ రెడ్డి ఆధారాలతో సహా ప్రదర్శించారు. చెక్‌డ్యామ్ కూల్చివేత గత బీఆర్ఎస్ ప్రభుత్వ నాణ్యతా లోపమా.. లేక ఉద్దేశపూర్వక పేలుడా.. అనేది తేల్చాలంటూ సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరపాలని, నిపుణుల కమిటీ వేసి తక్షణ నివేదిక ఇప్పించాలని డిమాండ్ చేశారు. “పెద్దపల్లి ప్రస్తుత ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే ఇద్దరూ మానేరు పేరుతో కోట్లు కొల్లగొట్టారు. చెక్‌డ్యామ్ పేల్చివేత వల్ల వాగులో చుక్క నీరు లేకుండా పోయిందని, భూగర్భ జలాలు 2–3 మీటర్ల లోతుకు పడిపోయాయని, రబీ సీజన్‌లో నాట్లు వేసిన రైతులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూలిన గుంపుల, మడక సహా అన్ని చెక్‌డ్యామ్‌లను తక్షణం పునర్నిర్మించాలని, నిర్వహణ–నిఘాకు ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయాలని, జిల్లా సాండ్ కమిటీ చైర్మన్ అయిన కలెక్టర్ పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. “పేల్చివేసిన వారిని ఎవరినీ వదలము.. న్యాయస్థానంలో దోషులుగా నిలబెడతాం” అని సురేష్ రెడ్డి హెచ్చరించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామని తెలిపారు.

# స్కై స్కూల్‌లో ఫుడ్ ఫెస్టివల్



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి (జనంసాక్షి) :** వేములవాడ మున్సిపల్ పరిధిలోని సాయినగర్‌లో గల స్కై స్కూల్లో శనివారం ఫుడ్ ఫెస్టివల్‌కు కార్యక్రమం నిర్వహించారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు రోజువారీగా అందించే వివిధ రకాల ఆరోగ్య కర ఆహారాలను వేడుకలో ప్రదర్శించగా, పిల్లలు కూడా పెద్దలతో కలిసి వంటకాలను తయారుచేసి తీసుకువచ్చారు. స్కూల్ కరస్పాండెంట్ మహేష్ మాట్లాడుతూ సాంప్రదాయ వంటకాల ప్రాధాన్యం, బయట లభించే జంక్‌ఫుడ్ వల్ల కలిగే నష్టాలను తెలియజేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. హెూమ్‌మేడ్ ఫుడ్ ఆరోగ్యానికి ఎంత మేలు చేస్తుందో ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. పిల్లలకు ఆకుకూరలు, స్వీట్లు, పెరుగు, పీచుపదార్థాలు, బెల్లంతో తయారు చేసిన వంట కాలు అందించడం ద్వారా రోగనిరోధక శక్తి పెరుగుతుందని చెప్పారు. ప్రీ–ప్రైమరీ పిల్లలకు సహజం గా లభించే పండ్ల ప్రయోజనాలు కూడా ఉపాధ్యాయులు వివరించారు. వంటకాలను ఎలా తయారు చేశారో, వాటిని తినడం వల్ల కలిగే లాభాలు ఏమిటో విద్యార్థులే స్వయంగా వివరించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఫుడ్ ఫెస్టివల్ విద్యార్థుల్లో ఆరోగ్యకర ఆహారపు అలవాట్లను పెంపొందించే విధంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ప్రిన్సిపాల్ జమున, ఉపాధ్యాయులు స్రవంతి, శైలజ, అర్చన, స్రవంతి, శ్రీ హేమకళ, మమత, చంద్రకళ, అంజలి, సూపర్వైజర్ రాము పాల్గొన్నారు.

## వాసవి గ్రూప్ కార్యాలయం ఎదుట

# బాధితుల ఆగ్రహం

### రెండేళ్లుగా ఫ్లాట్లు అందని ఆవేదన




- మొత్తం వసూలు చేసినా.. 2021 నుంచి ఇప్పటివరకు అప్పగించని గృహాలు
- ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని బాధితుల డిమాండ్

**నిజాంపేట, నవంబర్ 29 (జనంసాక్షి):** కుతుబుల్లాపూర్ నియోజకవర్గం బాచుపల్లి ప్రధాన రోడ్డుపై ఉన్న వాసవి గ్రూప్ ఆఫ్ డెవలప్‌మెంట్ (వాసవి అర్బన్ డెవలప్‌మెంట్) కార్యాలయం ఎదుట శనివారం రెండు వందల మంది బాధిత ఫ్లాట్ కొనుగోలుదారులు తీవ్ర ఆందోళనకు దిగారు. ఒక దశలో ఉద్రిక్త వాతావరణం నెలకొని పోలీసులు అప్రమత్తమయ్యారు. బాధితులు తమ ఫిర్యాదులో తెలిపిన విషయాలు: 2021లోనే ఫ్లాట్లు అప్పగిస్తామని హామీ ఇచ్చి, దాదాపు అందరి నుంచి పూర్తి మొత్తం (లక్షల్లో ఈఎంఐల ద్వారా కోట్ల రూపాయలు) వసూలు చేసినా ఇప్పటివరకు ఒక్క ఫ్లాట్ కూడా అప్పగించలేదని, మూడేళ్లు దాటినా ప్లాట్లు/ఫ్లాట్లు రిజిస్ట్రేషన్ చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. “మా జీవిత ఆదర్శాలన్నీ ఈ ఇంటి కోసమే పెట్టాం.. ఇప్పుడు ఈఎంఐ కడుతూనే ఉన్నాం, కానీ ఇల్లు మాత్రం లేదు” అని ఒక మహిళ ఏడుస్తూ చెప్పారు. బాధితులు యాజమాన్యం తీరుపై మండిపడుతూ “ఇచ్చిన గడువులు ఎన్నో దాటాయి, ఫోన్ చేస్తే సమాధానం లేదు, కార్యాలయానికి వస్తే బయటే నిలబెడతారు” అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రోజు కార్యాలయం ముందు నిరసనకు దిగడంతో ఉద్రిక్తత ఏర్పడగా, స్థానిక పోలీసులు రంగంలోకి దిగి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. “రెండు వందల కుటుంబాలు రోడ్డున పడ్డాయి. ఇప్పటికైనా ప్రభుత్వం జోక్యం చేసుకుని వాసవి గ్రూప్ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకుని, మాకు న్యాయం చేయాలి” అని బాధితులు డిమాండ్ చేశారు.

# జాబ్ మేళను సద్వినియోగం చేసుకోండి

## యాడ్ ఎన్జీవో వ్యవస్థాపకులు కొంకటి రవి

**కరీంనగర్, నవంబర్, 29 (జనంసాక్షి) :** రెటైల్ స్పార్క్, యూత్ యాక్షన్ ఫర్ రూరల్ డెవలప్మెంట్ స్వచ్ఛంద సంస్థ భాగస్వామ్యంలో డిసెంబర్ ఒకటో తేదీన కరీంనగర్ పట్టణంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు యాడ్ ఎన్జీవో వ్యవస్థాపకుడు కొంకటి రవి ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ముకరంపురలో ఎస్ ఆర్ జూనియర్ కళాశాల ఎదురుగా ఉన్న తమ కార్యాలయంలో ఈ జాబ్ మేళా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కరీంనగర్ జిల్లాకు చెందిన నిరుద్యోగ యువతీ, యువకులు జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కమ్యూనిటీ స్పోక్స్ పర్సన్స్, ప్యాకింగ్, సార్టింగ్, డెలివరీ విభాగాలలో తొలి దశలో 50 మంది నిరుద్యోగులకు అవకాశం కల్పించడం జరుగుతుందని ఎంపికైన అభ్యర్థులకు రూ. 15000 నుండి వేతనం ఉంటుందన్నారు.

రైతులను నేరుగా వినియోగదారులతో కలపడం, నాణ్యమైన ఆహార ఉత్పత్తులు మార్కెట్ ధరల కన్న తక్కువతో నేరుగా వినియోగదారుల ఇళ్లకు చేర్చడం, చిన్న దుకాణదారులను డిజిటల్ విధానంలో అనుసంధానం చేయడం లక్ష్యంతో రెటైల్ స్పార్క్ సంస్థ పనిచేస్తున్నదని వివరించారు. రైతుల అభివృద్ధి, నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి, చిన్న దుకాణదారుల ఆర్థిక ప్రగతికి రెటైల్ స్పార్క్ దోహదపడుతుందన్నారు. అదేవిధంగా మహిళ స్వయం సహకార సంఘాల ఉత్పత్తులను ఈ సంస్థ మార్కెటింగ్ చేస్తుందన్నారు. మహిళ సంఘాలలో సభ్యులుగా ఉన్న కుటుంబాలకు చెందిన యువతకు ఉద్యోగ అవకాశాలలో తొలి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఈ ప్రగతి యజ్ఞంలో భాగస్వాములు కాదలచిన నిరుద్యోగ యువతీ, యువకులు ఉపాధి అవకాశాల కోసం ఈ ఫోన్ నెంబర్ 94418 00040 లో సంప్రదించాలని సూచించారు.

# చివరి రోజు అధిక సంఖ్యలో నామినేషన్లు



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి నవంబర్ 29 (జనంసాక్షి) :** పంచాయతీ ఎన్నికల నామినేషన్ల చివరి రోజు భారీ సంఖ్యలో నమోదు అవుతున్నాయి. రెండు రోజులుగా మందకొడిగా సాగిన నామినేషన్లు శనివారం మంచి రోజు కావడంతో ఆశవాహులు అందరూ నామినేషన్లు వేస్తున్నారు. నామినేషన్ కేంద్రంలో సాయంత్రం 5 గంటల వరకు గడువు ఉండడంతో అధికారులు మాత్రం ఐదు గంటల లోపు కార్యాలయం లోపల ఉన్న వారికి నామినేషన్ వేయడానికి అనుమతులు ఇస్తున్నారు. గురు, శుక్రవారం అష్టమి, నవమి కావడంతో రెండు రోజులు నామినేషన్లు వేసేందుకు అభ్యర్థులు ముందుకు రాలేదు. చివరి రోజు సాయంత్రం 5 గంటల లోపు నామినేషన్లు వేసేందుకు నామినేషన్ కేంద్రాల వద్ద అభ్యర్థులు అధిక సంఖ్యలో వున్నారు. నామినేషన్లు పూర్తి కావడానికి చాల సమయం పడుతుందని ఎన్నికల ఆదికారులు తెలిపారు.

## కరీంనగర్ జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్

# విజేతలకు బహుమతులు ప్రధానం



**కరీంనగర్, నవంబరు 29 (జనంసాక్షి) :** జన విజ్ఞాన వేదిక తెలంగాణ ప్రతిష్టాత్మకంగా రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న చెకుముకి సైన్స్ సంబరాలలో భాగంగా కరీంనగర్ జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ టా లెంట్ టెస్ట్ ఈ నెల 28 వ తేదీ శుక్రవారం రోజున కరీంనగర్ పట్టణం లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ( పురాతన) ఆవరణలో నిర్వహించడం జరిగింది. ఈ పరీక్షలో కరీంనగర్ జిల్లా లోని అన్నీ మండలాలకు చెందిన ప్రభుత్వ, ప్రైవేటు, ప్రభుత్వ రెసిడెన్షియల్ ఇంగ్లీషు, తెలుగు మీడియం కు చెందిన 8, 9,10వ తరగతి చెందిన మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ విజేతలు ఆయా పాఠశాలలు తరపున పాల్గొన్నారు. ఈ పరీక్షలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులై ఈ నెల కరీంనగర్ పట్టణంలో 26, 27, 28 తేదీలలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలకు ఈ క్రింది వారు ఎంపిక అయినారు. ప్రభుత్వ పాఠశాలల విభాగం నుండి ఎస్ అర్చన, ఎం. సుష్మిత, సానియా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మల్కాపూర్, కొత్తపల్లి మండలం ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలో విభాగం నుండి జి. హర్షిత్, ఎం. అజయ్, ఆర్. సామ్రాట్ తెలంగాణ సంగీక సంక్షేమ సైనిక్ స్కూల్ రుక్మాపూర్ చొప్పదండి మండలం ప్రైవేటు పాఠశాలల విభాగం నుండి కె. ఓం. కార్తికేయ, శివరాత్రి రిశాల్, ఓ.శివ స్మరన్ రెడ్డి ఆల్ఫోర్స్ ఇ బిటెక్నో స్కూల్ కొత్తపల్లి ప్రభుత్వ తెలుగు మీడియం పాఠశాలల విభాగం నుండి జి. అంజలి, పి. సంజన, బి. వైష్ణవి ప్రభుత్వ ఉన్నత పాఠశాల సవరన్ కోతిరాంపూర్ కరీంనగర్ ఎంపికైనారు. వీరికి జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణాధికారి శ్రీనివాస్, జిల్లా సైన్స్ అధికారి జైపాల్ రెడ్డి బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ఆర్.వెంకటేశ్వర్ రావు, కార్యదర్శి దేవేందర్ రామరాజు, మేజీషియన్ మల్లేశం, మల్లయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## డిసెంబర్ 31 లోపు ప్రీ మెట్రిక్ స్కాలర్షిప్ దరఖాస్తు సమర్పించాలి

### జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి సంగీత

**పెద్దపల్లి,నవంబర్ 29(జనంసాక్షి) :** డిసెంబర్ 31 లోపు ప్రీ మెట్రిక్ స్కాలర్షిప్ దరఖాస్తు సమర్పించాలని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి సంగీత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దపల్లి జిల్లాలోని ప్రభుత్వ అండ్ ఎయిడెడ్ పాఠశాలలోని గిరిజన విద్యార్థిని, విద్యార్థులకు 3వ తరగతి నుండి 8వ తరగతి వరకు న్యూ స్కీం పథకం క్రింద, 9 నుంచి 10వతరగతి వరకు రాజీవ్ విద్యా దీవెన పథకము క్రింద గిరిజన విద్యార్థిని, విద్యార్థులకు ప్రి–మెట్రిక్ స్కాలర్షిప్ ఈ–పాస్ లాగిన్ లో డిసెంబర్ 31 లోపు రిజిస్ట్రేషన్ చేసి హార్డ్ కాపీలను జిల్లా గిరిజన అభివృద్ధి ఆధికారి కార్యాలయం కరీంనగర్ గారికి త్వరితగతిన సమర్పించాలని, ఇతర వివరాలకు 9502664044 ఫోన్ నెంబర్ నందు సంప్రదించ గలరని గిరిజన అభివృద్ధి అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# కరీంనగర్‌లో ఘనంగా ప్రారంభమైన జిల్లా స్థాయి బాల వైజ్ఞానిక మేళ

- ప్రకృతితో అనుసంధానం.. సమాజానికి మేలు చేసే ఆవిష్కరణలు రూపొందించండి : కలెక్టర్ పమేలా సత్పతి
- గత 10 ఏళ్లుగా రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో కరీంనగర్ ఆధిపత్యం
- 807 సైన్స్ ఎగ్జిబిట్లు, 126 ఇన్‌స్పైర్ మనాక్ ప్రాజెక్టులతో రికార్డు స్థాయి పాల్గొన్న విద్యార్థులు
- వికసిత భారత్ కోసం బాల శాస్త్రవేత్తలుగా ఎదగాలి - పలువురు అధికారుల పిలుపు





**కరీంనగర్, నవంబర్ 29 (జనంసాక్షి) :** కరీంనగర్ జిల్లా స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన – 2025–26, ఇన్‌స్పైర్ అవార్డ్స్ మనాక్ కార్యక్రమం శనివారం కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ–టెక్నో పాఠశాలలో ఘనంగా ప్రారంభమైంది. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు ప్రకృతితో మమేకమై, సమాజానికి ఉపయోగపడే సృజనాత్మక ఆవిష్కరణలు రూపొందించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. “మానవ జీవితాన్ని ప్రకృతితో అనుసంధానం చేయడమే నిజమైన సైన్స్ ఉద్దేశ్యం. గత పదేళ్లుగా కరీంనగర్ నుంచి రాష్ట్ర స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు సైన్స్ ఎగ్జిబిట్లు ఎంపిక కావడం మనందరికీ గర్వకారణం. ఆత్మనిర్భర భారత్, వికసిత భారత్ లక్ష్యాల కోసం విద్యార్థులే బాల శాస్త్రవేత్తలుగా ఎదగాలి” అని ఆమె పేర్కొన్నారు. జిల్లాలోనే ఏకైక సైన్స్ మ్యూజియం ఉండడం ప్రత్యేకత అని, ప్రభుత్వ–ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు దాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఈసారి జిల్లా స్థాయిలో 807 సైన్స్ ఎగ్జిబిట్లు, 126 ఇన్‌స్పైర్ మనాక్ ప్రాజెక్టులు దరఖాస్తు చేసుకున్నాయని జిల్లా సైన్స్ అధికారి జైపాల్ రెడ్డి తెలిపారు. వ్యవసాయాభివృద్ధి, ప్లాస్టిక్ నివారణ, పునరుత్పాదక శక్తి, నీటి సంరక్షణ, ఆరోగ్యం–పరిశుభ్రత, గణిత నమూనాలు తదితర ఏడు అంశాల్లో ప్రదర్శనలు జరుగుతున్నాయి. ప్రతి అంశం నుంచి ఉత్తమ ప్రదర్శనను రాష్ట్ర స్థాయికి పంపిస్తామని ఆయన వివరించారు.

జిల్లా విద్యాశాఖాధికారి శ్రీరామ్ మొండయ్య మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి భారీ స్థాయిలో పాల్గొనడం సంతోషకరమని, విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించేందుకు ఉపాధ్యాయులు ల్యాబ్‌లను సమర్థవంతంగా వినియోగించుకోవాలని కోరారు. అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ఇంజనీరింగ్, మెడిసిన్‌లతో పాటు ప్యూర్ సైన్స్ వైపు కూడా విద్యార్థులు దృష్టి పెట్టాలని, ఇన్‌స్పైర్ అవార్డ్స్‌ను సద్వినియోగం చేసుకుని దేశ శాస్త్ర సాంకేతిక రంగాన్ని ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు కార్యదర్శి ఎస్. భగవంతయ్య, సెక్టోరియల్ అధికారులు కర్ర అశోక్ రెడ్డి, ఆంజనేయులు, మిల్కూరి శ్రీనివాస్, కృపారాణి, కొత్తపల్లి ఎంఈవో ఆనందం, అన్ని మండలాల ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘ నాయకులు, వేలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రతి రైతుకు యూరియా అందేలా పక్కా ప్రణాళిక


- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**పెద్దపల్లి,నవంబర్ 29(జనంసాక్షి) :** జిల్లాలోని ప్రతి రైతుకు అవసరమైన యూరియా అందేలా పక్క ప్రణాళిక రూపకల్పన చేశామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. శనివారం పెద్దపల్లి మండలం బ్రాహ్మణపల్లి రైతు వేదిక వద్ద యూరియా అమ్మకాల పర్యవేక్షణ యాప్ పై ఎరువుల డీలర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ గత ఏడాది కంటే 7 నుంచి 8 వేల మెట్రో టన్నుల యూరియా సరఫరా అధికంగా జరిగినప్పటికీ వానాకాలం సమయంలో యూరియా సమస్య ఉత్పన్నమైందని, తనిఖీల లో 4 డీలర్ల షాప్ లోను సీజ్ చేయడం జరిగిందని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి రైతుకు అవసరమైన మేర యూరియా అందాలనే లక్ష్యంతో ప్రభుత్వం యూరియా అమ్మకాల పర్యవేక్షణ యాప్ ప్రవేశ పెట్టిందని అన్నారు. యాప్ ద్వారా రైతులు పద్ధతి ప్రకారం సాగు చేసే పంటల ఆధారంగా యూరియా అమ్మకాలు జరపాలని తెలిపారు. రైతులు సాగు చేస్తున్న పంట, ఎంత యూరియా అవసరం అవుతుంది, ఇప్పటి వరకు ఎంత యూరియా కొనుగోలు చేశారు, ఇంకా ఎంత అవసరం ఉంది వంటి వివరాలు యాప్ లో నమోదవుతాయని అన్నారు. రైతు అవసరానికి మించి యూరియా కొనుగోలు చేయకుండా ఈ యాప్ ద్వారా నియంత్రించే అవకాశం ఉందని అన్నారు. ఎరువుల డీలర్లు తప్పనిసరిగా యూరియా విక్రయం సమయంలో ఈ యాప్ వినియోగించి యూరియా అమ్మకం వివరాలను వీటిలో నమోదు చేయాలని కలెక్టర్ తెలిపారు. యూరియా కృత్రిమ కొరత సమస్య యాప్ ద్వారా తొలగిపోతుందని అన్నారు. యాసంగి సీజన్ కు అవసరమైన మేర యూరియా పెద్దపల్లి జిల్లాలో అందుబాటులో ఉందని, ప్రతి ఒక్క రైతుకు యూరియా చేరేందుకు ఈ వ్యవస్థ ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. ఈ యాప్ ను ప్రతి ఒక్క డీలర్ తప్పనిసరిగా వినియోగించుకొని రైతులకు ఇబ్బంది కాకుండా చూడాలని, యాప్ వినియోగించని డీలర్ల పై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్, పిడిఏ అంజని, యూరియా డీలర్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రం నిధులకోసమే గ్రామపంచాయతీ ఎన్నికలు

- మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్
- గ్రామాల అభివృద్ధి బిజెపితోనే సాధ్యం
- గ్రామాల్లో బీజేపీ సర్పంచ్ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించండి
- అభివృద్ధి, సంక్షేమ పథకాలను గడపగడపకు తీసుకెళ్లాలి
- మీడియా సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాస సత్యనారాయణ



**చిగురుమామిడి నవంబర్ 29 (జనంసాక్షి):** కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులకోసమే రాష్ట్ర ప్రభుత్వం గ్రామపంచాయతీ ఎన్నికలను నిర్వహిస్తున్నదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, కరీంనగర్ జిల్లా మాజీఅధ్యక్షులు బాస సత్యనారాయణ, కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డిలు తెలిపారు. గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా పోటీ చేస్తున్న ఆశావహులతో బీజేపీ మండల అధ్యక్షులు పోలోజు సంతోష్ కుమార్ అధ్యక్షతన శనివారం చిగురుమామిడి మండల కేంద్రంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ అసలు పంచాయతీ ఎన్నికలు ఎందుకోసం జరుగుతున్నాయి, ఏం ఆశించి అభ్యర్థులను గెలిపించాలనే విషయాన్ని ప్రజలు గమనించాలని చెప్పారు. ఊరు అభివృద్ధి కావాలంటే కావాల్సిన నిధులు ఇచ్చే సత్తా ఉన్న పార్టీ ఏది..? ఆ నిధులను తెచ్చే సత్తా ఉన్న నాయకుడెవరనే విషయం ప్రజలు గమనించాలని అన్నారు. ప్రజల తరపున నిరంతరం పోరాడుతున్న పార్టీ ఏది? ఊరు సమస్యలపై నిరంతరం కొట్లాడుతున్న నాయకుడెవరని ఒక్కసారి ప్రజలు ఆలోచించాలని అన్నారు. కేంద్ర నిధుల కోసమే పంచాయతీ ఎన్నికలు జరుగుతున్నాయని, గ్రామాల అభివృద్ధి కోసం నిధులిస్తున్నది కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వమేనని అన్నారు. గ్రామాల్లో జరుగుతున్న ప్రతి పనికి పైసలు ఇచ్చింది కేంద్రమేనని, ఇంట్లో పొయ్యి వెలిగించే ఉజ్వల గ్యాస్ కనెక్షన్, తినే రేషన్ బియ్యం నుండి బయటకు వెళితే రోడ్లు, వీధి లైట్లు సహా ఆ పనులన్నింటికీ నిదులిస్తున్నది కేంద్రమేనని అన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకం కింద 100రోజులు పని కల్పించి పైసలిస్తోంది కూడా మోదీ ప్రభుత్వమేనని అన్నారు. అంగన్వాడి భవనాలు, గ్రామపంచాయతీ భవనాలు, కందకాల తవ్వకాలు, ఊరికి అవసరమైన అన్ని రకాల పనులకు కేంద్రం నుంచి వచ్చే ఉపాధి హామీ (నరేగా) నిధులే సహాయ పడుతున్నాయని పేర్కొన్నారు. ఎక్కడా లేని విధంగా బండి సంజయ్ ఎంపీ ల్యాడ్స్ నిధులతో కమ్యూనిటీ భవనాలు, సీసీ రోడ్లు, హైమాస్ట్ లైట్లు, బోర్లు, డ్రైనేజీల నిర్మాణానికి వినియోగిస్తున్నారని తెలిపారు. ఊరు బాగు కోసం వ్యాపారులు, పారిశ్రామికవేత్తలను కలిసి సీఎస్సార్ నిధులను తీసుకొచ్చి మన పిల్లలు చదువుకునే ప్రభుత్వ స్కూళ్లలో, మనం వెళ్లే ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాలన్నీ కల్పిస్తున్నారని తెలిపారు. టెన్త్ క్లాస్ విద్యార్థులకు 20వేల బ్రాండెడ్ సైకిళ్లను అందించారని తెలిపారు. పదవ తరగతి చదివే విద్యార్థులకు, పరీక్ష ఫీజులను చెల్లించారని తెలిపారు. మోడీ గిఫ్ట్ పేరిట కోట్ల రూపాయల నిధులు తీసుకొచ్చి ప్రభుత్వ ఆసుపత్రులకు అత్యాధునిక టెక్నాలజీతో వైద్య పరికరాలు అందించారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండేళ్లయినా రూపాయి ఖర్చు చేసిందా అని ప్రశ్నించారు. ఊరిని బాగు చేయడానికి ఎమ్మెల్యేలకు సొంత నిధులు ఉన్నాయా అని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో పైసలు రాక సర్పంచులు పడ్డ బాధలు, ఆత్మహత్య చేసుకున్న సందర్భాలు మనం చూస్తున్నామని అన్నారు. అందుకే బీజేపీ బలపరుస్తున్న అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పొన్నం శ్రీనివాస్, మాజీమండల అధ్యక్షులు అచ్చ రవీందర్, బీజేపీ ఓబీసీ మోర్చ జిల్లా కార్యవర్గ సభ్యులు ముంజ చంద్రయ్య గౌడ్, మాజీఉప సర్పంచ్ బుద్దర్తి మహేందర్ పటేల్, పన్యాల శ్రీధర్ రెడ్డి, కంది శంకర్ పటేల్, గందే చిరంజీవి, నక్క రాజేందర్, శ్యమకురా మోహన్ రెడ్డి, శమకూర మోహన్ రెడ్డి, దొంత కర్నకర్, కళవాల సంపత్ రెడ్డి, సిద్దెంకి అనిల్, పైసా అనిల్, తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్ సొంతూరులో సర్పంచ్ ఏకగ్రీవం

- పోటీచేసే వారి నుంచి ఒకరిని ఎన్నుకోవాలని నిర్ణయం



కొడంగల్, నవంబరు29 (జనంసాక్షి) : సీఎం రేవంత్ రెడ్డి స్వగ్రామం కొండారెడ్డిపల్లె సర్పంచ్ ఏకగ్రీవమైంది.. ఎస్సీకి రిజర్వ్ అయిన కొండారెడ్డిపల్లె సర్పంచ్ పదవికి 15 మంది పోటీ పడ్డారు. చివరికి సర్పంచ్ ఎన్నికను గ్రామ పెద్దలు ఏకగ్రీవం చేశారు.. 15 మందిలో ఒకరి పేరును సీల్డ్ కవర్‌లో ప్రకటించనున్నారు. ఎవరి పేరు వచ్చినా గ్రామం మొత్తం సమిష్టిగా ఆ నిర్ణయాన్ని గౌరవించాలనేది గ్రామ నాయకత్వం అభిప్రాయంగా చెబుతున్నారు. మరోవైపు.. మొదటి విడత పంచాయతీ ఎన్నికల నామినేషన్ల గడువు నేటితో పూర్తయ్యింది. ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు స్వీకరించినట్టు అధికారులు తెలిపారు. గురువారం నుంచి నామినేషన్లు స్వీకరిస్తుండగా శుక్రవారం సర్పంచి పదవులకు 4,901 నామినేషన్లు వచ్చాయి. దీంతో మొత్తం నామపత్రాల సంఖ్య 8,198కి చేరింది. అటు మొన్న, నిన్న కలిపి వార్డు సభ్యులకు 11,502 నామినేషన్లు దాఖలైనట్టు అధికారులు వెల్లడించారు. తొలి విడతలో 4,236 సర్పంచ్, 37,440 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీ డిసెంబర్ 3. డిసెంబర్ 11న మొదటి దశ ఎన్నికలు జరుగుతాయి. ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ జరుగుతుంది, అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుండి ఓట్ల లెక్కింపు జరుగుతుంది.

# పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలు దారుణం

- వెంటనే క్షమాపణలు చెప్పాలి: ఎమ్మెల్యే అనిరుధ్



హైదరాబాద్, నవంబరు29 (జనంసాక్షి) : కోనసీమపై తెలంగాణ నాయకుల దిష్టి పడిందని ఏపీ డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ అనడం తప్పు మాత్రమే కాదు, దారుణమని మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి వ్యాఖ్యానించారు. పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలపై ఆయన తీవ్రంగా మండిపడ్డారు. ఎప్పుడూ మేము ఆంధ్రప్రదేశ్ సంక్షేమానికే మద్దతు ఇచ్చామని, రెండు రాష్ట్రాలు సౌహార్దంతో అభివృద్ధి చెందాలని కోరుకుంటామన్నారు. కానీ ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి తెలంగాణ రాష్ట్ర విభజన అడ్డుపడిందంటే మాత్రం ఊరుకోమన్నారు. పవన్ కళ్యాణ్ వెంటనే భేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజల గురించి, తెలంగాణ ప్రాంతం గురించి తప్పుగా మాట్లాడితే సహించబోమని స్పష్టం చేశారు. తెలంగాణలో ఆంధ్ర కాంట్రాక్టర్లు కోట్లు రూపాయల స్కామ్ చేసిన సందర్భాలు ఉన్నాయని, రాబోయే రోజుల్లో వారి భరతం పడతామని ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి హెచ్చరించారు. పవన్ కళ్యాణ్‌కు తెలంగాణలో అభిమానులు ఉన్నారని, ఆయన సినిమాలను తెలంగాణ ప్రజలు ఎప్పుడూ బహిష్కరించ లేదని గుర్తుచేశారు. ప్రజల మధ్య విభేదాలు రేకెత్తించే వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని సూచించారు.

# ఆత్మత్యాగం చేసిన వారికన్నా మీరు గొప్పా?

- శ్రీకాంతచారి ఆత్మత్యాగం గుర్తుకు రావడం లేదు
- గద్దర్, కోదండరాం, అందె శ్రీ, గూడ అంజయ్యలను ఎందుకు విస్మరించారు
- కెటిఆర్ వ్యాఖ్యలను గట్టిగా తిప్పికొట్టిన ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్



హైదరాబాద్, నవంబరు29 (జనంసాక్షి) : తెలంగాణ సాధనలో అమరవీరుల త్యాగాల కంటే కేసీఆర్ దీక్షను పెద్దదని చెప్పుకోవడం సరైందా అని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ ప్రశ్నించారు. కేసీఆర్ చేసిన దీక్ష నిజంగా ఎలా జరిగిందో ప్రజలందరికీ తెలుసని, ఆ దీక్షను మహోన్నతంగా చూపించడానికి బీఆర్ఎస్ ప్రయత్నం చేయడం దారుణమని వ్యాఖ్యానించారు. ఈ మేరకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. తెలంగాణ కోసం ప్రాణాలు అర్పించిన శ్రీకాంతాచారి, యాదయ్య, ఇషాన్ రెడ్డి, కానిస్టేబుల్ కిష్టయ్య వంటి అమరవీరుల త్యాగాలు ఎంత గొప్పవో గుర్తు చేశారు. అలాంటి త్యాగాలను పక్కన పెట్టి కేసీఆర్ దీక్షను ప్రోత్సహించడం బీఆర్ఎస్ నాయకుల రాజకీయ నాటకమని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ ఉద్యమకారులకు చూపుతున్న గౌరవం ప్రత్యేకమని, కేసీఆర్ మాత్రం ఉద్యమకారులను జైల్లో పెట్టిన చరిత్ర కలిగి ఉన్నాడని దయాకర్ అన్నారు. తెలంగాణ ప్రజల రుణం తీర్చుకునే పనిలో రేవంత్ రెడ్డి ఉన్నారని, ఆయన పాలన మానవతా స్పూర్తిని ప్రతిబింబిస్తోందని పేర్కొన్నారు. పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కేసీఆర్ దీక్షపై విమర్శలు చేస్తే కేటీఆర్ ఎందుకు అంత అసహనం చూపుతున్నాడని దయాకర్ ప్రశ్నించారు. కాంగ్రెస్‌లో పనిచేసిన కాలంలో తెలంగాణ కోసం చిన్నారెడ్డి సంతకాల సేకరణలో మహేష్ గౌడ్ కీలకపాత్ర పోషించారని గుర్తు చేశారు. సాగరహారం రోజున కేసీఆర్, కేటీఆర్ ఎక్కడ ఉన్నారని కూడా ప్రశ్నించారు. బీఆర్ఎస్ నాయకత్వంపై దయాకర్ ఘాటు వ్యాఖ్యలు చేస్తూ.. కాంగ్రెస్ విలీనానికి కేసీఆర్ అవకాశవాద రాజకీయాల వల్లే అడ్డుపడ్డాడని, మిలియన్ మార్చ్‌ను కూడా వ్యతిరేకించాడని తెలిపారు. గద్దర్, కోదండరాం, అందె శ్రీ, గూడ అంజయ్య వంటి ఉద్యమకారులు కేసీఆర్‌కు నచ్చరని అన్నారు. ఉద్యమ సమయంలో మరణించిన శ్రీకాంతాచారిని బీఆర్ఎస్ గుర్తు చేసుకోవడం లేదని ఎత్తి చూపారు. సోనియా గాంధీ వల్లే తెలంగాణ ఏర్పడిందని కేసీఆర్ అనేకసార్లు చెప్పినా, అదే సోనియా గాంధీని తర్వాత అవమానించడం అతని స్వభావానికి నిదర్శనమని దయాకర్ చెప్పారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌ను చంపడానికి కేసీఆర్ ప్రయత్నించాడని ఆరోపించారు. రేవంత్ రెడ్డి సీఎం అయ్యి సోనియా గాంధీకి తెలంగాణ బహుమతి ఇచ్చారని, బీఆర్ఎస్‌గా మారిన రోజే కేసీఆర్ పార్టీలో తెలంగాణ ఆత్మ చనిపోయిందని విమర్శించారు. అందె శ్రీ అంత్యక్రియల సందర్భంగా రేవంత్ రెడ్డి చూపిన మానవత్వం అందరిని ఆకట్టుకుందని అన్నారు. కేటీఆర్ రాజీవ్ గాంధీపై వ్యాఖ్యలు చేస్తే సహించబోమని దయాకర్ హెచ్చరించారు. ప్రస్తుతం బీఆర్ఎస్‌లో 420 ముద్ర వేసుకున్న నాయకులు మాత్రమే మిగిలారని, సర్పంచ్ ఎన్నికల్లో సెంటిమెంట్ కోసం హడావిడి చేస్తున్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణ ఉద్యమం పేరిట రాష్ట్రాన్ని దోచుకున్నవారు బీఆర్ఎస్ నాయకులేనని వ్యాఖ్యానించారు.

# సర్పంచ్ బరిలో మాజీ మావోయిస్ట్

- శివంగలపల్లి సర్పంచ్ స్థానానికి పోటీకి సిద్ధం



రాజన్నసిరిసిల్ల, నవంబరు29 (జనంసాక్షి) : తెలంగాణలో జరుగుతున్న పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ స్థానానికి మాజీ మావోయిస్టు నేత జ్యోతి బరిలోకి దిగుతున్నారు. మావోయిస్టు పార్టీలో 19 సంవత్సరాలుగా పనిచేసి ప్రజా సమస్యల పోరాటానికి కృషి చేశానని, 2023 సంవత్సరంలో సంవత్సరంలో లొంగిపోయిన అనంతరం, గ్రామంలో ప్రజల సమస్యలపై దృష్టి సాధించినట్లు తెలిపారు. మూడేళ్ల క్రితం లొంగి పోయిన మాజీ మావోయిస్టు నేరెళ్ల జ్యోతి సర్పంచిగా పోటీ చేసేందుకు నామినేషన్ దాఖలు చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా శివంగలపల్లికి చెందిన నేరెళ్ల జ్యోతి 2005లో దళ సభ్యురాలిగా చేరారు. కోనరావుపేట జిల్లా పరిషత్తు ఉన్నత పాఠ శాలలో 2001లో పదో తరగతి చదివిన జ్యోతి.. 19 ఏళ్ల ప్రస్థానంలో జిల్లా కమిటీ సభ్యురాలి స్థాయికి చేరారు. రాష్ట్ర ప్రెస్ ఇన్ ఛార్జిగా కూడా బాధ్యతలు నిర్వహించారు. 2023లో అనారోగ్య కారణాలతో కరీంనగర్ ఎస్పీ సుబ్బారాయుడు ముందు లొంగిపోయారు. ప్రస్తుతం గ్రామంలోనే ఉంటున్న జ్యోతి పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లలో శివంగలపల్లి సర్పంచ్ స్థానాన్ని బీసీ మహిళకు కేటాయించారు. ప్రజాసేవ చేసే అవకాశం కోసం సర్పంచి పోటీలో నిల బడినట్లు జ్యోతి తెలిపారు.

# కెబిఆర్ పార్క్ వద్ద మల్టీ లెవెల్ పార్కింగ్

- నేడు ప్రారంభించనున్న జిహెచ్‌ఎంసి

హైదరాబాద్, నవంబరు29 (జనంసాక్షి) : భాగ్యనగరంలో తొలిసారిగా ఆటోమేటెడ్ స్మార్ట్ రోటరీ పార్కింగ్ అందుబాటులోకి రానుంది. ఆదివారం నుంచి జూబ్లీహిల్స్‌లోని కేబీఆర్ పార్క్ వద్ద జీహెచ్‌ఎంసీ ప్రారంభించనుంది. ఇప్పటికే మల్టీ లెవెల్ పార్కింగ్‌కు ట్రయల్ రన్ పూర్తి చేసింది. నగరంలో ఇదే మొదటి ఆటోమేటెడ్ స్మార్ట్ రోటరీ పార్కింగ్. ఉదయం, సాయంత్రం సమయంలో వాకింగ్‌కు వచ్చేవారితో పాటు చుట్టు పక్కల్లోని స్థానికులు వాహనాలను పార్కింగ్ చేసుకునే సదుపాయం కల్పించింది. జీహెచ్ ఎంసీ ఆధ్వర్యంలో మల్టీలెవెల్ పార్కింగ్ వ్యవస్థను నిర్మించింది నవ నిర్మాణ్ అసోసియేట్స్. ఒకేసారి 72 కార్లు పార్కింగ్ చేసే సదుపాయం ఉంది. డిజైన్, బిల్డ్, ఫైనాన్స్, ఆపరేట్, ట్రాన్స్‌ఫర్ మోడల్‌లో మల్టీ లెవెల్ పార్కింగ్‌ను నిర్వహించనుంది నవ నిర్మాణ అసోసియేట్. ముందగానే పార్కింగ్ బుక్ చేసుకునేందుకుగానూ నావిగేషన్, ఇతర సర్వీసుల కోసం ఒక మొబైల్ యాప్‌ను తీసుకురానుంది.

# స్మృతి, పలాశ్‌ల వివాహం రద్దంటూ పుకార్లు

- ఒక్క ఎమోజీతో చెక్ పెట్టిన ఇరువురు
- త్వరలోనే పెళ్లి అంటూ కుటుంబ సభ్యుల వెల్లడి



ముంబై, నవంబర్29 (జనంసాక్షి) : భారత మహిళల జట్టు స్టార్ బ్యాటర్ స్మృతి మంధాన, మ్యూజిక్ డైరెక్టర్ పలాశ్ ముచ్చల్ వివాహం వాయిదా పడిన క్రమంలో అనేక పుకార్లు షికారు చేస్తున్నాయి. వీరి వివాహం మొత్తానికే రద్దయ్యిందన్న వార్తలు ప్రచారం సాగాయి. వారు వివాహాన్ని పూర్తిగా రద్దు చేసుకున్నట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. ఈ వార్తలకు స్మృతి-పలాశ్ దిష్టి రక్ష ఎమోజీతో చెక్ పెట్టారు. వారిరువురూ తాజాగా తమ ఇన్‌స్టాగ్రామ్ బయోలో దిష్టి రక్ష ఎమోజీని చేర్చుకున్నారు. దీంతో వారిరువురి మధ్య ఎటువంటి సమస్యలు లేవనే విషయంపై స్పష్టతనిచ్చినట్లైంది. ఇటీవల ఆమె ఇన్‌స్టా ఖాతాలో పెళ్లికి సంబంధించిన పోస్టులు కన్పించకపోవడం నెట్టింట చర్చనీయాంశంగా మారింది. పలాశ్‌తో ఎంగేజ్‌మెంట్‌ను ధ్రువీకరిస్తూ.. ఎంగేజ్‌మెంట్ రింగ్‌ను చూపిస్తూ స్మృతి పోస్టు చేసిన వీడియో ఆమె ఇన్‌స్టాలో కనిపించలేదు. ఇదే వీడియోను స్మృతి స్నేహితురాలు జెమిమా, శ్రేయాంక కూడా సోషల్ మీడియా ఖాతాల నుంచి తొలగించడంతో పలాశ్‌కు, ఆమెకు మధ్య మనస్పర్థలు వచ్చాయంటూ సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. అదే సమయంలో పలాశ్ ముచ్చల్ మరో మహిళతో మంధానను కించపరుస్తూ చాట్ చేసినట్లు ఆరోపిస్తున్న స్క్రీన్‌షాట్లు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. దీంతో పలు వదంతులు వ్యాపించాయి. శుక్రవారం పలాశ్ తల్లి అమిత, ఓ ఆంగ్ల పత్రికతో మాట్లాడుతూ.. ఇప్పుడు అంతా బాగానే ఉందని, త్వరలో వారిద్దరి వివాహం జరుగుతుందని వివరించారు. 'స్మృతి మంధాన, పలాశ్ ముచ్చల్ ఇద్దరూ ప్రస్తుతం కష్టాల్లో ఉన్నారు. పలాశ్.. స్మృతిని అర్ధాంగిగా ఇంటికి తీసుకురావాలని కలలు కన్నాడు. నేను కూడా వారికి ప్రత్యేకంగా స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేసుకున్నా. ఇప్పుడంతా బాగానే ఉంది. వారిద్దరి వివాహం అతిత్వరలో జరుగుతుందని ఆమె అన్నారు. ఈ సమయంలో స్మృతి-పలాశ్ ఇన్‌స్టాలో తమ బయోను అప్‌డేట్ చేయడం గమనార్హం. ఈ ప్రకటనతో ఇక పుకార్లకు తెరపడే అవకాశం ఉందని అభిమానులు ఆశిస్తున్నారు.

# సైబర్ నేరగాళ్ల ఉచ్చులో డాక్టర్

- అధిక లాభాల పేరుతో ఉన్నది ఊడ్చివేత

హైదరాబాద్, నవంబరు 29 (జనంసాక్షి) : సైబర్ నేరగాళ్ల ఉచ్చులో ఓ డాక్టర్ సర్వం పోగట్టుకున్నాడు. మోసాలను అడ్డుకునేందుకు పోలీసులు ఎన్నో రకాలు చర్యలు తీసుకున్నప్పటికీ సైబర్ నేరగాళ్లు కొత్త పద్ధతుల్లో దూసుకుపోతున్నారు. ప్రజలను మోసం చేస్తూ భారీగా డబ్బులను కొట్టేస్తున్నారు. తమ మాయ మాటలతో ప్రజల బ్యాంకు ఖాతాల్లోని డబ్బులను ఈజీగా సొంతం చేసుకుంటున్నారు. యాప్‌లను, కొత్త లింక్‌లను ఓపెన్ చేయొద్దని, ఓటీపీలు చెప్పవద్దని పోలీసులు పదే పదే చెబుతున్నారు. అయినా కూడా సైబర్ నేరగాళ్లు రోజుకో రకం మోసాలకు తెరతీస్తున్నారు. తాజాగా తెలంగాణలో భారీ మోసం వెలుగులోకి వచ్చింది. ఓ డాక్టర్..సైబర్ నేరగాళ్ల వలలో పడి పెద్ద మొత్తంలో నగదును పోగుట్టుకున్నాడు. హైదరాబాద్‌కు చెందిన ఓ డాక్టర్‌ను సైబర్ కేటుగాళ్లు ఎంతో ఈజీగా ట్రాప్ చేశారు. పెట్టుబడుల పేరుతో దాదాపు రూ.14 కోట్లను స్వాహా చేశారు. సదరు నేరగాళ్లు డాక్టర్‌ను సోషల్ మీడియా ద్వారా సంప్రదించారు. మోనిక మాధవన్ పేరుతో ఫేస్‌బుక్‌లో డాక్టర్‌కు మెసేజ్ చేశారు. ఆపై నకిలీ ట్రేడింగ్ వెబ్‌సైట్ లింక్ పంపించారు నేరగాళ్లు. చాలా పెద్ద మొత్తంలో లాభాలు వచ్చాయని డాక్టర్‌ను నమ్మించారు. అయితే డబ్బు విత్ డ్రా చేయాలంటే ట్యాక్స్ కట్టాల్సి ఉంటుందని చెప్పుకొచ్చారు. మొదట డాక్టర్ దానిని పట్టించుకోకపోవడంతో ట్యాక్స్ పే చేయాల్సిందే అంటూ అతడిపై సైబర్ నేరగాళ్లు తీవ్ర ఒత్తడి తీసుకొచ్చారు. ఇక డబ్బులు భారీగా వస్తాయన్న భ్రమలో డాక్టర్ కూడా వచ్చే డబ్బు కోసం ఉన్న డబ్బును సైబర్ నేరగాళ్లకు సమర్పించుకున్నాడు. తాను ట్యాక్స్ పే చేసినప్పటికీ అవతలి నుంచి ఎలాంటి నగదు రాకపోవడంతో మోసపోయినట్లు గుర్తించాడు. వెంటనే సైబర్ సెక్యూరిటీ బ్యూరోకు బాధితుడు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన సైబర్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. డాక్టర్‌కు వచ్చిన మెసేజ్ ఎక్కడి నుంచి వచ్చింది?... ఎవరు పంపారు? అనే దానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఏది ఏమైనా సైబర్ నేరగాళ్ల వలలో పడి భారీ మొత్తంలో నగదును పోగుట్టుకోవద్దని ప్రజలకు సైబర్ పోలీసులు మరోసారి హెచ్చరించారు.

# సిమ్ లేకుండా వచ్చే కాల్స్‌కు చెక్

- కమ్యూనికేషన్ యాప్స్ కట్టడికి రంగం సిద్ధం
- సిమ్ బైండింగ్ తప్పనిసరి చేస్తూ కేంద్రం ఆదేశాలు

న్యూఢిల్లీ, నవంబరు29 (జనంసాక్షి) : సైబర్ నేరగాళ్లు వెబ్, ఇతర వాట్సప్, టెలిగ్రామ్, సిగ్నల్, అర్టటై వంటి కమ్యూనికేషన్ యాప్స్ ద్వారా కాల్స్ చేయకుండా కట్టడికి కేంద్రం రంగంలోకి దిగింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది. సిమ్ బైండింగ్‌ను తప్పనిసరి చేసింది. అంటే డివైజ్‌లో సిమ్ కార్డు ఉంటేనే యాప్ సర్వీసులను పనిచేసేలా చూడాలని డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్స్ సూచించింది. టెలికమ్యూనికేషన్ సైబర్ సెక్యూరిటీ సవరణ నిబంధనలు, 2025లో భాగంగా యాప్ ఆధారిత కమ్యూనికేషన్ సేవలందించే సంస్థలకు తాజాగా డాట్ ఈ ఆదేశాలు జారీ చేసింది. కమ్యూనికేషన్ యాప్స్ దుర్వినియోగం కాకుండా నిత్యం సిమ్ కార్డుతో అనుసంధానం అయ్యేలా చూడడం ఈ రూల్ ముఖ్య ఉద్దేశం. 90 రోజుల్లో ఈ నిబంధనలను అమలు చేయాలని పేర్కొంది. కొత్త నిబందనల ప్రకారం.. కమ్యూనికేషన్ యాప్స్‌ను టెలి కమ్యూనికేషన్ ఐడెంటిఫై యూజర్ ఎంటిటీస్గా పేర్కొంటారు. యూజర్ ఏ సిమ్‌తో అయితే అకౌంట్ రిజిస్టర్ చేశారో, ఆ సిమ్ మాత్రమే ఆ ఫోన్‌లో ఉంటేనే యాప్ పని చేస్తుంది. సిమ్ తీసేస్తే లేదా ఫోన్ మార్చితే యాప్ ఆటోమాటిక్‌గా లాగౌట్ అవుతుంది. ఒకవేళ యూజర్ వెబ్ బ్రౌజర్‌లో ఈ సేవలను ఉపయోగిస్తే.. సదరు ప్లాట్‌ఫామ్ ప్రతి ఆరు గంటలకు లాగౌట్ అయ్యేలా చూడాలి. మళ్లీ సేవలు పొందాలంటే క్యూఆర్ కోడ్ ద్వారా లాగిన్ అవ్వాల్సి ఉంటుంది.ప్రస్తుతం యాప్ ఇన్‌స్టలేషన్ సమయంలోనే సిమ్‌కార్డును ధ్రువీకరించుకుంటున్నారు. ఒకవేళ సదరు డివైజ్ నుంచి సిమ్‌కార్డు తొలగించినా, డీయాక్టివేట్ చేసినా సేవలు మాత్రం కొనసాగుతున్నాయి. దీంతో ఇతర దేశాల్లో ఉండే సైబర్ నేరగాళ్లు యాప్స్‌ను వినియోగించుకోవడం సాధ్యమవుతోంది. సిమ్ బైండింగ్ నిబంధనల వల్ల మోసపూరిత కార్యకలాపాలు తగ్గుతాయని సైబర్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. వీటిని వాట్సప్, టెలిగ్రామ్ వంటి సంస్థలు ఎలా అమలు చేస్తాయో చూడాలి. ఎవరైతే డీయాక్టివేట్ అయిన సిమ్‌కార్డుతో వాట్సప్ వంటి యాప్స్‌ను వినియోగిస్తున్నారో వారు కూడా ఈ నిబంధనల వల్ల సేవలు పొందలేరు. ప్రస్తుతం యూపీఐ పేమెంట్ యాప్స్ సిమ్ ఉంటేనే సేవలందిస్తున్నాయి.

# రాజధాని రైతుల నుంచి డబ్బులు డిమాండ్

- సిఆర్‌డిఎ అధికారుల తీరుపై మండిపడ్డ సిఎం
- కఠిన చర్యలు తీసుకుంటామని గట్టిగా హెచ్చరిక
- మూడు ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక జోన్లు
- మీడియాతో చిట్‌చాట్‌లో సిఎం చంద్రబాబు



అమరావతి, నవంబరు29 (జనంసాక్షి) : రాష్ట్రంలో మూడు ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. 3 ప్రాంతాల అభివృద్ధి కోసం ప్రత్యేక జోన్లు ఏర్పాటు చేస్తామన్నారు. రాజధాని రైతులంతా ఒకే గొడుగు కిందకు రావాలని పిలుపునిచ్చారు. వారు జెఎసిగా ఏర్పడి ప్రభుత్వంతో సంప్రదింపులకు సిద్దంగా ఉండాలన్నారు. ఈమేరకు సీఎం చంద్రబాబు మీడియాతో ఇష్టాగోష్ఠి సమావేశం నిర్వహించారు. అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. రైతులంతా అమరావతి ప్రాంత అభివృద్ధి అసోసియేషన్ కిందకు రావాలని, జేఏసీగా ఏర్పడితే వారితో సంప్రదిస్తూ సమస్యలు పరిష్కరిస్తామన్నారు. క్యాపిటల్ గెయిన్స్ మినహాయింపు గురించి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు వివరించాం. ఈ అంశంపై కేంద్రం చర్చించి నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. రాష్ట్ర పరిధిలో ఉన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తాం అని చంద్రబాబు చెప్పారు.. రాజధాని రైతుల నుంచి ఎవరైనా సిబ్బంది డబ్బులడిగితే తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరించారు. భూ త్యాగాలు చేసిన రైతుల సమస్యలు పరిష్కరించాలి. ఈ విషయంలో తొలుత కొంత గ్యాప్ ఉంది. నాతో సమావేశమైన అనంతరం రైతులకు అన్నింటిపైనా స్పష్టత వచ్చింది. రాజధాని రైతులు కూడా ఆనందంగా ఉన్నారు. రెండో దశ భూ సమీకరణ ఉపయోగాలను వారికి వివరించానని అన్నారు. అమరావతి ఓ మున్సిపాలిటీగా మిగిలిపోకూడదు. ఇది మహానగరంగా మారితే వచ్చే ఫలితాలను రైతులు అర్థం చేసుకున్నారు. త్రిసభ్య కమిటీ నిరంతరం రైతులతో సంప్రదింపులు జరుపుతోంది. రాజధాని అభివృద్ధి ఇక అన్‌స్టాపబుల్. రాజధాని పరిసర ప్రాంతాల్లో లేఅవుట్ల సమస్యను త్వరలోనే పరిష్కరిస్తాం అన్నారు. గోదావరి పుష్కరాల నాటికి పోలవరం పూర్తి చేసే దిశగా కృషి చేస్తున్నాం. రాష్ట్రంలో అవినీతి నిర్మూలనకు ప్రత్యేక దృష్టి పెట్టాం. త్వరలోనే కార్యాచరణ రూపొందిస్తాం అని సీఎం చంద్రబాబు తెలిపారు. రైతులకు సంబంధించిన ప్రతి పనికి సిఆర్‌డిఎ అధికారులు డబ్బులు డిమాండ్ చేయడంపై విచారణ చేయిస్తాం అన్నారు. పనుల కోసం ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లే రాజధాని రైతుల నుంచి సిబ్బంది డబ్బులు తీసుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భూమిని త్యాగం చేసిన రైతుల సమస్యలు పరిష్కరించకుండా డబ్బులు డిమాండ్ చేస్తారా అని మండిపడ్డారు. రాష్ట్రంలో మూడు ప్రాంతాల అభివృద్దే లక్ష్యంగా పని చేస్తున్నాం.. ఇందుకు అనుగుణంగా 3 ప్రాంతీయ జోన్లు ఏర్పాటు చేస్తామన్నారు. అభివృద్ధి ఏ ఒక్క ప్రాంతానికో పరిమితం కాకుండా అన్ని ప్రాంతాలు సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నామని చెప్పుకొచ్చారు. వచ్చే ఏడాది నాటికి అమరావతి నిర్మాణం ఒక కొలిక్కి వస్తుంది.. రాజధాని ప్రాంతంలో కాకుండా మిగిలిన ప్రాంతాల్లో లేఅవుట్స్ కి త్వరలోనే అనుమతి ఇస్తాం.. క్యాపిటల్ గెయిన్స్ కు సంబంధించి కేంద్రం నుంచి అనుమతులు రావాల్సి ఉందన్నారు. రాజధాని రైతులు కోరిన క్యాపిటల్ గెయిన్స్ మినహాయింపు కేంద్ర ఆర్థిక మంత్రికి వివరించాం.. కేంద్రం చర్చించి నిర్ణయం తీసుకుంటుంది.. రాష్ట్ర పరిధిలో ఉన్న సమస్యలన్నీ దశల వారీగా పరిష్కరిస్తాం.. రాష్ట్రంలో అవినీతి నిర్మూలనకు ప్రత్యేక దృష్టి పెట్టాం.. త్వరలోనే ఆ దిశగా కార్యాచరణ రూపొందిస్తామని సూచించారు.

# ఢిల్లీ పేలుడు నిందితులకు మరో పదిరోజుల జ్యుడిషియల్ కస్టడీ

న్యూఢిల్లీ, నవంబరు29 (జనంసాక్షి) : ఢిల్లీ పేలుడు కేసులో కీలక నిందితులైన డాక్టర్ ముజమ్మిల్ షకీల్ గనయి, డాక్టర్ అదీల్ అహ్మద్ రాథెర్, డాక్టర్ సహీన్ సయీద్, ముఫ్తో ఇర్ఫాన్ అహ్మద్ వాగాయ్‌లకు 10 రోజుల జ్యుడిషియల్ కస్టడీకి పాటియాలా హౌస్ కోర్టు శనివారంనాడు ఆదేశించింది. ఇంతకుముందు విధించిన 10 రోజుల కస్టడీ శనివారంతో ముగియడంతో ఈ నలుగురిని కోర్టు ముందు హాజరుపరిచారు. జమ్మూకశ్మీర్ పోలీసులు వెలుగులోకి తీసుకువచ్చిన 'వైట్ కాలర్ టెర్రర్ మాడ్యూల్'కు సంబంధించి ఇంతవరకూ ఏడుగురికి పైగా అనుమానితులను అరెస్టు చేసారు. ఈ వైట్ కాలర్ టెర్రర్ మాడ్యూల్‌కు నేరుగా ఢిల్లీ పేలుడుతో సంబంధం ఉందని దర్యాప్తు సంస్థలు గుర్తించాయి. ఆత్మహుతి పేలుడుకు సంబంధించిన ఆధారాలతో వివిధ రాష్టాల్లో సోదాలు జరుపుతున్నామని, దాడిలో ప్రమేయ మున్న వారిని గుర్తించేందుకు ఆయా రాష్ట్రాల పోలీసుల సమన్వయంతో దర్యాప్తు సాగిస్తున్నామని ఎన్ఐఏ తెలిపింది. కాగా, డాక్టర్ ముజమ్మిల్ షకీల్ గనయి అద్దెకు తీసుకున్న రెండు నివాసాలను కూడా ఢిల్లీ పోలీసులు తాజాగా గుర్తించారు. తప్పుడు సమాచారం ఇచ్చి ఆ ఇళ్లను చాలాకాలంగా గనయి వాడుకుంటున్నాడు. తాను మాజీ సర్పెంచ్‌ననీ, పండ్ల వ్యాపారం చేయాలనుకుంటున్నానని ఆ ఇంటి యజమానికి గనయి చెప్పినట్టు, ఏప్రిల్ నుంచి జూలై వరకూ నెలసరి అద్దెగా రూ.8,000 చొప్పున చెల్లించినట్టు గుర్తించారు.అ ప్రాంతానికి నాలుగు కిలోమీటర్ల దూరంలోనే అల్-ఫలా యూనివర్శిటీ ఉంది.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370